వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

## ఇద్దరు మృత్యుంజయులు



9 రోజుల తర్వాత సొరంగం నుంచి బయటకు...

1,295కు పెరిగిన మృతులు 08

సంపుటి 29, సంచిక: 77 | శనివారం | 05-09-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



### నేడు ఉపాధ్యాయ దినం
## టీచర్లకు శుభాకాంక్షలు

నేడు ఉత్తమ ఉపాధ్యాయుడు, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి. ఆయన జన్మదినాన్ని దేశం ఉపాధ్యాయ దినంగా జరుపుకుంటూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించుతున్నది. జాతిని తీర్చిదిద్దే గురువులందరికీ మా శుభాకాంక్షలు

– ఎడిటర్



### నేరస్థులు బయట తిరుగుతున్నా
# చర్యలేవి ?

నిందితుడు స్వతంత్ర భరద్వాజ్‌పై కఠినంగా వ్యవహరించాలి

పార్లమెంటు స్ట్రీట్ పిఎస్ వద్ద సిజెపి నిరసన

**న్యూఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో దాడికి సంబంధించి 'ఇన్‌ఫ్లుయెన్సర్'గా చెప్పుకునే స్వతంత్ర భరద్వాజ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) శుక్రవారం పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించింది. నిరసన సమయంలో తమ మద్దతుదారులలో ఒకరికి గాయాలైన ఘటనకు సంబంధించి సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్, సహకన్వీనర్ అశుతోష్ రాంకా, ఇతరులు పటేల్ చౌక్ నుంచి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ సౌరవ్ దాస్ విలేకరులతో మాట్లాడుతూ 'మా నిరసనలో మొదటి రోజు నుంచే ఒక మైనర్ బాలిక పాల్గొంటోంది. ఆమె తండ్రి సంజయ్ జీ కూడా ఆమెతో పాటు వస్తుంటారు. మేము శాంతియుతంగా నిరసన చేస్తున్నప్పుడు నేరపూరిత ముఠా సభ్యులు అక్కడికి వచ్చి హింసకు పాల్పడ్డారు' అని తెలిపారు. 'ఎఫ్ఐఆర్ నమోదయిన తర్వాత, తరువాయి 12లో

### భరద్వాజ్ అరెస్టు

కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన సమయంలో.. నిషా ఆజాద్ అనే కార్యకర్త తండ్రిని స్వతంత్ర భరద్వాజ్ చితకబాదాడు. అయితే ఆ కేసులో శుక్రవారం నిందితుడు స్వతంత్ర భరద్వాజ్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 72 గంటల్లోగా భరద్వాజ్‌ను అరెస్టు చేస్తామని సిజెపికి ఢిల్లీ పోలీసులు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ అరెస్టు చోటుచేసుకున్నది. బులంద్‌షెహర్‌లో పోలీసులు బృందాలు అతన్ని పట్టుకున్నాయి. గతంలోనూ అతను పోలీసులు నుంచి తప్పించుకున్నాడు.

### జంతర్ మంతర్
## నిరసనలో ఖైదీలా?

వారెలా వచ్చారు... ఎవరు తీసుకొచ్చారు? 12

అమిత్‌షా సమాధానమేమిటి: డి.రాజా

### బద్లావ్ జరూరీ హై ఆగదు...
### డిసెంబర్ 1,2,3లో దేశవ్యాప్తంగా
# 5 లక్షల మందితో
# జైల్ భరో

### సిపిఐ జాతీయ సమితి పిలుపు

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా 'బద్లావ్ జరూరీ హై' (మార్పు అవసరం) నినాదంతో రాజకీయ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని సిపిఐ నిర్ణయించింది. ప్రజల సమస్యలపై పోరాడే అన్ని శక్తులు ఏకం కావాలని... మోదీ ప్రభుత్వ విధానాలకు ప్రత్యామ్నాయ రాజకీయ దిశగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించింది. 'బద్లావ్ జరూరీ హై' అనేది ప్రజా పోరాటాల నినాదం కావాలన్నదే లక్ష్యమని తెలిపింది. మోదీ ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతప్తిని విస్తత ప్రజా ఉద్యమంగా మలిచేందుకు వరుస ఆందోళనలకు సిపిఐ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా డిసెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 'జైల్ భరో ఆందోళన్' నిర్వహించాలని, కనీసం ఐదు లక్షల మంది అరెస్టులకు సిద్ధం కావాలని పేర్కొంది. అలాగే అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని 'మత సామరస్య దినోత్సవం', నవంబరు 7న 'విప్లవ దినోత్సవం' పాటించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీలోని అజయ్ భవన్‌లో బుధ, గురువారాలలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ గిరీశ్ శర్మ అధ్యక్షతన జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గం, సమితి సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. ఆ వివరాలను సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు తరువాయి 8లో



### పరిహారంతో పాటు
## పునరావాసం కల్పించాల్సిందే

మల్లన్నసాగర్ రిజర్వాయర్ భూములపై హైకోర్టు స్పష్టీకరణ





ప్రజాపక్షం/హైదరాబాద్

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం జీవో 123 కింద అంగీకారంతో భూములు ఇచ్చిన రైతులకు భూ పరిహారంతో పాటు పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలు కల్పించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. పరిహారం తీసుకుని అంగీకార పత్రాలపై సంతకాలు చేశారనే కారణంతో పునరావాస ప్రయోజనాలను నిరాకరించరాదని తేల్చింది. సిద్దిపేట జిల్లా తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్, తరువాయి 12లో

## తాగునీటికే ప్రాధాన్యం

- కృష్ణా జలాల పంపకాలపై మరోసారి ప్రతిష్టంభన
- 50:50 వాటా కోరిన తెలంగాణ – 66:34కు ఎపి పట్టు
- ఈ నెల 4వ వారంలో కెఆర్ఎంబి పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో విస్తృతంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) కీలక సూచనలు చేసింది. ఎల్‌నినో ప్రభావం, ఉమ్మడి జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకర స్థాయిలో ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు సూచించింది. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కోసం మాత్రమే ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు విడుదల చేయవద్దని కెఆర్ఎంబి స్పష్టం చేసింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదలను నియంత్రించాలని సూచిస్తూ, రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కెఆర్ఎంబి తరువాయి 8లో

### జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17
## రాకెట్ ప్రయోగం సక్సెస్

- తొలిసారిగా కక్ష్యలోకి అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం ఇఒఎస్ – 05
- వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో కీలకం
- దేశానికి గర్వకారణమని ప్రధాని మోదీ ప్రశంస



**శ్రీహరికోట :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియోఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం ఇఒఎస్ –05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువజామున 2.55 గంటలకు జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం ఇఒఎస్ –05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్–జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8 నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జివిఎస్‌ఎల్‌వి సిరీస్‌లో ఇది తరువాయి 8లో



## కొండా బర్తరఫ్ బాధాకరం

పలుమార్లు పార్టీ లైన్ దాటినందునే చర్యలు : పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రమంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌పై టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ బర్తరఫ్ బాధకరమని అన్నారు. ఆమె పలుమార్లు పార్టీ లైన్ దాటి మాట్లాడారని.. గతంలో కూడా ఆమెపై ఫిర్యాదులు వస్తే సిఎంతో చర్చించి పరిష్కరించానని తెలిపారు. ఈ సారి నా చేతుల్లో ఏమి లేదని స్పష్టం చేశారు. కూతురు చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ తరువాయి 8లో



ప్రజాపక్షం / వికారాబాద్

### నిర్మాణాల నాణ్యతలో
# రాజీపడొద్దు

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- కొడంగల్ నియోజకవర్గంలో పర్యటన
- మద్దూరు, హకీంపేట, దౌల్తాబాద్‌లలో అభివృద్ధి పనుల పరిశీలన

కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువు లోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని తరువాయి 8లో

### స్వయంకృతాపరాధంతో
## చేజారిన పదవి

- తొలిసారి ఏడాది.. రెండోసారి రెండున్నరేళ్లు
- ముంచిన కొండా కుటుంబ దూకుడు తత్వం



ప్రజాపక్షం/హనుమకొండ

స్వయంకృతాపరాధంతో కొండా సరేఖ చేజేతులా మంత్రి పదవి నుంచి బర్తరఫ్‌కు గురయ్యేలా చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు దూకుడు తత్వం కలిగిన కొండా కుటుంబానికి అన్ని వేళలా అది కలిసిరాదని తేలింది. ఓరుగల్లు రాజకీయాల్లో సంచలనాలకు కేంద్రంగా ఉండే కొండా దంపతుల తాజా ఎపిసోడ్ కూడా బర్తరఫ్ తో మరో సంచలనంగా మారింది. రాజకీయాల్లో ప్రవేశించినప్పటి నుంచి కొండా దంపతులు దూకుడు తనమే ఆయుధంగా మలుచుకున్నారు. దాంతోనే వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బలమైన కేడర్ ను నిర్మించుకున్నారు. పరకాల నియోజకవర్గంలోని గీసుకొండ మండలం వంచినగిరికి చెందిన కొండా దంపతులు తొలుత స్థానిక సంస్థల నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు.వంచనగరి నుంచి ఎంపిటిసిగా గెలిచి గీసుకొండ ఎంపిపిగా కొండా సరేఖ గెలిచారు. తర్వాత 1999లో శాయంపేట నుంచి అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2004లో సైతం మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో పునర్విభజనలో భాగంగా జనరల్ గా ఏర్పడిన పరకాల నుంచి పోటీచేసి మూడోసారి విజయం సాధించారు.నాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ కేబినెట్ లో మంత్రిగా కొండా సురేఖ బాధ్యతలు చేపట్టారు. వైఎస్ మృతితో కొణిజేటి రోశయ్య సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కోసం ప్రయత్నించడంతో సురేఖ జగన్‌కు అండగా నిలిచారు. సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా విప్ ధిక్కరించి ఓటెయ్యడంతో ఎమ్మెల్యే పదవి కోల్పోయారు. దీంతో 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో పరకాల నుంచి పోటీచేసి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తరువాయి 8లో

## 6న ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ మహాధర్నా

కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నారు. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ ప్రతిపక్ష పాత్ర పోషించకుండా, అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఉన్న కెసిఆర్ తన తరువాయి 12లో

### గత ప్రభుత్వ వైఫల్యంతోనే
# పోలవరం ముప్పు

నిర్ణీత గడువులోగా రామాలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



ప్రజాపక్షం/భద్రాచలం

గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్య వైఖరితోనే తెలంగాణకు పోలవరం ముప్పు పొంచి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవస్థాన అభివృద్ధి పనులపై సమీక్ష అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలతోపాటు భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామపంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో పెద్దగా వరదలు లేకపోయినా భవిష్యత్తులో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణ స్థాయి కంటే 2025 అడుగుల మేర బ్యాక్‌వాటర్ ఉధృతి పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంత ఎమ్మెల్యేలు గతంలో సిడబ్ల్యుసి, ఇతర కేంద్ర సంస్థల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా తగిన స్పందన తరువాయి 12లో

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 సంవత్సరాలు సమీపిస్తున్నా, వికసిత్ భారత్ అంటూ శతవార్షికోత్సవానికి (2047) పరుగులు తీస్తున్నా అంటరానితనం, వరకట్నం, బాల్యవివాహాలు వంటి సామాజిక రుగ్మతలు కొనసాగుతూ ఉండటం భారతదేశం వికాసంపై మాయనిమచ్చ. ఈ దురాచారాలు ఒకనాడున్నంత తీవ్రంగా ఈనాడు కనిపించకపోవచ్చు. కాని మనం చూస్తున్న, వింటున్న తత్సంబంధిత అనేక దురాగతాలకు వివక్షాపూర్వక మానసిక స్థితి మారకపోవటమే కారణం. ఎన్ని ప్రగతిశీల చట్టాలు చేసినా వాటి అమలు అంతంతమాత్రంగా ఉండటానికీ ఆ మనోగతమే కారణం. కులాధిపత్యం, మహిళల అణచివేత, వివక్ష ఇవి పితృస్వామిక వ్యవస్థ లక్షణాలు, ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలు. ఈ దురాచారాలకు వ్యతిరేకంగా ఎందరో సంస్కర్తలు తమ జీవితాలు అర్పించారు. జాతీయోద్యమం సానుకూలంగా స్పందించింది. స్వాతంత్ర్యానంతరం సంఘసంస్కరణోద్యమ ప్రభావంతో సానుకూల చట్టాలు వచ్చాయి. ఫ్యూడల్ వ్యవస్థ బద్దలై, పెట్టుబడిదారీ విధానం వృద్ధితో సాంఘిక సంబంధాల్లో వచ్చిన మార్పులు కూడా ఇందుకు దోహదం చేశాయి. అయితే అదే సమయంలో స్వాములు, బాబాలు సనాతన ధర్మ ప్రచారం పేరుతో మూఢాచారాలను సజీవంగా ఉంచుతున్నారు. వారికి కొన్ని రాజకీయ పక్షాల అండదండలున్నాయి. సనాతన ధర్మ పరిరక్షణ, మనుస్మృతి కట్టుబాట్లను సమర్థించే శక్తులు అధికార అందలాలు అధిరోహించాక కులతత్వం, మత తత్వం మళ్లీ పుంజుకున్నాయి. దళితులపై దాడులు పెరుగుతున్నాయి. కులాంతర వివాహాలను ప్రోత్సహించే రోజులుపోయి పరువు పేరుతో అట్టి వధూవరులను హత్యచేసే కాలమొచ్చింది. దీనికి ప్రధాన కారణం దేశంలో పురోగామి భావజాల ప్రచారం, వామపక్ష భావజాల ప్రభావం బలహీనపడి, తిరోగమన లేదా సనాతన భావజాలం పెచ్చరిల్లటం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఉత్తరాఖండ్‌లో ఒక సభలో ప్రసంగించి వచ్చాక, దళితుడు కూర్చున్న ప్రదేశం అపవిత్రం అయిందని భావించి హిందూ అగ్రకులజులు కొందరు ఆ ప్రదేశాన్ని

# అంటరానితనం ఇంకానా?

శుద్ధిచేసినా వారిపై పోలీసులు అంటరానితనం నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదంటే బిజెపి ప్రభుత్వం అండచూసుకునే కదా? ఇలాంటి అవమానకర సంఘటనలు ప్రతిరోజూ దేశంలో ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి.

మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లా ఉకావల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2026, జులై 28న ఒక ఉపాధ్యాయుడు నాల్గవ తరగతి దళిత విద్యార్థిని కులం పేరుతో తిట్టి, కొట్టినట్లు మీడియాలో వచ్చిన వార్తను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సి) తనకు తానుగా పరిగణలోకి తీసుకుంది. ఆ బాలుడు చేసిన తప్పేమిటి? దప్పిక తీర్చుకునేందుకు టీచర్ బాటిల్ లోని నీళ్లు త్రాగాడు. అది ఆ టీచర్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ సమాచారాన్ని భారత ప్రభుత్వ ప్రెస్ ఏజన్సీ – పిఐబి – ఆగస్టు 6న పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసింది. ఈ సమాచారం యదార్థమైతే టీచర్ చర్య మానవ హక్కుల తీవ్రమైన ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్న ఎన్‌హెచ్ఆర్‌సి, మధ్యప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి, జిల్లా ఎస్‌పికి నోటీసులు జారీ చేసి సవివరమైన నివేదిక కోరింది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (అత్యాచారాల నిరోధక)చట్టం, 1989 ఆమోదించి 37 ఏళ్లు గడిచిపోయినా దళితులు, ఆదివాసీలు ఎందుకు వివక్షకు, దాడులకు, అత్యాచారాలకు గురవుతున్నారు? అగ్రవర్ణాల్లో మానసిక మార్పు రాకపోవటం, ఆ విధమైన ప్రచారం లేకపోవటం, నమోదైన అత్యాచారాల కేసులు సత్వరం పరిష్కారమై నిందితులకు కఠిన శిక్షలు పడకపోవటం కారణాలు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, ఐదుగురు దళితులు సహా మొత్తం ఆర్గురి హత్య కేసులో 11ఏళ్ల తర్వాత వచ్చిన తీర్పులో నిందితులు 40 మంది నిర్దోషులుగా బయటకు వచ్చిన ఒక ఉదంతాన్ని సోషల్ మీడియా అక్కౌంట్‌లో పోస్టు చేశారు. 40మంది నిందితులూ నిర్దోషులైతే ఆ ఆరుగుర్ని చంపిందెవరు అని వారి కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవస్థలో అది జవాబుకు నోచని ప్రశ్న!

సామాజిక న్యాయం శాఖ మంత్రి రాందాస్ అథవాలె జులై 30న రాజ్యసభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ప్రకారం (ఎన్‌హెచ్ఆర్‌సి గణాంకాలు) ఎస్‌సి/ఎస్‌టి చట్టం కింద కేసుల నమోదుకు, వాటి పరిష్కారం, శిక్షల విధింపు మధ్య పెద్ద అగాథం ఉంది. 2020లో దాదాపు 45995కేసులు నమోదుకాగా 17113 ఇంకనూ దర్యాప్తులో ఉన్నాయి; 2613 మందికి శిక్షలు పడ్డాయి. 2021లో 46100; 2022లో 52886; 2023లో 53372; 2024 లో 48669కేసులు రిజిస్టర్ అయినాయి. కాగా అదే సంవత్సరాల్లో శిక్షలు పడిన కేసులు వరుసగా 2613; 2848; 4876; 4691; 5192. విచారణ పెండింగ్ ఉన్న కేసులు 2020లోని 1,77,379 నుంచి 2024 చివరకు 2,87,694 పెరిగాయి. దాఖలైన కేసుల్లో శిక్షలుపడినవి 2020లో 6.45శాతం, 2021లో 6.94 శాతం, 2022లో 10.79శాతం, 2023లో 8.67శాతం, 2024లో 12.87శాతం. పెండింగ్ కేసులు ఎప్పటికి పరిష్కారమయ్యేను? అందువల్ల ప్రభుత్వం క్షేత్రస్థాయి వాస్తవాలు గ్రహించి దళితులకు సత్వరన్యాయం కలుగజేసే మార్గం అన్వేషించాలి. సనాతన వాదులు దళితులూ హిందువులే అంటారు. కాని వారికి దేవాలయ ప్రవేశాన్ని, ఉమ్మడి వసతుల్లో నీరు తీసుకోవటాన్ని, వర్ణాంతర వివాహాలను సమర్థించరు. అంటరానితనం పాటించేవారు అగ్రవర్ణాలే కదా! ఎందుకీ వివక్ష. శూద్రులు, వారిలోని దళితులు శ్రీ మహావిష్ణువు పాదాల లోనుంచి జన్మించారని, అగ్రవర్ణాలకు సేవచేయటమే వారి ధర్మం అనే పురాణాల ప్రచారం వారి మానసిక ఎదుగుదలను అరికడుతున్నది. అందువల్ల సాంఘిక సంస్కరణకు యువతరం నడుంకట్టాలి.



**విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర**

**ఉపాధ్యాయులు వారి మార్గదర్శకత్వం, సలహాల ద్వారా విద్యార్థులలో ప్రతిభను పెంపొందించడంలోనూ, వ్యక్తిత్వాన్ని బలోపేతం చేయడంలోనూ కీలకపాత్ర పోషిస్తారు. వారు అనునిత్యం జ్ఞానాన్ని సమీకరించుకోవాలి. వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలి. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఒకగొప్ప రచయితగా, తాత్వికవేత్తగా, అసాధారణ ఉపాధ్యాయుడిగా పేరొందిన ఆయనకు నా నివాళులు.**

– రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



# సాహస ఉద్యమకారిణి, జర్నలిస్టు గౌరీ లంకేశ్

ఇటీవల కాలంలో భారతదేశంలో ప్రసిద్ధి చెందిన బహు కొద్దిమంది మహిళా జర్నలిస్టుల్లో గౌరీ లంకేశ్ ఒకరు.. ఈమె మరణించి నేటికి తొమ్మిది సంవత్సరాలు పూర్తి అవుతున్నా, దేశంలో ఏదో ఒకచోట గౌరీ లంకేశ్ మాట ఉచ్చరించకుండా ఏ రోజూ గడవదు అంటే అతిశయోక్తి కాదేమో.!? దీనికి ప్రధాన కారణం గౌరీ లంకేశ్ ప్రతీ రోజూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడమే, చిన్నప్పుడు నుంచీ జర్నలిజంపై ఆసక్తి కలిగి ఉండుటచే తన తండ్రి మరణానంతరం తానే పత్రిక స్థాపించి, మత మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు పై తన కలం, గళం ద్వారా అందరికీ అవగాహన కల్పించేందుకు పాటు పడ్డారు.. ముక్కుసూటి మనస్తత్వం కలిగి, ధైర్యంగా సమాజంలో జరుగుతున్న వివిధ అసమానతలపై పోరుబాట పట్టారు.. 'ఎంగిలాకులపై పొర్లు దండాలు పెట్టించే దుష్ట ఆచారాలపై' అలుపెరుగని పోరాటం చేసారు. బాబా బుడాన్ గిరి దత్త పీఠంలో జరుగుతున్న వివిధ అకృత్యాలపై తన కలం, గళం ద్వారా ఉద్యమ ప్రపంచాన్ని నిర్మించారు.. సంఘ్ పరివార్ దూకుడుకు చెక్ పెట్టారు.. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.. ప్రజా ఉద్యమాల్లో మమేకం అయ్యారు.. అణగారిన వర్గాల కోసం శ్రమించే వారికి అండగా నిలిచారు..

ముఖ్యంగా దేవాలయాల్లో జరిగే మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాల పట్ల ఎన్నో కథనాలు రాసారు.. దీంతో ఒక వర్గానికి వ్యతిరేకంగా ముద్రపడ్డారు. హిందూత్వ అతివాదం పై ధిక్కార స్వరం వినిపించారు. మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే మతవాదంపై పోరుబాట చేసారు... రామచంద్రపుర మఠానికి చెందిన రాగవేశ్వర భారతి, మహిళలపై జరిపిన అనేక అకృత్యాలపై తన కలం, గళం ద్వారా కదం తొక్కారు.. అప్పటి కర్ణాటకలో పాలన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మావోయిస్టులను ప్రజాజీవితంలో కలిపే కార్యక్రమంలో గౌరీ లంకేశ్ ను భాగస్వామ్యం చేసారు.. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం జరుపుతున్న వారికి మద్దతు ప్రకటించారు..ఈ విధంగా లెఫ్ట్ ఓరియంటేషన్ భావాలతో పౌర సమాజంలో హేతువాద దృక్పథం పెంచడంలో సఫలీకృతం అయ్యారు.. ఈమె చేసే వివిధ ప్రజా ఉద్యమాలను ఓర్వలేక కొంతమంది దుండగులు 2017 సెప్టెంబర్ 5వ తేదీన కాల్పులు జరిపి హతమార్చారు.. దీంతో దేశం దిగ్భ్రాంతికి లోనైంది.. జర్నలిస్టుగానే కాకుండా ఉద్యమకారిణిగా ప్రజల హక్కులను కాపాడటం కోసం, సమ సమాజ స్థాపన కోసం, మహిళల హక్కుల కోసం,అసమానతలపై పోరుబాట పట్టిన వీరనారి గౌరీ లంకేశ్ ..భారత జర్నలిజం చరిత్రలో ఒక చిరస్మరణీయమైన పాత్ర పోషించారు... ఈమెలోని భావాలు నేటి పాత్రికేయులు, మహిళలు, అభ్యుదయ భావాలు కలిగిన వారు అందిపుచ్చుకుని, సంకుచిత, అవకాశవాద రాజకీయాలపై, మత ఛాందస భావాలపై ప్రశ్నిస్తూ ముందుకు సాగడమే ఈమెకు మనం అందరం ఇచ్చే ఘన నివాళి.

**(నేడు గౌరీ లంకేశ్ వర్ధంతి)**

ఐ.పి.రావు

# నిరుద్యోగ యువతకు ఏదీ భవిష్యత్తు?



కల్లూరు ధర్మేంద్ర
ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9705309583

చదువుకో... మంచి ఉద్యోగం వస్తుంది – మన దేశంలో ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు చెప్పే మాట. చిన్నతనం నుంచి పాఠశాల, కళాశాల, కోచింగ్ సెంటర్, పోటీ పరీక్షలు అంటూ ఎన్నో సంవత్సరాలు చదివిన తర్వాత ఒక మంచి ఉద్యోగం వస్తే కుటుంబ భవిష్యత్తు మారుతుందని యువత ఆశపడుతుంది. కానీ నేటి వాస్తవ పరిస్థితి ఆ ఆశలకు భిన్నంగా ఉంది. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఒక ఉద్యోగ ప్రకటన వెలువడితే లక్షలాది మంది పోటీ పడాల్సిన పరిస్థితి. పరీక్ష రాస్తే ఫలితాల కోసం నెలలు, సంవత్సరాలు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఉద్యోగం వచ్చినా అది శాశ్వతమా? సరైన వేతనం ఉంటుందా? సామాజిక భద్రత ఉంటుందా? అనే ప్రశ్నలు యువతను వెంటాడుతున్నాయి.

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటి. ఈ యువశక్తి దేశానికి గొప్ప సంపద. యువతలో ఉన్న శక్తి, ప్రతిభ, సృజనాత్మకత, శ్రమ దేశ ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడితే భారతదేశం అపారమైన పురోగతిని సాధించగలదు. కానీ యువతకు విద్య, నైపుణ్యం, ఉపాధి, సామాజిక భద్రత కల్పించలేకపోతే అదే యువ జనాభా నిరుద్యోగం, నిరాశ, వలసలు, అసమానతలకు కారణమవుతుంది. అందుకే నేడు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రశ్నల్లో యువత ఉపాధి ప్రశ్న ఒకటి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ మరియు ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ రూపొందించిన ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2025 కూడా భారతదేశంలో యువత నిరుద్యోగం, ముఖ్యంగా చదువుకున్న యువత నిరుద్యోగాన్ని తీవ్రమైన సవాలుగా గుర్తించింది. విద్యా స్థాయి పెరుగుతున్నప్పటికీ దానికి అనుగుణంగా నాణ్యమైన ఉపాధి అవకాశాలు తగినంతగా పెరగకపోవడం భారత కార్మిక మార్కెట్‌లో ఉన్న వైరుధ్యాన్ని బయటపెడుతోంది. ఒకవైపు యువ భారతదేశం గురించి గొప్పగా మాట్లాడుతున్న పాలకులు, మరోవైపు ఆ యువతకు తగిన స్థిరమైన ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమవుతున్నారు. నేటి యువత గత తరాలతో పోలిస్తే ఎక్కువగా చదువుకుంటోంది. అయితే విద్యా వ్యవస్థ నుంచి బయటకు వచ్చిన ప్రతి యువకుడికి తన విద్యకు తగ్గ ఉద్యోగం దొరుకుతుందా అనే ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లేదు. డిగ్రీ చేతిలో ఉంది, కానీ ఉద్యోగం లేదు. నైపుణ్యం ఉంది, కానీ అవకాశాలు లేవు. ప్రతిభ ఉంది, కానీ స్థిరమైన ఉపాధి లేదు. ఇదే నేటి యువత ఎదుర్కొంటున్న విషాదకర వాస్తవం.


ప్రభుత్వ ఉద్యోగం కోసం జీవితమే ఒక పరీక్షగా మారడం నేటి యువత పరిస్థితికి మరో ఉదాహరణ. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం జీతం కాదు. అది కుటుంబానికి స్థిరమైన ఆదాయం, ఉద్యోగ భద్రత, సామాజిక గౌరవం, వైద్య భద్రత, భవిష్యత్తుపై నమ్మకం. అందుకే ఒక చిన్న ఉద్యోగ ప్రకటన వెలువడినా వేలాది, లక్షలాది మంది యువత దరఖాస్తు చేసుకుంటున్నారు. ఒక పోస్టుకు వేలమంది పోటీ పడటం యువత ప్రతిభకు మాత్రమే నిదర్శనం కాదు; దేశంలో నాణ్యమైన, స్థిరమైన ఉద్యోగాల కొరతకు కూడా నిదర్శనం.

తెలంగాణలో కూడా యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఒక ప్రధాన రాజకీయ, సామాజిక ప్రశ్నగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం వివిధ దశల్లో నియామక ప్రక్రియలను చేపట్టింది. 2026 జనవరిలో టిజిపియస్ గ్రూప్–IIIలో ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగింది. భవిష్యత్తులో ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నియామకాలు జరగడం స్వాగతించాల్సిన విషయమే. అయితే యువత అడగాల్సిన ప్రశ్న ఇక్కడితో ముగియదు. ఇంకా ఎన్ని ఖాళీలు ఉన్నాయి? వాటికి నోటిఫికేషన్లు ఎప్పుడు వస్తాయి? పరీక్షలు ఎప్పుడు జరుగుతాయి? ఫలితాలు ఎప్పుడు వస్తాయి? నియామకాలు ఎప్పుడు పూర్తవుతాయి? ఈ వివరాలన్నీ ప్రజలకు పారదర్శకంగా తెలియాలి.

ప్రతి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం, కొన్ని నియామకాలు చేపట్టడం, ఆ తర్వాత మిగిలిన ఖాళీలపై స్పష్టత లేకపోవడం కొనసాగితే యువత భవిష్యత్తు అనిశ్చితిలోనే ఉంటుంది. అందుకే రాష్ట్రంలో ప్రతి సంవత్సరం శాఖల వారీగా ఖాళీలను ప్రకటించి, వాటి ఆధారంగా వార్షిక ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలి. ఉద్యోగ నోటిఫికేషన్ కోసం యువత జీవితాన్ని సంవత్సరాల తరబడి నిలిపివేసే పరిస్థితికి ముగింపు పలకాలి.

ప్రభుత్వ ఉద్యోగాల కొరతతో యువత ప్రైవేటు రంగాన్ని ఆశ్రయిస్తోంది. అయితే ప్రైవేటు రంగంలో కూడా సమస్యలు తీవ్రంగానే ఉన్నాయి. ఇంజినీరింగ్ లేదా ఇతర ఉన్నత విద్య పూర్తిచేసిన యువకుడు తక్కువ వేతనంతో ఉద్యోగం ప్రారంభిస్తాడు. ఎక్కువ పని గంట లు, వారానికి ఆరు రోజుల పని, ఉద్యోగ భద్రత లేకపోవ డం, ఆరోగ్య బీమా లేకపోవడం, భవిష్యత్తు భద్రత లేకపోవడం సాధారణమవుతున్నాయి. కాంట్రాక్ట్ ముగిసిందంటే ఉద్యోగం ముగిసిపోవచ్చు. సంస్థలో ఆర్థిక పరిస్థితులు మారితే ఉద్యోగం కోల్పోవచ్చు.

ఈ నేపథ్యంలో గిగ్ ఎకానమీ మరో కొత్త సవాలుగా ముందుకు వచ్చింది. డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ కార్మికులు, వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సేవలు అందించే యువత సంఖ్య పెరుగుతోంది. వీరికి పనిచేసే స్వేచ్ఛ ఉన్నట్లు కనిపించినప్పటికీ, కనీస ఆదాయ భద్రత, ప్రమాద బీమా, ఆరోగ్య రక్షణ, వృద్ధాప్య భద్రత వంటి ప్రశ్నలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. యాప్ లో లాగిన్ అవ్వండి, పని చేసుకోండి అనే విధానం యువతకు స్థిరమైన భవిష్యత్తును ఇవ్వదు. శ్రమించే ప్రతి యువకుడికి సామాజిక భద్రత ఉండాలి.




అదే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ప్రభుత్వా లు కేవలం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి బాధ్యత ముగించకూడదు. నైపుణ్యం అవసరమే. కానీ స్కిల్ ట్రైనింగ్ ఉద్యోగానికి ప్రత్యామ్నాయం కాదు. ఒక యువకుడికి ఆరు నెలల శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వడం ద్వారా అతని సమస్య పరిష్కారం కాదు. శిక్షణ తర్వాత అప్రెంటిస్‌షిప్, అప్రెంటిస్‌షిప్ తర్వాత ఉద్యోగం, ఉద్యోగంలో న్యాయమైన వేతనం, సామాజిక భద్రత అనే పూర్తి వ్యవస్థను నిర్మించాలి. యువతకు శిక్షణ ఇచ్చే సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు పరస్పరం అనుసంధానమై పనిచేయాలి.

ఉపాధి సమస్యకు మరో ముఖ్యమైన కోణం ప్రాంతీయ అసమానత.

గ్రామీణ యువత ఉపాధి ప్రశ్నను వ్యవసాయంతో వేరు చేసి చూడలేం. రైతు కుటుంబం ఆర్థికంగా బలహీనపడితే ఆ కుటుంబంలోని యువత మొదటగా ప్రభావితమవుతుంది. వ్యవసాయంలో ఆదాయం అనిశ్చితంగా ఉంటే యువత పట్టణాల వైపు చూస్తుంది. అందుకే వ్యవసాయాన్ని కేవలం పంట పండించే రంగంగా కాకుండా ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలి. పంట ఉత్పత్తితో పాటు నిల్వ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, ఎగుమతులు వంటి రంగాలను గ్రామీణ ప్రాంతాల్లోనే అభివృద్ధి చేస్తే వ్యవసాయంతో అనుసంధానమైన అనేక ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.

మహిళా యువత ఉపాధి సమస్యను కూడా ప్రత్యేకం గా చూడాలి. విద్య పూర్తిచేసిన అనేక మంది యువతులు ఉద్యోగాల్లోకి రావాలనుకున్నా సురక్షితమైన రవాణా లేకపోవడం, పని ప్రదేశాల్లో భద్రతపై ఆందోళనలు, కుటుంబ బాధ్యతలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాల కొరత, వేతన అసమానత వంటి సమస్యలు అడ్డంకులుగా నిలుస్తున్నాయి. కాబట్టి మహిళా యువతకు ఉపాధి కల్పించడం అంటే కేవలం ఉద్యోగ ప్రకటనలు ఇవ్వడం కాదు. సురక్షిత రవాణా, హాస్టళ్లు, సమాన వేతనం, సురక్షిత పని ప్రదేశా లు, ప్రసూతి ప్రయోజనాలు, నైపుణ్య శిక్షణ వంటి అంశాలను కూడా ఉపాధి విధానంలో భాగం చేయాలి.

ఇక కొత్తగా ముందుకొస్తున్న సాంకేతిక మార్పు యువత ఉపాధి ప్రశ్నకు మరో కొత్త కోణాన్ని జోడించింది. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, ఆటోమేషన్ వంటి సాంకేతిక పరిణామాలు కొన్ని కొత్త ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని ప్రథమ శ్రేణి, రిపీటిటివ్ పనుల స్వభావాన్ని మార్చే అవకాశం కూడా ఉంది. అందుకే యువతకు కేవలం ఏఐ నేర్చుకోండి అని చెప్పడం సరిపోదు. గ్రామీణ ప్రాంతాల వరకు డిజిటల్ మౌలిక వసతులు, ఉచిత AI శిక్షణ, కంప్యూటర్ సదుపాయాలు, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ అవకాశాలు అందుబాటులోకి రావాలి.

AIYF కోరుకునేది కేవలం కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు కాదు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను తక్షణం భర్తీ చేయాలి. కేంద్రం, రాష్ట్రాలు ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలి. నోటిఫికేషన్ నుంచి నియామకం వరకు నిర్ణీత కాలపరిమితి ఉండాలి. ప్రభుత్వ రంగ సంస్థల ను ప్రైవేటీకరించకుండా బలోపేతం చేయా లి. ప్రతి జిల్లాలో స్థానిక వనరుల ఆధారంగా ఉపాధి సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కొత్త పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి. స్కిల్ డెవలప్‌మెంట్‌ను అప్రెంటిస్‌షిప్, ఉద్యోగంతో అనుసంధానం చేయాలి. గిగ్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. గ్రామీణ యువతకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, చిన్న పరిశ్రమలు, సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలి. మహిళా యువతకు సురక్షితమైన, సమాన వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఏఐ , ఆటోమేషన్ వల్ల ఉద్యోగ మార్పులకు గురయ్యే యువతకు ఉచిత రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ అందించాలి. ప్రతి జిల్లాలో పోటీ పరీక్షలకు ఉచిత ప్రభుత్వ కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నియామకాల్లో పేపర్ లీకులు, అవకతవకలు లేకుండా పారదర్శక వ్యవస్థను నిర్మించాలి.

ఇది కేవలం డిమాండ్ల జాబితా కాదు. యువత భవిష్యత్తు గురించి ఒక ప్రత్యామ్నాయ దిశ. ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగ అవకాశాలను సృష్టించాలి. దేశ సంపదను సృష్టించే కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించాలి. చదువుకున్న యువతకు తన ప్రతిభను ఉపయోగించుకునే అవకాశం కల్పించాలి. గ్రామీణ యువత తన ఊరిని వదిలి వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించాలి. మహిళా యువతకు సమాన అవకాశాలు కల్పించాలి. సాంకేతిక అభివృద్ధి ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలి. భారతదేశ యువతకు సామర్థ్యం ఉంది. ప్రతిభ ఉంది. శ్రమ ఉంది. కలలు ఉన్నాయి. అవసరం ఉన్న ది అవకాశం. ఒక యువకుడికి ఉద్యోగం ఇవ్వడం ద్వారా కేవలం ఒక వ్యక్తిని నిలబెట్టడం కాదు; ఒక కుటుంబాన్ని నిలబెట్టడం. ఒక కుటుంబం ఆర్థికంగా బలపడితే ఒక గ్రామం బలపడుతుంది. లక్షల కుటుంబాలు బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందుకే యువతకు ఉద్యోగం కల్పించడం ప్రభుత్వ దయ కాదు; ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వానికి ఉన్న ప్రజా బాధ్యత.

యువతను ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తు చేసుకుని, మిగిలిన కాలంలో వారి సమస్యలను పక్కన పెట్టే రాజకీయ సంస్కృతికి ముగింపు పలకాలి. యువతను ఓటు బ్యాంకుగా కాకుండా దేశ నిర్మాణ శక్తిగా గుర్తించాలి. వారి కోపాన్ని మతం, కులం, ప్రాంతం పేరు తో విభజించకుండా, వారి సమస్యలకు పరిష్కారం చూపే ప్రజా ఉద్యమంగా మలచాలి. నిరుద్యోగ యువతలో ఉన్న అసంతృప్తికి ప్రజాస్వామ్య, శాస్త్రీయ, సామాజిక న్యాయ దిశను చూపడం యువజన ఉద్యమాల చారిత్రక బాధ్యత.

యువత హక్కుల కోసం ఐక్యమై ఉద్యమిద్దాం – విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం ఆధారంగా సమానత్వ, ప్రజాస్వామ్య సమాజ నిర్మాణం కోసం పోరాడుదాం.

# ఆదర్శ కార్మిక నేత మనుబోతుల కొమురయ్య

సింగరేణి బొగ్గు గనుల చరిత్ర కేవలం బొగ్గు ఉత్పత్తి, పారిశ్రామిక ప్రగతి చరిత్ర మాత్రమే కాదు. ఆ నల్ల బంగారాన్ని వెలికితీసిన కార్మికుల చెమట, కన్నీరు, త్యాగాలు, పోరాటాల చరిత్ర కూడా. సింగరేణి కార్మికులకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, కుటుంబ సంక్షేమం, వారసత్వ ఉద్యోగాలు, పెన్షన్ వంటి అనేక హక్కులు సాధించడంలో పలువురు కార్మిక నాయకులు కీలక పాత్ర పోషించారు. అలాంటి మహానాయకులలో మనుబోతుల కొమురయ్య పేరు సింగరేణి కార్మిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

కార్మికుల సమస్యలను తన సమస్యలుగా భావించి, యాజమాన్యంతో నిరంతరం పోరాడుతూ, కార్మిక కుటుంబాల భవిష్యత్తు కోసం తన జీవితాన్నే అంకితం చేసిన కొమురయ్యను కార్మికులు ప్రేమగా యూనియన్ కొమురయ్య'గా పిలుచుకునేవారు. ఆయన పోరాట జీవితం సింగరేణి కార్మిక ఉద్యమానికి ఒక గొప్ప అధ్యాయం.

ఉమ్మడి ఖమ్మం జిల్లా, నేటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు సింగరేణి బొగ్గు గనుల పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందింది. ఇదే నేలపై 1928 జూన్ 12న మనుబోతుల కొమురయ్య జన్మించారు. విద్యాభ్యాసం చేస్తున్న చిన్న వయసులోనే వామపక్ష సాహిత్యం, కరపత్రాలు చదవడం ద్వారా సమాజంలోని అసమానతలు, కార్మికుల దుస్థితి గురించి అవగాహన పెంచుకున్నారు.

కార్మికులకు కనీస హక్కులు కూడా లేని పరిస్థితుల్లో వారి తరఫున నిలబడాలని నిర్ణయించుకున్నారు.

1940లో కొత్తగూడెం మెయిన్ వర్క్‌షాప్‌లో టర్నర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఉద్యోగం చేస్తూనే కార్మికుల సమస్యలపై పోరాటాల్లో పాల్గొన్నారు. దేవూరి శేషగిరిరావు, మఖ్దూమ్ మొయినుద్దీన్, రాజ్‌బహదూర్, కె.ఎల్. మహేంద్ర వంటి ఆనాటి కార్మిక నాయకులతో కలిసి ఉద్యమాలను నిర్మించారు.

1942 మే 1న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) స్థాపనలో కొమురయ్య కీలక పాత్ర పోషించారు. కార్మిక హక్కుల కోసం పోరాడటంతో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ చురుకుగా పాల్గొన్నారు. ఈ పోరాటాల కారణంగా 1947 నుంచి 1948 వరకు జైలు జీవితం గడిపారు.

దాదాపు 44 సంవత్సరాల పాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కొమురయ్య, కార్మికుల నమ్మకానికి ప్రతీకగా నిలిచారు. ఆయనకు పదవి ఒక అలంకారం కాదు; కార్మికుల గొంతుకగా పనిచేయడానికి ఒక బాధ్యత.



సింగరేణి గనుల్లో కాంట్రాక్టు కార్మికుల దోపిడీని కొమురయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. శాశ్వత స్వభావం కలిగిన పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేయిస్తూ కార్మికులను అస్థిరతలోకి నెట్టే విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు.

అదేవిధంగా మహిళలు, పిల్లలను భూగర్భ బొగ్గు గనుల్లో పనిచేయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. యాజమాన్యం పై పోరాడి మహిళలు, పిల్లలకు భూగర్భ పనుల బదులు ఉపరితల ప్రాంతాల్లో పని కల్పించేలా చర్యలు సాధించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపైనా నిరంతరం పోరాడి అనేక మందిని పర్మినెంట్ చేయించడంలో కీలక పాత్ర పోషించారు.ఇది కేవలం ఒక కార్మిక సమస్యను పరిష్కరించడం కాదు. కార్మికుడికి పని అంటే కేవలం వేతనం కాదు – గౌరవం, భద్రత, కుటుంబ భవిష్యత్తు కూడా అనే భావనను కొమురయ్య తన ఉద్యమం ద్వారా బలంగా చాటిచెప్పారు.

**వేతన బోర్డుల్లో సింగరేణి కార్మికుల గొంతుక**

మనుబోతుల కొమురయ్య కేవలం సింగరేణి యూనియన్ నాయకుడిగానే పరిమితం కాలేదు. జాతీయ స్థాయిలో బొగ్గు కార్మికుల సమస్యలను వినిపించిన నాయకుడిగా ఎదిగారు.

రేగే కమిటీ, జాదన్ కమిటీ, మజుందార్ కమిటీ, లేబర్ అప్పిలేట్ వంటి వివిధ కార్మిక సంబంధిత కమిటీలలో సభ్యునిగా పనిచేశారు. తరువాత కోల్ వేజ్ కమిటీ, జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జెబిసిసిఐ) వంటి వేదికల్లో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను బలంగా వినిపించారు.

మొదటి వేజ్ బోర్డు నుంచి ఆరవ వేజ్ బోర్డు వరకు సింగరేణి తరఫున శాశ్వత వేజ్ బోర్డు సభ్యుడిగా ఉండి కార్మికులకు ఇంక్రిమెంట్లు, ఎల్‌టీసీ, క్యాడర్ స్కీమ్ వంటి అనేక ప్రయోజనాలు సాధించేందుకు కృషి చేశారు.

1974 రఘునాథ్‌రెడ్డి అవార్డు సందర్భంలో సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా కార్మికులతో పోలిస్తే అదనపు ప్రయోజనాలు సాధించడంలో ఆయన పోరాటం ముఖ్యమైనదిగా నిలిచింది. కొమురయ్య పోరాటం కేవలం బొగ్గు గనులకే పరిమితం కాలేదు. పేపర్, స్టీల్, సిమెంట్, విద్యుత్ తదితర పారిశ్రామిక రంగాల్లో యూనియన్ల నిర్మాణానికి, కార్మికుల మెరుగైన వేతన ఒప్పందాల సాధనకు కృషి చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడిగా, జాతీయ ఎఐటియుసి కార్యవర్గ సభ్యుడిగా, ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించి జాతీయ కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందారు.

1996 సెప్టెంబర్ 5న ఆయన తుదిశ్వాస విడిచారు. మరుసటి రోజు నుంచి నిరాహార దీక్షకు కార్మికులను సిద్ధం చేసిన నాయకుడు, అదే ఉద్యమం కోసం తన జీవితాన్ని అర్పించి వెళ్లిపోవడం ఆయన అంకితభావానికి నిదర్శనం.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752



## ఒవైసీ సోదరులకు దేశభక్తి సర్టిఫికెట్లా?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాల కోసమే ఒవైసి సోదరులను 'దేశభక్తులు' అని ప్రశంసిస్తున్నారని, ఇది యావత్ దేశాన్ని అవమానించడమేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తల్లిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఆడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ, అమిత్ షా వంటి నాయకులతో ఒవైసీలను పోల్చడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో 15 నిమిషాలు పోలీసులను పక్కకు జరిపితే చూపిస్తాం అని బెదిరించినందుకా, లేక బహిరంగంగా గోమాంసం తింటామని మాట్లాడినందుకా రేవంత్ రెడ్డి వారికి దేశభక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో 'వందేమాతరం' పాడుతుంటే ఒక్క మజ్లిస్ ఎమ్మెల్యే కూడా నిలబడలేదని, అలాంటి వారిని దేశభక్తులు అనడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రాజ్యసభ ఎంపి డాక్టర్ లక్ష్మణ్ కూడా నాగం వర్షిత్ రెడ్డి తల్లిని పరామర్శించారు.



## రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

### గవర్నర్‌కు బిజెపి మహిళా మోర్చా వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలకు భద్రత కరువైందని బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి ఆరోపించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను శుక్రవారం కలిసి రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తుక్కుగూడలో నర్సుగా పని చేస్తున్న గిరిజన యువతిపై పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడు మహమ్మద్ సనావుల్లా ఖాన్‌ను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరితీయ్యాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ మేయర్, ఆయన అనుచరులు దాడి చేసి, ఆయన తల్లిపై భౌతిక దాడికి దిగినా పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదన్నారు. దాడి వల్ల తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారని తెలిపారు. హోం శాఖను వద్దే ఉంచుకున్న సిఎం రేవంత్ రెడ్డి పాలనలో మహిళలపై నేరాలు రెట్టింపు అయ్యాయని, మైనర్‌లపై నేరాల్లో తెలంగాణ దేశంలోనే 2వ స్థానంలో నిలవడం సిగ్గుచేటని విమర్శించారు. రాజీ పేరిట కేసులు నీరుగారుస్తున్నారని, షీ టీమ్స్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను నిర్వీర్యం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా వైద్య సిబ్బందికి, హాస్టళ్లకు కట్టుదిట్టమైన భద్రత కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌ను కోరినట్లు ఆమె తెలిపారు.



## కాంగ్రెస్ భూదోపిడిని బహిర్గతం చేస్తాం : ఈటల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూభారతి, 22ఎ నిషేధిత భూముల వ్యవహారంపై ఈనెల 5న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జరుపతలపెట్టిన నిరాహార దీక్ష ఏర్పాట్లను ఎంపి ఈటల రాజేందర్, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కాంగ్రెస్ భూదోపిడిని బహిర్గతం చేస్తామని ఈటల, ఏలేటి తెలిపారు.

## స్వదేశీ 'కామికేజ్'కు మరింత బలం

### మ్యూనిషన్స్ ఇండియా– డ్రోగో ఏరోస్పేస్ మధ్య కీలక ఒప్పందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికతకు మరింత ఊతమిచ్చేలా మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ (ఎంఐఎల్), డ్రోగో ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. యూఏవీలు, లోయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థల అభివృద్ధి, సమీకరణ కోసం రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి.పుణెలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డ్రోగో ఏరోస్పేస్ సిఇఒ యశ్వంత్ బొంతు, ఎంఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ వైభవ్ గౌర్ ఎంఓయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం డ్రోగో ఏరోస్పేస్ యూఏవీ రూపకల్పన, తయారీపై, ఎంఐఎల్ వార్‌హెడ్, మ్యూనిషన్ సాంకేతికతపై దృష్టి సారించనున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో విజయవంతంగా పరీక్షించిన **'డెల్టా వింగ్ కామికేజ్' యుఎవి ఈ భాగస్వామ్యానికి కీలకంగా నిలవనుంది. లక్ష్యాన్ని గుర్తించి దానిపై దూసుకెళ్లే లోయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థగా దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. సుమారు 1,000 కిలోమీటర్ల మిషన్ పరిధి, 20–30 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లే సామర్థ్యంతో అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ తెలిపింది.మ్యూనిషన్–యుఎవి సమీకరణ, పరీక్షలు, నాణ్యతా ధ్రువీకరణ తదితర అంశాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఈ భాగస్వామ్యం దేశీయ రక్షణ తయారీ, సాంకేతిక స్వావలంబనకు మరో ముందడుగుగా నిలుస్తుందని ఇరు సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌ను వీడబోము

### ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు

### మాజీ మంత్రి కొండాసురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బిజెపిలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ 'నేను ఎక్కడికీ వెళ్లడం లేదు' అని మాజీ మంత్రి కొండాసురేఖ స్పష్టం చేశారు. తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. 'త్వరలో బిగ్ అప్‌డేట్', 'నిరీక్షణకు తెరపడనుంది' వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు.

తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటిరోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీచేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సిఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సిఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సిఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీచేసింది.

తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సిఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు.

### వెయ్యి రోజుల ప్రజా పాలనను చూసి

# కెటిఆర్ డ్రామాలు

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ప్రజా ప్రభుత్వం విజయవంతంగా సాగుతుండటాన్ని జీర్ణించుకోలేక బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రైతుల పేరుతో కొత్త రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని విమర్శించారు.కెసిఆర్ 3,470 రోజుల పాటు ఫామ్‌హౌస్ నుంచి పాలన సాగిస్తే.. తమ ప్రభుత్వం ప్రజల మధ్య ఉంటూ ప్రజా పాలన అందిస్తోందని అయిలయ్య అన్నారు. తమ వెయ్యి రోజుల పాలనతో ప్రజలు సంతోషంగా ఉంటే కల్వకుంట్ల కుటుంబం మాత్రం అధికారం కోల్పోయిన బాధలో ఉందని ఎద్దేవా చేశారు.

గత యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 13.37 లక్షల మంది రైతులకు రూ.18,929 కోట్లు చెల్లించామని తెలిపారు. రెండు సీజన్లలో 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.35,077 కోట్లు చెల్లించామని వెల్లడించారు. నల్గొండలో కెటిఆర్ రైతు సమావేశం నిర్వహించడంపై అయిలయ్య తీవ్రంగా స్పందించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సాగర్ ఎడమ కాల్వను ఆధునీకరించారా? డిండి ప్రాజెక్టును పూర్తి చేశారా? ఉదయ సముద్రాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఉదయ సముద్రం పనులను పూర్తి చేశామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షాలు తగ్గాయని, నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ప్రస్తుతం తాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నామని అయిలయ్య అన్నారు. దీన్నే రాజకీయంగా ఉపయోగించుకునేందుకు కెటిఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫ్లోరైడ్, మూసీ కాలుష్యంతో నల్గొండ ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో బిఆర్ఎస్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కెటిఆర్ ఎన్ని పాదయాత్రలు చేసినా, మోకాళ్ల యాత్రలు చేసినా, పొర్లు దండాలు పెట్టినా ప్రజలు నమ్మరని అయిలయ్య వ్యాఖ్యానించారు. నల్గొండలో చిల్లర రాజకీయాలు, జిమ్మిక్కులు పనిచేయవని, ప్రజలు బిఆర్ఎస్‌ను తిరస్కరిస్తారని అన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదని, మంత్రి పదవిని త్యాగం చేసిన చరిత్ర కోమటిరెడ్డిదని పేర్కొన్నారు.

# గిగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆటో, క్యాబ్, యాప్ ఆధారిత రవాణా రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో శుక్రవారం తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యూనియన్ ప్రతినిధి షేక్ సలావుద్దీన్‌తో పాటు పలువురు నాయకులు మంత్రిని కలిసి మోటార్ వెహికల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్2025ను త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ఓలా, ఉబెర్, రాపిడో, పోర్టర్ వంటి అగ్రిగేటర్లపై నియంత్రణకు ప్రభుత్వం నిర్దేశించే కనీస బేస్ ఛార్జీ, కిలోమీటర్, నిమిషం ఛార్జీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాప్ ఆధారిత ప్రయాణికుల, సరుకుల రవాణాలో ఉపయోగించే ప్రైవేట్ వాహనాలపై నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, అవసరమైన చోట వాణిజ్య రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని కోరారు. పెరుగుతున్న ఇంధన, వాహన నిర్వహణ, జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని హైర్ వెహికల్ ఛార్జీలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం, 2012 తర్వాత ఆటో ఛార్జీల పెంపుపై చర్యలు చేపట్టడంపై యూనియన్ ప్రతినిధులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వారు ప్రస్తావించిన అంశాలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### ఎపిలో కరువు మండలాలు

## వెంటనే ప్రకటించాలి



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 300కు పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఒక్క ఎకరాలో కూడా పంట పండని పరిస్థితి ఉన్నా ఇప్పటివరకు కరువు మండలాలు ప్రకటించలేదని శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈ అంశాలపై ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 8న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగించము

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

### ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియ పరిశీలన



ప్రజాపక్షం/హైదరాబాద్ : సికింద్రాబాద్70అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని తార్నాక, లాలాపేట్ హియరింగ్ కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ (ఎన్నికలు) బి. సంతోష్ శుక్రవారం సందర్శించారు. ఓటర్ల పునఃపరిశీలన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. అన్‌మ్యాపింగ్, అనమాలిస్‌కు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, తగిన ఆధారాలు, డాక్యుమెంట్లను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా హియరింగ్స్ నిర్వహించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. హియరింగ్‌కు హాజరైన ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సందేహాలను అధికారులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా తొలగించబోమని అధికారులు స్పష్టం చేస్తూ ఓటర్లకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ ఏఎస్‌డి (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ అండ్ డూప్లికేట్) ఓటర్ల వివరాల పునఃపరిశీలనలో భాగమని తెలిపారు. అర్హత కలిగిన ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకుని, అవసరమైతే ఈ ప్రక్రియ ద్వారా తమ హక్కులను వినియోగించుకోవాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.

**ఫారం– 6, 7, 8 ద్వారా దరఖాస్తుకు అవకాశం :** ఓటర్ల వివరాల్లో మార్పులు, కొత్త నమోదు, తొలగింపు లేదా ఇతర సవరణలు అవసరమైతే ఫారం– 6, 7, 8ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్‌లను పోలింగ్ స్టేషన్‌లలోని కేంద్రాలు, హెల్ప్‌లైన్‌లకు, ఇఆర్ఓ కార్యాలయంలో సమర్పించవచ్చని చెప్పారు.

**ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ప్రత్యేక ప్రచారం :** సికింద్రాబాద్ 70 నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్లలో అవగాహన కల్పించేందుకు రెండు దశల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టనున్నారు. మొదటి దశ సెప్టెంబర్ 5, 6 తేదీల్లో, రెండో దశ సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనుంది. ఓటరు జాబితా పునఃపరిశీలన, ఏఎస్‌డి, అన్‌మ్యాపింగ్, అనమాలీస్, సూచనలు, అభ్యంతరాలు, వివిధ ఫారాల ద్వారా దరఖాస్తు విధానంపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ ఎంఎన్ఆర్ జ్యోతి, ఏఈఆర్ఓలు, డిసి సుధీర్ సింగ్, తార్నాక అదనపు ఏఈఆర్ఓ నాగమణి, బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటర్ విద్యా విధానాన్ని

## కాపాడుకోవాల్సిందే : కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిన తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను దెబ్బతీసే చర్యలను సహించేది లేదని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని మీడియా అకాడమీలో ఇంటర్ విద్యా జెఎసి చైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్ జంగ్ సైరన్' సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఇంటర్ బోర్డును ఎస్ఎస్‌సి బోర్డులో విలీనం చేసే ఆలోచనలను, ప్రథమ సంవత్సరం పరీక్షలను రద్దు చేసే ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యా వ్యవస్థలో నాణ్యతను కాపాడటానికి పరీక్షలు ఎంతో అవసరమని, ఇంటర్ విద్యను కాపాడుకునేందుకు జరిగే పోరాటంలో తమ పార్టీ ముందు వరుసలో ఉంటుందని హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యకు రూ.50 వేల కోట్లు, ఉచిత వైద్యానికి రూ.50 వేల కోట్లు కేటాయిస్తుందని వెల్లడించారు. అనంతరం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విదేశీ విద్యా నమూనాలను పరిశీలించే అధికారులు పక్క రాష్ట్రంలో ఏం జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మక సంస్థలలో మన విద్యార్థులు రాణించడానికి ఇక్కడి ఇంటర్మీడియట్ విద్యా విధానమే పునాది అని స్పష్టం చేశారు. సరైన అవగాహన లేకుండా ఇచ్చే సలహాలను పాటించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కొండా సురేఖను బిఆర్ఎస్‌లోకి రానివ్వం

### తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ కేబినెట్ నుంచి కొండా సురేఖ బర్తరఫ్ అనంతరం రాష్ట్ర రాజకీయాలు తీవ్ర ఉత్కంఠగా మారాయి. ఆమె కాంగ్రెస్‌ను వీడి బిఆర్ఎస్‌లో చేరుతున్నారంటూ వస్తున్న వార్తలను ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి. జగదీష్ రెడ్డి ఖండించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కొండా సురేఖను ఎట్టి పరిస్థితుల్లోనూ బిఆర్ఎస్‌లోకి చేర్చుకోమని, కనీసం తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వమని స్పష్టం చేశారు. గతంలో పార్టీని వీడి వెళ్లిన వారి విషయంలో కఠినంగా ఉంటామని, క్యారెక్టర్ ఆధారంగా ఒకరిద్దరిని తప్ప మిగతా ఎవరినీ మళ్లీ చేర్చుకునే ప్రసక్తి లేదని జగదీశ్ రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోకి చేరేందుకు సిద్ధంగా వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డి అప్లికేషన్ పెట్టుకున్నా బిఆర్ఎస్‌లోకి తీసుకోమని, ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డి ఆయనకు మంత్రి పదవి ఇస్తే అది పూర్తి స్థాయిలో అమ్ముడుపోయినట్టేనని ఆరోపించారు.

**సిఎంనే బర్తరఫ్ చేయాలి..** రేవంత్ రెడ్డి ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో సాధించిందేమీ లేదని, కేవలం ఒక మహిళా మంత్రిని బర్తరఫ్ చేయడమే ఆయన సాధించిన ఘనత అని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత లేవనెత్తిన అవినీతి ఆరోపణలు, కాంట్రాక్టర్‌ల వద్ద వసూళ్ల వ్యవహారాలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అసలు ఈ వ్యవహారంలో బర్తరఫ్ కావాల్సింది కొండా సురేఖ కాదని, సిఎం రేవంత్ రెడ్డినే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా దారి తప్పిందని మండిపడ్డారు. గత కెసిఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి'ని తొలగించి 'భూ భారతి' పేరుతో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్‌లు, పైరవీకారుల వ్యవస్థను ప్రోత్సహిస్తున్నారన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావలసిన వాటాలను కాపాడుకోవడంలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసమే నడుస్తోందని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో జరిగిన ఈడి దాడులపై స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించిన ఆయన, అమ్ముడుపోయిన ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై శాసనసభ ఎథిక్స్ కమిటీ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, పార్టీ నేత నంద్యాల దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పర్యాటక ప్రాంతాల్లో పనులు వేగవంతం చేయాలి

### నిర్దేశిత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి : టిజిటిడిసి ఎండి గౌతమి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, హరిత హోటళ్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై నిర్వహించిన ఇంజినీరింగ్ సమీక్ష సమావేశంలో పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. రామప్ప, నిజాంసాగర్, బుద్ధవనం, భువనగిరి కోట, అనంతగిరి హిల్స్ తదితర ప్రాంతాల్లో చేపడుతున్న మౌలిక వసతుల పనుల స్థితిగతులను పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యాలు, వసతి, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్, సివిల్ పనులతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమోదిత ప్రమాణాలు, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, క్షేత్రస్థాయి తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, సంబంధిత శాఖలతో సమన్వయం పెంచుకోవాలని స్పష్టం చేశారు. హరిథ హోటళ్లు, టిజిటిడిసికు చెందిన ఇతర ఆస్తుల్లో జరుగుతున్న పనుల పురోగతిని కూడా సమీక్షించారు. పర్యాటక మౌలిక వసతులు సురక్షితంగా, సౌకర్యవంతంగా, ఆకర్షణీయంగా, అందరికీ అందుబాటులో ఉండేలా అభివృద్ధి చేయాలని సూచించారు. స్థిరమైన పర్యాటక అభివృద్ధితో పాటు స్థానిక సమాజాలకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా ప్రాజెక్టులను అమలు చేయాలని ఆదేశించారు. ప్రధాన ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, కాలానుగుణంగా నివేదికలు సమర్పించాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. సమావేశంలో టిజిటిడిసి ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నేపాల్ బాధితులకు రూ.10 లక్షలు విరాళం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రకృతి విలయంలో తీవ్ర భయానక విపత్తును ఎదుర్కొంటున్న నేపాల్ బాధితులకు సహాయార్థం శ్రీ రామానుజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన సహాయ కార్యక్రమానికి దాతలు మానవతా దృక్పథంతో స్పందించి రూ.10,55,116లు విరాళంగా అందించనున్నామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.సేకరించిన మొత్తాన్ని చెక్కు రూపంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా డిఆర్‌డిఓ మాజీ చైర్మన్, ప్రధాన మంత్రి సలహాదారులు జి సతీష్‌రెడ్డికి అందజేయనున్నట్లు ట్రస్టు చైర్మన్ డాక్టర్ ధనంజయ తెలిపారు. ప్రకృతి విపత్తు సమయంలో బాధితుల కోసం స్పందించి తమవంతు సహాయాన్ని అందించిన ప్రతి దాతకు శ్రీరామానుజ సేవా ట్రస్టు తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## డాన్సులు మానేసి ప్రజలకు సేవ చేయి

### ఎమ్మెల్యే మల్లారెడ్డికి నర్సింహాయాదవ్, వెంకటేష్ హితవు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవచేయడం మానేసి డాన్సులు చేస్తున్న మల్లారెడ్డి డాన్సులు మానేసి ప్రజలకు సేవ చేయాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ హితవు పలికారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో కాంగ్రెస్ వేయి రోజుల పాలనలో భాగంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలను పురస్కరించుకుని మూడు చింతలపల్లి ప్రధాన చౌరస్తాలో రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డిలు విచ్చేసి సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బైక్ ర్యాలీని కాంగ్రెస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేసిందేమి లేదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ప్రజలకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్నాడని కొనియాడారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి తన సొంత వ్యాపారాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రజల మంచి చెడులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోయిన నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కారం చేస్తున్నాడని అన్నారు. మా నాయకుడు వజ్రేష్‌యాదవ్ జోలికి వస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాపిరెడ్డి, జిల్లా నాయకులు గొనె మహేందర్‌రెడ్డి, ఇర్రి రవీందర్‌రెడ్డి, బండి జగన్నాథం, బస్వారెడ్డి, రామిడి శశిధర్‌రెడ్డి, కె బాలకృష్ణ, నల్ల ప్రభాకర్‌రెడ్డి, కీసరి నర్సింలు, రాజేంద్రప్రసాద్‌గౌడ్, వీరేశంగుప్త, బొగ్గుల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయుడిగా గడ్డమీది బాలరాజు

**ప్రజాపక్షం/దుండిగల్ :** మేడ్చల్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డమీది బాలరాజు ఎంపికయ్యారు. ఉపాధ్యాయదినోత్సవ సందర్భంగా శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయనను జిల్లా కలెక్టర్ సత్కరిస్తారు. 1999లో డిగ్రీ పూర్తి చేసిన వెంటనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని బౌరంపేట ఉన్నత పాఠశాలలో విద్యావాలంటర్ గా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సి బోటనీ, బిఎడ్ పూర్తి చేశారు. కూకట్‌పల్లిలో ఓ ప్రయివేట్ కాలేజీలో బోటనీ లెక్చరర్‌గా పనిచేశారు. అనంతరం బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అత్యుత్తమ విద్యను అందించాలన్న లక్ష్యంతో జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప, కూన మహాలక్ష్మి నగర్ ప్రాంతంలో సంస్కృత పాఠశాలను నెలకొల్పాడు. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం అధికంగా ఉండే ఈ ప్రాంతంలో వారి పిల్లలకు తక్కువ ఫీజులకే విద్యను అందిస్తున్నాడు. అదే ప్రాంతంలో పలువురు నిరుద్యోగులకు ఉపాధిని కలిపించి ఆదర్శంగా నిలిచాడు. పాఠశాల ద్వారా పిల్లలకు విద్యను అందించడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. అంగన్వాడీ పిల్లలకు ఎప్పటికి అప్పుడు చేయూతనిస్తూ కుర్చీలను, వంట సామాగ్రిని అందజేసే కార్యక్రమం చేపట్టారు. సామాజిక బాధ్యతగా రాజీవ్ గృహకల్ప, కూన మహాలక్ష్మి నగర్‌లలో ప్రతి ఏడాది ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి తన సేవా దృక్పథం చాటుకుంటున్నారు. ఈ క్రమంలో 2026 జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావ డంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల పిల్లలకు ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తానన్నారు.





## బంగారు గొలుసు స్నాచింగ్... 20 గంటల్లో నిందితుల అరెస్టు

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మహిళ మెడలోంచి బంగారు గొలుసు స్నాచింగ్ చేసిన నిందితులను మేడిపల్లి పోలీసులు 20 గంటల్లోగా పట్టుకొని కటకటాల వెనక్కు పంపారు. సాంకేతిక పరిజ్ఞానం, సిసి కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితుల నుండి చోరీ చేసిన గొలుసు, స్నాచింగ్‌కు వినియోగించిన బైకు స్వాధీనం చేసుకొన్నారు. ఉప్పల్ జోనల్ ఎసిపి మోహన్, ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం గత బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఆర్టీసీ కాలనీలో నడుచుకొంటూ వెళుతున్న చల్లా భారతి(38)ని వెనక నుండి బైకుపై వచ్చిన ఓ యువకుడు దగ్గరకు చేరుకొని మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని సమీపంలో బైక్ వరకు పరుగెత్తుకుంటూ వెళ్ళి పరారయ్యాడు. ఈ మేరకు ఆమె అందించిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొన్న పోలీసులు సిసి కెమెరాల ఫుటేజీల ఆధారంగా రాజమండ్రికి చెందిన కంగాల ప్రసాద్(39), నర్సంపేటకు చెందిన వెంకటేష్(24)లను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకొన్నారు. తమదైన శైలిలో విచారించి వారి నుండి బంగారు గొలుసు, బైకు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన డిఎస్ఐ శ్రీనివాస్, ఎఎస్ఐ బాల్‌సింగ్, హెచ్‌సి సునీల్, పిసిలు నవీన్, శ్రీకాంత్, ఎసిపి రివార్డులందించి అభినందించారు.

### అమెరికా క్రీడా వ్యవస్థపై

# ''వైపెసు'' ఉన్నతస్థాయి సదస్సు

### భారత్– అమెరికా క్రీడా జ్ఞాన మార్పిడికి ప్రాధాన్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ స్థాయి క్రీడా విద్య, పరిశోధన, క్రీడా శాస్త్రం, పాలన వ్యవస్థలను తెలంగాణలో అభివృద్ధి చేసేందుకు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (వైపెసు) అంతర్జాతీయ జ్ఞాన మార్పిడిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం 'అమెరికన్ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్'పై ఉన్నతస్థాయి పబ్లిక్ లెక్చర్, ఇంటరాక్టివ్ ప్రొఫెషనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. అమెరికా జాతీయ కాలేజియేట్ అథ్లెటిక్ అసోసియేషన్ (ఎన్‌సిఎఎ) మాజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కెవిన్ లెన్నన్ ఈ కార్యక్రమంలో పాల్గొని అమెరికా విశ్వవిద్యాలయ క్రీడా వ్యవస్థ అభివృద్ధి, క్రీడా పాలన, విధాన రూపకల్పన, క్రీడాకారుల సంక్షేమం, స్కాలర్‌షిప్‌లు, కోచింగ్, ప్రతిభా గుర్తింపు తదితర అంశాలపై తన అనుభవాలను పంచుకున్నారు. భారత్–అమెరికా క్రీడా వ్యవస్థల మధ్య సహకారం, క్రీడా శాస్త్రం, పరిశోధన, సాంకేతికత, హైపర్ఫార్మెన్స్ కార్యక్రమాలు, వృత్తిపరమైన అవకాశాలపై నిపుణులు చర్చించారు. అంతర్జాతీయంగా విజయవంతమైన క్రీడా నమూనాలను భారత పరిస్థితులకు అనుగుణంగా అధ్యయనం చేసి అమలు చేయాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. ప్రపంచ స్థాయి క్రీడా విశ్వవిద్యాలయంగా వైపెసు ను తీర్చిదిద్దే లక్ష్యంతో అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు, అధ్యాపకులు–విద్యార్థుల మార్పిడి, ఉమ్మడి పరిశోధనలు, కోచ్‌ల శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, స్పోరట్స్ టెక్నాల జీ, ఆధారిత క్రీడా పాలనకు ప్రాధా న్యం ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైపెసు వైస్ చాన్సలర్ డాక్టర్ కిశోర్ గోపీనాథన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ ప్రతినిధులు ఎమీలియా స్మిత్, టి. సెంథిల్‌కుమార్, ప్రొఫెసర్ చిన్నప్ప రెడ్డి, వైపెసు ఒఎస్‌డి డాక్టర్ కె. నరసయ్యతో పాటు క్రీడాకారులు, విద్యావేత్తలు, క్రీడా శాస్త్ర నిపుణులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల ప్రజాపాలనపై భారీ బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతని ఇస్తోందని డిసిసి అధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మల్కాజ్‌గిరి కార్పొరేషన్ నాగారం డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘనంగా భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వజ్రేష్‌యాదవ్ అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాన్ని ర్యాలీని ప్రారంభించారు. వెయ్యి రోజుల ప్రజా పాలనలో తెలంగాణ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందని,ఆరు గ్యారంటీల ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలుస్తుదని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాలతో ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌకుట్ల జీవన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, భూమయ్యయాదవ్, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**జవహర్ నగర్‌లో:** జవహర్ నగర్, చంద్రపురి డివిజన్ ల పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బ్రహ్మాండమైన బైక్ ర్యాలీని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకా లు, సంక్షేమ కార్యక్రమాలు వివిధ అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలకు మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు తోటకూర వజ్రేష్ యాదవ్ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కొటేష్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగిస్తోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, గ్రామీణ పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ర్యాలీలో డివిజన్ స్థాయి నాయకులు, మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హస్తం జెండాల హోరుతో, పకడ్బందీగా సాగిన ఈ బైక్ ర్యాలీ అంబేద్కర్ నగర్ నుండి జవహర్ నగర్ అంబేద్కర్ చౌరస్తా వరకు వీధుల్లో సందడి వాతావరణాన్ని నింపింది. కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేశారు.



## విద్యార్థుల ఆలోచనలకు సాంకేతిక పదును

### కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** వాస్తవ సమస్యలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్న పరిష్కారాలు రూపొందించే లక్ష్యంతో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్,2026లో భాగంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కెపిఆర్ఐటి స్వయం ప్రతిపత్తి)లో 24 గంటల అంతర్గత హ్యాకథాన్ ప్రారంభమైంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి విద్యా మంత్రిత్వ శాఖ ఆవిష్కరణ విభా గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థులు కృత్రిమ మేధస్సు, సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్స్ అంతర్జాల అనుసంధాన పరికరాల ఆధారంగా పరిష్కారాలను రూపొందించనున్నారు. ప్రతిభ కనబరచే బృందాలను తదుపరి దశకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో వ్యూహాత్మక విభాగం డైరెక్టర్ కొమ్మూరి దివ్య, ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా. సి.డి నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ వై శ్రీనాథ్ కశ్యప్,ఉప ప్రిన్సిపాల్ వై.విశ్వశ్రీ, ఇసిఇ విభాగాధిపతి సమన్వయకర్త డా.అనిల్ కుమార్, పరిశోధన,అభివృద్ధి విభాగం డీన్ డా.రాజేష్ బనాల పాల్గొన్నా రు. విద్యార్థుల్లో ఆవిష్కరణ, బృంద సమన్వయం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేందుకు హ్యాకథాన్ దోహపడుతుందని వారు తెలిపారు.

## నకిలీ వైద్యుడి అరెస్టు

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఎలాంటి వైద్యార్హతలు లేకుండా ప్రైమరీ హెల్త్ కేర్ పేరిట వైద్యం అందిస్తున్న నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేసారు. విశ్వస నీయ సమాచారంతో గురువారం మధ్యాహ్నం ఉప్పల్ పోలీసులు గాంధీనగర్ ప్రాంతంలోని అభినయ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌పై దాడి చేసారు. అక్కడ వైద్యం అందిస్తున్న కె. రామకృష్ణకు ఎలాంటి వైద్య పరిజ్ఞానం లేదని, ఎలాంటి వైద్య డిగ్రీలు లేవని తెలియటంతో అతడిని అదుపులోకి తీసుకొన్నారు. క్లినిక్‌లో వైద్యానికి వినియోగిస్తున్న స్టెతస్కోప్, ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, మందులు ఇతర వైద్య సామగ్రిని స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేసుకొన్నారు.



## ఆహార భద్రతకు నిలువెత్తు నిదర్శనం రేషన్ డీలర్లే




**ప్రజాపక్షం/కీసర :** పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా నిరంతరం లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసర సరుకులను అందిస్తూ ప్రభుత్వ ఆహార భద్రతా పథకాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తున్న రేషన్ డీలర్ల సేవలను గుర్తించి, కీసర మండలంలో వారిని ఘనంగా సన్మానించారు. కీసర మండల సామాజిక సేవా కార్యకర్తలు తుడుం శ్రీనివాస్, రాగుల రమేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. సమాజంలో నిశ్శబ్దంగా సేవలు అందిస్తున్న గ్రౌండ్ లెవల్ హీరోలు రేషన్ డీలర్లేనని నిర్వాహకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కీసర మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు తటాకం వెంకటేష్ శర్మతో పాటు ప్రముఖ డీలర్లు కుంటోళ్ల విజయచందర్, గండు లాలి యాదవ్‌లను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**సేవలను గుర్తించడం ఎంతో సంతోషకరం: తటాకం వెంకటేష్ శర్మ**

సన్మాన గ్రహీత, రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు తటాకం వెంకటేష్ శర్మ మాట్లాడుతూ, మా సేవలను ఇప్పటివరకు అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పెద్దగా గుర్తించలేదు. కానీ స్థానిక సామాజిక సేవా కార్యకర్తలు ముందుకు వచ్చి మా కష్టాన్ని గుర్తించి సన్మానించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. లబ్ధిదారులకు ఎల్లప్పుడూ సమయానికి బియ్యం సరఫరా చేయడమే మా ప్రధాన లక్ష్యం. ప్రజల ఆశీస్సులతో ఈ సేవా ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తాం అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్తలు శ్రీనివాస్, కీసర గుట్ట బుడిగ జగన్, చిలక ముత్యాలు ముదిరాజ్, పండుగ రాజలింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందిస్తాం

### మహేష్ కుమార్



**ప్రజాపక్షం/పరిగి :** అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని జాపర్‌పల్లి గ్రామ సర్పంచు మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పరిగి మండలం జాపర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు భారతమ్మ, శ్రీనివాస్, సత్త య్య లలిత, పెంటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పి.శ్రీశైలం యాదవ్

**ప్రజాపక్షం/దుండిగల్ :** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సురారం డివిజన్ , రాజీవ్ గాంధీ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో 293వ జీహెచ్ఎంసీ సు రారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో శాంతి, సంతో షం, ఆయురారోగ్యం, సౌభాగ్యం నిండాలని ఆకాంక్షించారు. అలాగే భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించిన నిర్వాహకులు, కాలనీ సభ్యులు, యువతను అభినందిస్తూ, ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## బిఆర్‌ఎస్ 'వంటా– వార్పు' లో భద్రారెడ్డి ఫైర్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. పోచారం డివిజన్ అన్నోజిగూడలోని ఆర్‌జీకే వికలాంగుల కాలనీ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బిఆర్ఎస్ నాయకుడు సామల సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో యువ నాయకుడు చామకూర భద్రారెడ్డి పాల్గొని ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ముఖ్యంగా పింఛన్ల పెంపు హామీని అమలు చేయకపోవడంపై ప్రశ్నిస్తూ బలమైన గళం వినిపించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బద్దం జగన్మోహన్ రెడ్డి, సామల సందీప్ రెడ్డి, హరిప్రసాద్ రావులు పాల్గొన్నా రు.





## ఆయిల్ పామ్ సాగు విస్తరణకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్

**ప్రజాపక్షం /బొంరాస్‌పేట్:** కొడంగల్ నియోజకవర్గంలో అయిల్ పామ్ సాగు విస్తరణకు ఊతమిస్తూ మోగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బొమ్మారాస్ పేట్ మండలంలోని నాందాపూర్ గ్రామంలో మొత్తం 201.94ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా 68మంది లబ్దిదారులకు చెందిన పొలాల్లో 1154అయిల్ మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట వ్యవసాయ ఉత్పత్తి కమిషన్ సురేంద్ర మోహన్, ఉద్యానశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా హాజరై రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయిల్ పామ్ మొక్కలు పంపిణిచేసి నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలతో పాటు స్థిరమైన ఆదాయాన్ని అందించే అయిల్ పామ్ వంటి పంటల వైపు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ సహకారంతో అయిల్ పామ్ సాగు పెంచడానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమల, సురేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.



## వంటావార్పులతో బిఆర్‌ఎస్ వినూత్న నిరసనలు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** అసమర్థ పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచించిదంటూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇకనైనా తీరు మార్చుకొని ప్రజలకు మేలుచేసే విధానాలను చేపట్టకపోతే రానున్న ఎన్నికల్లో కనుమరుగు కాకతప్పదన్నారు. గత 1000 రోజుల పాలనా వైఫల్యానికి నిరసన కారక్రమాల్లో భాగంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ,వెంకటరెడ్డినగర్, నాచారం, హెచ్‌ఎంటినగర్ డివిజన్లకు చెందిన బిఆర్‌ఎస్ శ్రేణులు పలు ప్రజా కూడళ్లలో వినూత్నంగా వంటా వార్పుతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కదాన్నీ సమర్థవంతంగా అమలు చేయకపోగా ఆర్భాట ప్రచారాలకే ప్రాధాన్యత ఇస్తూ వచ్చారని ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గంధం జ్యోత్స్న, నాగేశ్వరరావు, దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, శ్రీనివాసరెడ్డి, పార్టీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, బాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలి**

22 ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూయజమానుల సమస్యను ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి డిమాండ్ చేసారు. ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తప్పిదం జరిగిందంటూ ప్రభుత్వం అంగీకరిస్తే సరిపోదని, ఈ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పేద ప్రజల స్థలాలపై పూర్తి హక్కులు పొందేలా నిషేధిత జాబితా నుండి తొలగించాలన్నారు. అనంతరం ఉప్పల్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.




## వంటా వార్పుతో బిఆర్‌ఎస్ శ్రేణుల నిరసనలు

**ప్రజాపక్షం/దుండిగల్ :** కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద వంటా వార్పుతో నిరసన తెలిపిన బిఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు బిఆర్‌ఎస్ శ్రేణులు చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మూడవరోజు చేపట్టిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను విస్మరించడానికి నిరసిస్తూ జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద మహిళా నాయకురాల్లు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ వంట వార్పు కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ బిఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి పాల్గొని మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణి, మోసపూరిత తనాన్ని ఎండగట్టారు. మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మహిళలు బొందపెట్టడం ఖాయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొ న్నారు.

## తాండూరులో దొంగల హల్ చల్.. పెళ్ళికి వెళ్ళి వచ్చే సరికి ఇల్లు గుల్ల

### పది తులాల బంగారం, రెండు కిలోల వెండి అపహరణ

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో దొంగలు అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. తాండూరు పట్టణ శివారులోని ఓ వ్యాపారికి చెందిన ఇంట్లో చోరికి పాల్పడిన దొంగల మూఠ ఎకంగా పది తులాల బంగారం, రెండు కిలోల వెండి,నగదును ఆపహరించుక పోయినట్లు బాధితులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి దొంగల మూఠ తాండూరు పట్టణంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా పెట్టుకుని భారి చోరికి పాల్పడినట్లు తెలుస్తుంది. ఒకో రోజు మూడు చోట్ల చోరిలకు పాల్పడినటు తెలిసింది. పట్టణ శివారు శ్రీరాం నగర్‌లోని సతీష్ కుటుంబ సభ్యులు బందువుల పెళ్ళికి వెళ్లి వచ్చే సరికి దొంగలు ఇల్లును గుల్ల చేశారు. ఇంట్లోకి చోరబడిన దొంగలు ఏకంగా పది తులాల బంగారం, రెండు తులాల వెండి ఆభరణాలు, నగదును ఆపహరించుక పోయ్యారు. అక్కడితో ఆగకుండా దొంగల ముఠ అదే కాలనిలో మరో ఇంట్లోకి చోరికి దిగారు బంగారు ఆభరణాలను దొంగలించినట్లు తెపారు. సాయిపూర్‌లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన రెండు బైక్‌లను సైతం దొంగలించుక పోయ్యారు. బైక్‌లను ఆపహరించిన దృశ్యాలు సిసి కెమెరాలలో నమోదైనట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



GREATER HYDERABAD మహానగరి
హైదరాబాద్
శనివారం
05-09-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## స్కూల్ బస్సు ఢీకొని టీచర్ మృతి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** స్కూల్ బస్సు ఢీకొన ఓటీచర్ మృతిచెందింది. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం వనస్థలిపురం ఎస్ఐ. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఇంజాపూర్‌లోని వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న అడతి భాగ్యలక్ష్మి (32) తన భర్త సురేందర్‌తో కలిసి వారి పిల్లలతో పాటు గురువారం సాయంత్రం బి.ఎన్.రెడ్డి వైపు వస్తున్నారు. మార్గమధ్యలో లైఫ్ కేర్ హాస్పిటల్ వద్ద వారి వెనకాల వస్తున్న మాంచెస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు ఢీకొని భాగ్యలక్ష్మి పై నుండి బస్సుచక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె భర్తకు స్వల్ప గాయాలు, వారి ఇద్దరు కూతుళ్లకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. భాగ్యలక్ష్మి ని వెంటనే అక్కడే ఉన్న లైఫ్ కేర్ హాస్పిటల్, మెరుగైన చికిత్స కోసం ఎల్‌బి నగర్ కామినేని, అక్కడి నుంచి గాంధీ హాస్పిటల్‌కు తరలించగా శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని మృతురాలు తండ్రి నర్సన్న వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వనస్థలిపురం ఎస్ఐ. నాగరాజు కేసు నమోదు చేసి మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

## కార్మికుల పక్షాన పోరాటాలు





**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఈ నెల 6,7,8 తేదీలలో కరీంనగర్‌లో జరుగుతున్నటువంటి ఎఐటియుసి 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని భూ పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి కోరారు. శక్రువారం అబ్దుల్లాపూర్ మెట్టు రావి నారాయణరెడ్డి భూ పోరాట కేంద్రం పెద్ద జెండా వద్ద ఎఐటియుసి పోస్టర్‌ను సిపిఐ మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బతి లక్ష్మణ్, కేతరాజు నరసింహ, బిఓసి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, దవుల రాములు, మంగళపల్లి రవి, వీణ, యాదగిరి, బాల్‌రెడ్డి, సువర్ణ, వీరేష్ పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనుల భూసేకరణకు గెజిట్ విడుదల



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనుల భూసేకరణకు గెజిట్ విడుదల కావడంపై జెఏసి నేతలు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం షాద్‌నగర్ డివిజన్‌లోని జిల్లేడు చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించే ప్రాంతంలో జెఏసి నేతలు మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీకి రూపాంతరం సంతరించుకొని భూసేకరణకు గెజిట్ విడుదల కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, జెఏసి నాయకులు జనార్ధన్, వంగురి గంగిరెడ్డి, నర్సింగ్ గౌడ్, నక్కబాల్‌రాజ్, బాదేపల్లి సిద్దార్థ, గొర్లరాము, గడ్డం జంగయ్య, నర్సింలు, గణేష్, కృష్ణయ్య, మందారం నర్సింలు, పరంజ్యోతి, బి.నర్సింలు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధిలో రాణించాలి




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** యువత స్వయం ఉపాధితో రాణించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై బజార్ ప్రీమియర్ కార్ స్టూడియోను ఎమ్మెల్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు, కానుగు అనంతయ్య, చింటు ప్రతాప్‌రెడ్డి, నందకిషోర్, మాజీ సర్పంచ్ యారం శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మామిలపల్లి రాజు, యువ నాయకులు దినేష్‌సాగర్, అన్వారీ రాజు, నవీన్, మహేష్ పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొల్లగూడ గ్రామ పంచాయతీలోని కాలనీ తండాలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మెల్లగూడ సర్పంచ్ మంగ రవి నాయక్, ఉప సర్పంచ్ పాత్లావత్ రాజునాయక్, నేతలు మహిపాల్ గౌడ్, రామునాయక్ పాల్గొన్నారు.

## పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టం చేయాలి




**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామాల్లో పోలీసులు పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని సర్పంచ్‌ల సంఘం మండల ఉపాధ్యక్షుడు గోపాల్ నాయక్ కోరారు. శుక్రవారం కొందుర్గు ఎస్ఐ బిఎస్ఎస్ వరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జర్పుల గోపాల్‌నాయక్, రమేష్, మరాఠీ రాజకుమార్, లింబ్య నాయక్, జోగు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** శ్రీపురం కాలనీలోని భృంగి హాస్పిటల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు పోతుగంటి భారత్ ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భృంగి హాస్పిటల్ చైర్మన్ శిరీష్ కుమార్, సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, శ్రీపురం కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విటల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉమేశ్‌చంద్ర నిత్య స్ఫూర్తి

### సిపి సజ్జనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీతి, నిజాయితీ, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన దివంగత ఐపిఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర పోలీసు వ్యవస్థకు నిత్య స్ఫూర్తి అని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి సజ్జనర్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు, ప్రాణత్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. ఉమేశ్‌చంద్ర 27వ వర్ధంతి సందర్భంగా ఎస్ఆర్ నగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి సిపి సజ్జనర్ పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసు వ్యవస్థతో పాటు సమాజానికి ఉమేశ్‌చంద్ర అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిజిపి (ఆపరేషన్స్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్) డాక్టర్ అనిల్‌కుమార్, ఉమేశ్‌చంద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ.. ఉమేశ్‌చంద్రతో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. ఆయన పనిచేసిన వరంగల్, కడప, పులివెందుల తదితర ప్రాంతాల్లో తాను కూడా విధులు నిర్వహించానని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఇప్పటికీ ఉమేశ్‌చంద్ర నిజాయితీ, సమర్థ పాలనను గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో ఉమేశ్‌చంద్ర కీలక పాత్ర పోషించారని, అలాంటి గొప్ప పోలీసు నాయకుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. నేడు సమాజంలో ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలు నెలకొనడానికి ఉమేశ్‌చంద్ర వంటి ఎందరో అమరవీరుల త్యాగాలే కారణమని పేర్కొన్నారు. వారి కర్తవ్యనిష్ఠ, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సిపి సజ్జనర్ పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా పివి.సునీత ఎంపిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.వి. సునీత ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి (డిఈఓ) కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. గత ఐదేళ్లుగా రాజ్ భవన్ పాఠశాలలో సేవలందిస్తున్న సునీత, తన బోధనా నైపుణ్యంతో పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఇంగ్లీష్ సబ్జెక్టులో వరుసగా వంద శాతం ఉత్తీర్ణతా ఫలితాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. బస్తీ ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా ఆమె ప్రత్యేక శ్రద్ధతో పాఠాలు బోధిస్తూ, వారిలో విద్యాభిలాషను పెంపొందించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు నాటేందుకు కూడా ఆమె అంకితభావంతో కృషి చేస్తున్నారు. తన వృత్తి పట్ల నిబద్ధతతో, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న సునీతకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం దక్కడం పట్ల రాజ్ భవన్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సునీత సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## అశ్విని మృతిపై విచారణ

### బిసి దళ్ జాతీయ అధ్యక్షుడు, బిసి రిజర్వేషన్ సాధన సమన్వయ జెఎసి చైర్మన్ కుమారస్వామి డిమాండ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకులంలో ఇంటర్ విద్యార్థిని అశ్విని అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై విచారణ చేపట్టాలని బిసి దళ్ జాతీయ అధ్యక్షుడు, బిసి రిజర్వేషన్ సాధన సమన్వయ జెఏసి చైర్మన్, న్యాయవాది దుండ్ర కుమారస్వామి తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను కోరారు. హాస్టల్ గదిలో చున్నీతో ఉరి వేసుకున్న పరిస్థితిలో అశ్విని కనిపించిందని, అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కథనాల ద్వారా తెలిసిందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని గురుకులంలో చదువుతున్న విద్యార్థిని ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఘటనను కేవలం ఆత్మహత్యగా నమోదు చేసి ముగించకుండా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవించే హక్కు, భద్రత, మానవ గౌరవానికి సంబంధించిన అంశాలను కూడా పరిశీలించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థుల భద్రత, హాస్టల్ పర్యవేక్షణ, సిసిటివి,అత్యవసర వైద్య స్పందన, ఫిర్యాదుల పరిష్కారం, మానసిక సహాయక వ్యవస్థలపై దృష్టి సారించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థాగత రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల్లో అన్యాయం

### అవార్డుల కేటాయింపును పునఃపరిశీలించాలి
### పండిత్ ఉపాధ్యాయుల జెఎసి రంగారెడ్డి జిల్లా నాయకుల డిమాండ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు2026 ఎంపికలో తెలుగు,హిందీ భాషా ఉపాధ్యాయులకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని పండిత్ జెఎ సి రంగారెడ్డి జిల్లా నాయకులు అనూరాధ,దార్ల రాఘవేంద్రాచారి,గోపాల్ జీ,వెంకటస్వామి, బషీర్,అనిల్ కుమార్ లు శుక్రవారం ఒక సంయుక్త పత్రిక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.అవార్డుల కేటాయింపును పునఃపరిశీలించి,అన్ని సబ్జెక్టులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని వారు విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. ప్రస్తుతం విడుదలైన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో తెలుగు ఉపాధ్యాయులకు 7,హిందీ ఉపాధ్యాయులకు 7 అవార్డులు మాత్రమే కేటాయించినట్లు వారు పేర్కొన్నారు.అదే విధంగా కొన్ని ఇతర సబ్జెక్టులకు 15 నుంచి 20 వరకు అవార్డులు కేటాయించినట్లు జాబితాను బట్టి తెలుస్తోందని తెలిపారు.సబ్జెక్టుల వారీగా అవార్డుల కేటాయింపులో ఇంతటి వ్యత్యాసం ఎందుకు ఏర్పడిందని వారు ప్రశ్నిస్తున్నారు. తెలుగు రాష్ట్ర భాషగా,హిందీ జాతీయ స్థాయిలో ప్రాధాన్యత కలిగిన భాషగా ఉన్నాయని ఉపాధ్యాయులు గుర్తుచేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులకు తెలుగు, హిందీ బోధిస్తూ వారి భాషా నైపుణ్యాలు, పఠనరచనా సామర్థ్యాలు, సృజనాత్మకతను పెంపొందించడంలో భాషా ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో బోధనా ప్రతిభ, విద్యార్థుల అభ్యసన ఫలితాలు,వినూత్న బోధనా పద్ధతులు,విద్యార్థుల సృజనాత్మక అభివృద్ధి, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి వంటి అంశాలనే ప్రధాన ప్రమాణాలుగా పరిగణించాలని వారు కోరారు.సబ్జెక్టు ఆధారంగా అవార్డుల అవకాశాలు తగ్గడం వల్ల భాషా ఉపాధ్యాయుల్లో నిరుత్సాహం కలగకూడదన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ అంశాన్ని పునఃపరిశీలించి, తెలుగు,హిందీ ఉపాధ్యాయులకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా అవార్డుల సంఖ్యను సమీక్షించాలని రంగారెడ్డి జిల్లా తెలుగు,హిందీ ఉపాధ్యాయ వర్గాలు పక్షాన విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా......"భాషకు గౌరవం భాషా ఉపాధ్యాయులకు సముచిత ప్రాతినిధ్యం" అనే సూత్రంతో అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు న్యాయమైన, పారదర్శకమైన అవకాశాలు కల్పించాలని పండిత్ జెఎ సి రంగారెడ్డి జిల్లా నాయకులు అనూరాధ, దార్ల రాఘవేంద్రాచారి, గోపాల్ జీ, వెంకటస్వామి, బషీర్,అనిల్ కుమార్ తదితరులు తమ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## కృత్రిమ మేధపై నమ్మకాన్ని కలిగించడం కీలకం




### హైసియా అధ్యక్షుడు బిపిన్ పెండ్యాల

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కృత్రిమ మేధపై నమ్మకాన్ని కలిగించడం అత్యంత కీలకమని హైసియా అధ్యక్షుడు, ఫ్లైట్ లెఫ్టినెంట్ బిఫిన్ పెండ్యాల తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలిలోని టి హబ్‌లో కొలాబెర్రీ సీఇఓ రామ్ కాటమరాజు రచించిన ట్రస్ట్ బిఫోర్ ఇంటెలిజెన్స్ పుస్తకావిస్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైసియా అధ్యక్షుడు ఫ్లైట్ లెఫ్టినెంట్ బిఫిన్ పెండ్యాల, కొలాబెర్రీ సీఇఓ రామ్ కాటమరాజు, డాక్టర్ రత్నాకర్, డాక్టర్ రాజేష్, సౌజన్యలు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కొలాబెర్రీ సీఇఓ రామ్ కాటమరాజు మాట్లాడుతూ ఏఐ పట్ల అవగాహన పెంచేందుకే తాను ట్రస్ట్ బిఫోర్ ఇంటెలిజెన్స్ పుస్తకాన్ని రచించానని ఏఐ ఏజెంట్లను ఎలా అభివృద్ధి చేయాలనే దానిపైనే కాకుండా ప్రజలు, వ్యాపార సంస్థలు వాటిని వాస్తవంగా స్వీకరించడానికి అవసరమౌతుందని తెలిపారు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని కార్యాచరణలోకి దిగే విషయంలో మనం కృత్రిమ మేధను ఎంత వరకు నమ్మవచ్చు అనే విషయాలపై అవగాహన పొందాలని, ఏఐ పట్ల అందరికి అవగాహన కోరకు తన పుస్తకాన్ని అవిష్కరించామని తెలిపారు. తదుపరి హైసియా అధ్యక్షుడు బిఫిన్ పెండ్యాల మాట్లాడుతూ మానవ జీవితానికి విశ్వాసం అత్యంత ప్రాథమికమైనదని, కంపెనీలు మనుషుల స్థానంలో ఏఐ ఏజెంట్లను ఎక్కువగా ప్రవేశపెడుతున్న తరుణంలో వినియోగదారులలో నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించే బాధ్యత కంపెనీలపైనే ఉందని తెలిపారు. వినియోగదారులు సాంకేతికతను విశ్వసించి ఉపయోగించకపోతే దానికి విలువ ఉండదని అందుకే ఈ పుస్తకం ఎంతో సమయోచితమైనదని పేరొన్నారు.

## పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులపై దాడులు

### దుకాణాలపై కేసులు నమోదు.. నిషేధిత పదార్థాలు స్వాధీనం




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** పాఠశాలల సమీపంలో నిషేధిత గుట్కా, పాన్‌మసాలా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై శంకర్‌పల్లి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శంకర్‌పల్లి పట్టణంలోని చేవెళ్ల రోడ్డులో గల తెలంగాణ మోడల్ స్కూల్, శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ బాలికల పాఠశాల పరిసరాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి.రూద్వీర్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్.మంజుల, వసిప్, పెట్రోలింగ్ సిబ్బంది సహకారంతో పాఠశాలలకు 100మీటర్ల పరిధిలో ఉన్న కిరాణా, టిఫిన్, టీ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిషేధిత గుట్కా, సిగరెట్లు, పాన్‌మసాలా, పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నేరమని తెలిసినప్పటికీ నిబంధనలను ఉల్లంఘిస్తూ విక్రయాలు సాగిస్తున్న ఐదుగురు దుకాణ యజమానులపై కేసులు నమోదు చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు...** పాఠశాలల పరిసరాల్లో నిషేధిత గుట్కా, పాన్‌మసాలా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌ఓ జి.రూద్వీర్ కుమార్ హెచ్చరించారు. పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో ఇలాంటి ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలు ఎక్కడైనా ఉంటే ప్రజలు నిర్భయంగా శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.పిల్లలు, విద్యార్థులను పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావాల నుంచి కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పదేళ్ళు పాపాలు చేసి ఇప్పుడు ఆందోళనలా?

### బిఆర్ఎస్ నేతల తీరుపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పదేళ్లు ఇష్టం ఇచ్చినట్లు ఎక్కడికక్కడ దోచుకోవడంతోపాటు పాపాలు చేసి నేడు సిగ్గులేకుండా ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నిజమైన 420గాళ్ళు బిఆర్ఎస్ నాయకులేనని, ఏ మొహం పెట్టుకొని ఆందోళనలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించేందుకు అని అనుమతులు వస్తాయని, భూ సేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ రిజర్వాయర్‌ను పూర్తి చేసి పరిగి, చేవెళ్ళ, షాద్‌నగర్ ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అంధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ విషయంలో ఎవరు మోసం చేశారో ఈప్రాంత ప్రజలకు తెలుసని వివరించారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ప్రశ్నించండి అని అన్నారు. రైతులకు తుపాకులు గురి పెట్టి జైళ్లకు పంపించింది ఎవరో ప్రజలందరికి తెలుసని, ఎన్ని కుప్పిగంతులు వేసినా..ఎన్ని మాటలు మాట్లాడినా బిఆర్ఎస్‌కు కాంగ్రెస్ సమాదానం చెప్పేందుకు ఎల్లప్పుడు సిద్దంగా ఉంటుందని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్దంగా అమలు చేస్తుంటే ఒర్వలేకనే ఆసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీధర్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, నేతలు కృష్ణారెడ్డి, సుదర్శన్ గౌడ్, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, కౌన్సిలర్ మురళిమోహన్, మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, మైనార్టీ నేత ఎండి ఇబ్రహీం, యాదగిరి యాదవ్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

### బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకిచ్చిన హామీలు విస్మరించిందని బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాటలో భాగంగా శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో మహిళ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేయటంలో ఘోరంగా విఫలం చెందిందన్నారు. రాష్ట్రంలో ఆడపడుచులకు ఇస్తామన్నా తులం బంగారం, విద్యను అభ్యశించే నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు స్కూటిలు పంపిణీ చేస్తామని బూటకపు హామీలు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 మోసాలను ప్రజలకు వివరించేందుకు పోరుబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో బిఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎస్.వి. రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, సిహెచ్.బుగ్గరాములు, జేర్కోని రాజు, నిట్టు జగదీశ్, చీరాల రమేష్ పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి :** కాంగ్రెస్ పాలనలో దాచుకోవడం, దోచుకోవడం తప్పా ప్రజలకు ఏమి మేలు జరగలేదని శేరిలింగంపల్లి బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై ఉమ్మడి మాదాపూర్ డివిజన్ లో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు, కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు, రాయల్ కార్తిక్, రాహుల్ చౌదరి పాల్గొన్నారు.





**శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి చౌరస్తా వద్ద మహిళలతో కలిసి శంకర్‌పల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్‌రెడ్డి, బద్దం శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విఫల పాలనపై పెద్ద ఎత్తున ధర్నా చేశారు. అనంతరం ఇంద్రారెడ్డి ప్రధాన చౌరస్తా వద్ద వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. మాణిక్‌రెడ్డి, సర్పంచ్‌లు రాఘవేందర్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మధోల్ల మల్లికార్జున్, ఎరుకల శేఖర్, కౌన్సిలర్‌లు విజయ్ కుమార్, మహేందర్‌రెడ్డి, ప్రశాంత్, నాయకులు శ్రీనాథ్, వాసుదేవ్ కన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
05-09-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD

## నిబంధనలు పాటించండి




**ప్రజాపక్షం/సనత్‌నగర్:** నిబంధనలు పాటిస్తూ ... జాగ్రత్తలు తీసుకుంటూ వినాయక ఉత్సవాలు నిర్వహించాలని పోలీసులు వినాయక ఉత్సవ నిర్వాహకులను కోరారు. ఈ మేరకు ఎస్‌ఆర్‌నగర్ ఎసిపి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వాహకులతో ఎర్రగడ్డ నూర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిసికెమెరాల ఏర్పాటు, పటిష్టమైన సెంట్రింగ్ ప్లాట్ ఫామ్, అగ్ని ప్రమాద నివారణ చర్యలతో పాటు పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఆర్‌నగర్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి, సనత్‌నగర్ సిఐ అశోక్, ఎస్‌ఐలు అనూష, చిరంజీవి, వెంకటేశం, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## గెలుపు కోసం కృషి చేయాలి

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని విజయపథంలో పయనించేలా చేయాలని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు బంగారు శృతి కోరారు. ఈ మేరకు రాజీవ్‌నగర్ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాగి సత్యనారాయణను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు.

## ట్రస్ట్ బి ఫోర్ ఇంటెలిజెన్స్ పుస్తకావిష్కరణ




**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** కృత్రిమ మేధపై నమ్మకాన్ని కలిగించడం అత్యంత కీలకమని హైసియా అధ్యక్షుడు ఫ్లయిట్ లెఫ్టినెంట్ బిపిన్ పెండ్యాల తెలిపారు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని కార్యాచరణలోకి దిగే విషయంలో మనం కృత్రిమ మేధను ఎంత వరకు నమ్మవచ్చు అనే విషయాలను చర్చిస్తూ కొలాబెర్రీ సీఈఓ రామ్ కాటమరాజు రచించిన 'ట్రస్ట్ బిఫోర్ ఇంటెలిజెన్స్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని కొలాబెర్రీ, కైరల్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా రచయిత, కొలాబెర్రీ సీఈఓ రామ్ కాటమరాజు మాట్లాడుతూ, కృత్రిమ మేధ విషయంలో విశ్వసనీయత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కొలాబెర్రీ ఎండీ, కైరల్ సహ వ్యవస్థాపకులు రామమోహన్ పాల్గొన్నారు.

## మానవతా విలువలు పాటించాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ధర్మం, సత్యం ఆచరిస్తూ... మానవతా విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు



**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నిరసిస్తూ మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం హేమావతినగర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో జయంత్, రొంపి బాలకృష్ణ, రాజు, మోహన్, నరసింహ, సురేందర్, ఇందిర, సునీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణస్వామి ముదిరాజ్‌కు నివాళి



**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వారసిగూడ శివాజీ చౌక్ వద్ద కృష్ణ స్వామి ముదిరాజ్ 133వ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథులు విధానసభ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మేకల సారంగపాణి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్ ముదిరాజ్, యాదగిరి, సతీష్ రాజు, సందీప్, గణేష్ ముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి, సురేష్ ముదిరాజ్, కరాటే రాజు, నగేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## విజృంభిస్తున్న దోమలు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** వాతావరణ మార్పులతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణలో బల్దియా ఎంటమాలజీ విభాగం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో మలేరియా, డెంగ్యూ వ్యాపిస్తున్నాయి. ఈ క్రమంలోనే బంజారాహిల్స్ డివిజన్ పరిధిలో దోమకాటుతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1, లేక్ కుండ్ల చెరువు (లఖ్ గుండ్ల చెరువు) పరిసర ప్రాంతాలతో పాటు విఐపిలు నివసించే మినిస్టర్స్ క్వార్టర్స్, ప్రేమ్‌నగర్, గౌరీ శంకర్‌నగర్, శ్రీరామ్ నగర్, దేవరకొండ బస్తీలలో దోమల సమస్య నరకాన్ని చూపిస్తోందని స్థానిక సామాజిక కార్యకర్త గోకుల కల్యాణ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలలోని ప్రతి ఇంటా ఎవరో ఒకరు జ్వరాల బారిన పడుతున్నారని, ముఖ్యంగా టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఖైరతాబాద్ జెడ్‌సి స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# కృష్ణస్వామి జీవితం ఆదర్శం

**మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి**



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** హైదరాబాద్ నగర తొలి మేయర్, విద్యావేత్త, జర్నలిస్ట్, రచయిత కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి సందర్భంగా జూబ్లీబస్టేషన్ దగ్గర ఉన్న కృష్ణస్వామి విగ్రహానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కృష్ణస్వామి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముదిరాజులు ఐక్యతతో హక్కుల సాధన కోసం పోరాటం చేయాలన్నారు. బలహీన వర్గాలు ఒకే మీదకు రావాలని, కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూబిసి వర్గాలకు కొర్వి కృష్ణస్వామి ఆదర్శమని కొనియాడారు. వర్ధంతులను నిర్వహించాలని కోరిన ఆరు రోజుల్లోనే ప్రభుత్వం జీఓలు జారీ చేసిందని గుర్తుచేశారు. బీసీలు ఒకే వేదికపై రాకుండా హక్కులను సాధించుకోవడం సాధ్యం కాదన్నారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుతామని, బిసిల సంక్షేమం కోసం పాటుపడుతున్న రేవంత్ ప్రభుత్వా నికి యువత అండగా నిలవాలని కోరారు. హక్కుల సాధన కోసం ఆచరణ, ఆలోచన చేయాలని, కృష్ణస్వామి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కా ర్యక్రమంలో ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

## బ్లేడ్ మింగిన బాలుడికి
# ఉస్మానియా వైద్యులు పునర్జన్మ



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** మానసిక సమస్యలతో బాధపడుతూ రేజర్ బ్లేడ్ ముక్కలు మింగిన బాలుడికి ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. శరీర లోపలి భాగాలకు ఎలాంటి హాని కలగకుండా, అత్యంత చాకచక్యంగా ఎండోస్కోపీ ద్వారా ఆ బ్లేడ్లను వెలికితీసి బాలుడి ప్రాణాలను కాపాడారు. బాలుడు ప్రమాదవశాత్తు రేజర్ బ్లేడ్ ముక్కలను మింగాడు. బాలుడిని పరీక్షించిన జనరల్ సర్జరీ విభాగం వైద్యులు, కడుపులో పదునైన రేజర్ బ్లేడ్ ముక్కలు ఉన్నట్లు గుర్తించి వెంటనే మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగానికి రిఫర్ చేశారు. కడుపులో పదునైన బ్లేడ్ ముక్కలు ఉండటం వల్ల లోపల ఎక్కడైనా తెగి గాయాలు కావడం లేదంటే చిల్లులు పడే తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. దీంతో రంగంలోకి దిగిన మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్వోడీ ప్రొఫెసర్ డాక్టర్ బి.రమేష్ కుమార్ ఎండోస్కోపీ పద్ధతిలో అత్యంత నైపుణ్యంతో ఒక్కో బ్లేడ్ ముక్కనూ సురక్షితంగా బయటకు తీశారు. చికిత్స విజయవంతం కావడంతో ప్రస్తుతం బాలుడు పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నాడు. క్లిష్టమైన ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించిన మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్వోడీ డాక్టర్ బి.రమేష్ కుమార్ బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ ప్రత్యేకంగా అభినందించారు. ఆపరేషన్లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.సాహిత్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. ఆశిక, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సయ్యద్ నదీమ్, పీజీ డాక్టర్ షేక్ మహమ్మద్ ఖాసింతో పాటు ఇతర పీజీ వైద్యులు, అనస్థీషియా బృందం, నర్సింగ్ సిబ్బంది భారతి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్/బంజారాహిల్స్:** వినాయక ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు బంజారాహిల్స్ ఏసీపీ ఆధ్వర్యంలో గణేశ్ విగ్రహాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు, సెక్టార్ ఎస్‌ఐలు పాల్గొన్నారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి పోలీసు అధికారులు నిర్వాహకులకు సూచనలు చేశారు. నిర్వహించేందుకు పోలీసు శాఖతో నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.

# బిసిల భూముల జోలికొస్తే పోరాడుతాం

- *అధికారాన్ని అడ్డంపెట్టుకొని దౌర్జన్యాలు: బిసి సంఘాల నేతలు*



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** బిసిల భూములపై అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు ఆపకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాడుతామని బిసి సంఘాల నేతలు హెచ్చరించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని బిసిలను భయభ్రాంతులకు గురి చేస్తూ వారి భూములను ఆక్రమణకు యత్నించే వారిపైకఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్, ఉపాధ్యక్షులు రావుల కోల నరేశ్ మీడియాతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, అజీజ్‌నగర్ గ్రామం, సర్వే నం.22, 22/ఆ, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ పరిసర ప్రాంతంలో ఉన్న దామ అరుణ్ కుమార్‌కు చెందిన భూమి విషయంలో జరుగుతున్న పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా దామ అరుణ్ కుమార్ చెందిన భూమిలోని ప్రహరీ గోడ ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉందనే కారణంతో కూల్చివేయడాన్ని ఖండించారు. వాస్తవానికి ఆ ప్రహరీ ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉంటే ఆ రికార్డును ప్రజల ముందుంచాలి, చట్టబద్ధమైన ప్రక్రియ పాటించకుండా చర్య తీసుకొంటే దానికి బాధ్యులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ అధికార పార్టీ ముఖ్య నేత సోదరుల ప్రోద్భలంతో ప్రహరీగోడ కూల్చివేశారని ఆరోపించారు. బిసిల భూములపై రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు చేస్తున్న వారిపై రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల పంపిణీ చేపడుతామన్నారు. ఈ విషయమై మున్సిపల్ కార్యాలయాలను, సమావేశంలో బిసి జెఎసి నేతలు కాటేపల్లి వీరస్వామి, జాజుల లింగం గౌడ్, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, విజయ్ గౌడ్, మహిళా సంఘం కార్యదర్శి తారకశ్వరి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బసవరాజు శ్రీనివాస్‌ను బర్తరఫ్ చేయాలి

- పవన్ కుమార్ శర్మ ఆత్మహత్యా యత్నం
- గన్‌పార్కు వద్ద అడుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** తనను కించపరిచేవిధంగా మాట్లాడిన తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బ్రహ్మణ ఉద్యమకారుల జెఎసి చైర్మన్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ ఆత్మహత్యకు యత్నించారు. శుక్రవారం హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమర వీరుల స్థూపం వద్ద పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టె తీసుకొచ్చి ఆత్మహత్యకు యత్నించగా, పోలీసులు అప్రమత్తమై అడ్డుకొన్నారు. బసవరాజు శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలతో మనస్తాపం చెందిన పవన్ గన్‌పార్క్ వద్ద ఆత్మహత్య చేసుకొంటానని సోషల్ మీడియాలో పోస్టు పెట్టగానే బ్రాహ్మణ సంఘాల నేతలు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున గన్‌పార్కుకు చేరుకొన్నారు. ఎంఎల్‌సి వాణిదేవి, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి, నైషధం సత్యనారాయణ మూర్తి గన్‌పార్కు వద్దకు చేరి, ఆత్మహత్య ఒకటే పరిష్కారం కాదని, బతికుంటే అనుకొన్నది సాధించుకోవచ్చని పవన్‌కుమార్‌కు ధైర్యం చెప్పారు. బసవరాజు శ్రీనివాస్ ఓ సమావేశంలో దళితులను, పేద బ్రాహ్మణులను కించపరిచేలా మాట్లాడటం సరి కాదన్నారు. ఈ విషయమై మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని పవన్‌కు భరోసా నిచ్చారు. సిఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని బసవరాజు శ్రీనివాస్‌ను బర్తరఫ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బ్రహ్మణ సంఘాల నేతలు గంప రామారావు, డాక్టర్ వంశ తిలక్, జ్యోతి కులకర్ణి, మురుకుంట్ల రాజేశ్వర్ శర్మ, గూడ రాజేశ్వరరావు, రమణ, రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కొండా సురేఖ బర్తరఫ్ సరికాదు

రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, ఎర్ర సత్యనారాయణ



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** రాజకీయంగా తనకంటూ ప్రత్యేకతను సంతరించుకొని ఎదుగుతున్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం సరికాదని బిసి మేధావుల ఫోరం చైర్మన్, మాజీ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ పేర్కొన్నారు. ముందు నుంచి కాంగ్రెస్ పార్టీ బిసిలను రాజకీయంగా అణగదొక్కుతూ వచ్చిందని ఆరోపించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి బిసి నేతలను కాంగ్రెస్‌లో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బిసి నేతలపై వివక్ష చూపడం కాంగ్రెస్ పార్టీ నైజంగా భావిస్తున్నామన్నారు. గతంలో తీన్మార్ మల్లన్న, పొన్నాల లక్ష్మయ్య వంటి నేతలపై కాంగ్రెస్ చర్యలు తీసుకొన్నదన్నారు. గతంలో బిఆర్ఎస్ హయంలో ఈటల రాజేందర్ విషయంలోనూ ఇదే తరహా పరిస్థితి ఏర్పడిందన్నారు. రెడ్డి, రావుల దౌర్జన్యాలు, దుర్మార్గాలకు బిసిల రాజ్యాధికార పార్టీ స్థాపనే పరిష్కారమన్నారు. ఈ నెల 29న బిసి బహుజన ఉద్యమకారుల సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, నేతలు విజిఆర్ నారగోని, కటకం నర్సింహ, పురుషోత్తం రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రభుత్వానికి 104 ఉద్యోగుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/అబిడ్స్:** గడచిన 18 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో నిస్వార్థంగా సేవలందిస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని 104 ఉద్యోగులు కోరారు. ఈ మేరకు 104 ప్రతినిధులు ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎంఈ పరిధిలో ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లుగా సేవలందిస్తున్న వారిని నిబంధనల ప్రకారం జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేసినప్పటికీ, నేటికీ ఔట్‌సోర్సింగ్ విధానంలోనే కొనసాగిస్తూ వేతనాలు అందించడం బాధాకరమని వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఈ సమస్యను రాబోయే శాసనమండలి సమావేశాల్లో ప్రముఖంగా ప్రస్తావిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని సిఎం, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి నేరుగా తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సంఘం నాయకులు కిరణ్ కుమార్, నుస్రత్ మొయినుద్దీన్, కల్పన, శివరాజ్, వినోద, సంతోష్, ఎంఏ హాది తదితరులు ఉన్నారు.

# గోశాలలపై చర్యలు చేపట్టాలి




17న విజయవాడ హైవేపై సడక్ బంద్

యుగ తులసి ఫౌండేషన్ స్పష్టం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రాష్ట్రంలో గోరక్షణ, గోశాలల నిర్వహణపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర చర్యలు చేపట్టాలని యుగ తులసి ఫౌండేషన్ డిమాండ్ చేసింది. గో రక్షణ చట్టం అమలులో తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా నవంబర్ 17 నుంచి 48 గంటల పాటు విజయవాడ హైవే పోచంపల్లి జాతీయ రహదారి కొత్తగూడెం చౌరస్తా వద్ద 1000 గోవులతో, వేలాది వాహనాలతో గో సడక్ బంద్ పేరుతో పూర్తిస్థాయి నిర్బంధం చేస్తున్నట్టు తెలిపింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో యుగ తులసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణ స్వామి, చంద్రస్వామి, సంగమేశ్వర్ చారి, మాలాద్రి, సంజయ్ గుప్తా తదితరులు మాట్లాడారు.1000 రోజుల పాలన వేడుకలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాంతిభద్రతల పరిరక్షణ, రాజ్యాంగ చట్టాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న గోశాలలకు సరైన నిర్వహణ లేకపోవడంతో గోవుల పరిస్థితి దయనీయంగా మారుతోందని అన్నారు.హైకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గో అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జన్మాష్టమి వేడుకలు ఉదయం 4:30 గంటలకు షోడశోపచార సేవతో ప్రారంభమయ్యాయి. శ్రీకృష్ణ భగవానుడు భక్తులకు రాధాగోవింద, గోదాకృష్ణ, లడ్డు గోపాల్, మాఖన్ కృష్ణ వంటి వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. లడ్డుగోపాల్, మాఖన్ కృష్ణుడికి ఉయ్యాల సేవ చేసే భాగ్యం ప్రతి ఒక్కరికి కల్పించారు. క్యూర్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు భగవంతుని ఆశీస్సులు పొందారు.

## వైభవంగా హోమాలు



**ప్రజాపక్షం/ వెంగళరావునగర్:** జిటిఎస్ కాలనీలోని వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానంలో భవానీ శంకర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు రాజశ్యామల హోమం, వా రాహి హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రీతికరంగా దేవాలయ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ మహాపూర్ణాహు తి సమర్పించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## సైక్లింగ్‌లో 11 పతకాలు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఫ్రాన్స్‌లో జరిగిన ఛాలెంజ్ బ్రెటన్ ఇంటర్నేషనల్ 2026 అంతర్జాతీయ పారాసైక్లింగ్ పోటీల్లో అదిత్య మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న భారత పారాసైక్లిస్టులు అద్భుత ప్రతిభ కనబరిచారు. నాలుగు రేసుల్లో మొత్తం 11 పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో భారత సత్తాను చాటారు. విశ్వవసాని, అన్షుమన్ ధుమాల్, లిషా దాస్, అర్షద్ షేక్, ప్రశాంత్ పతకాలు సాధించినట్లు అదిత్య మెహతా ఫౌండేషన్ శిక్షకుడు అదిత్య మెహతా తెలిపారు.

## బిఆర్ఎస్ వంటావార్పు



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను నిరసిస్తూ బిఆర్ఎస్ పిలుపుమేరకు వివిధ దశల్లో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా అంబర్‌పేట్ శ్రీరమణ చౌరస్తాలో శుక్రవారం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వంటావార్పు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## 'సర్' ప్రక్రియ అన్యాయం
# 13 కోట్ల పేర్లు తొలగించడమేమిటి?

**మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాస**



**న్యూఢిల్లీ:** ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది లక్షలాది మంది ప్రజలపై రుద్దబడుతున్న ఒక అన్యాయమైన ప్రక్రియ అని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాస అభివర్ణించారు. న్యాయ వ్యవస్థ ఈ ప్రక్రియను ఆమోదించిందని, ప్రభుత్వం దీనిని చట్టబద్ధమైనదిగా పేర్కొందని, అయితే ఇది న్యాయమైనదేనా అన్నదే ప్రశ్న అని ఆయన అన్నారు. 'నిస్సందేహంగా ఇది చట్టబద్ధమైనదే. కానీ ఇది న్యాయమైనదేనా అన్నదే ప్రశ్న. ఎందుకంటే న్యాయం అంటే అదే' అని గురువారం ఇక్కడ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నిర్వహించిన జగదీప్ సింగ్ చోకర్ స్మారక ఉపన్యాసంలో లవాస అన్నారు. చట్టబద్ధమైన సంస్థలు, రాజ్యాంగ సంస్థలు, ప్రభుత్వాలు తాము చేసేది ఏదైనా చట్టబద్ధంగా అనుమతించబడినందున అది సరైనదే అనే సూత్రంపై పని చేస్తున్నట్లుగా కనిపిస్తోందని లవాస అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను లక్షలాది మంది పౌరులపై బలవంతంగా రుద్దిన అన్యాయమైన విధానంగా ఆయన అభివర్ణించారు. అలాగే బలమే హక్కు' అనేది కాలం చెల్లిన భావన అని అన్నారు. చట్టబద్ధమైన బాధ్యతలను అప్పగించిన సంస్థలు దాని స్ఫూర్తిని కూడా నిలబెట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. న్యాయం అంటే కేవలం చట్టంలోని అక్షరాలను అమలు చేయడమే కాదని, దాని స్ఫూర్తిని కూడా కాపాడటమేనని తెలిపారు. ఎస్ఐఆర్ కింద జరుగుతున్నదంతా చట్టబద్ధమేనని అధికారులు వాదించవచ్చని, కానీ అది 'కచ్చితంగా అన్యాయమైనది' అని లవాస అన్నారు. ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించడం వెనుక ఉన్న హేతుబద్ధతను ఆయన ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వల్ల ఓటర్లు ప్రజాస్వామ్య ప్రక్రియకు దూరం కాకుండా చూసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారా అని నిలదీశారు. ఈ సవరణ ప్రక్రియపై పెరుగుతున్న ఆందోళనను ప్రస్తావిస్తూ, ఇప్పటికే 33 శాతం మంది ఓటు వేయడం లేదని, ఇటువంటి భారీ స్థాయి మార్పులు పౌరులకు ప్రజాస్వామ్య ప్రక్రియపై మరింత విముఖత కలిగించే అవకాశం ఉందని లవాస పేర్కొన్నారు.

# అస్తిత్వం కోసం గిరిజన విద్యార్థుల పోరాటం: రాహుల్ గాంధీ



**ముంబై:** మహారాష్ట్రలోని గిరిజన విద్యార్థులు కేవలం విద్య, ఉపాధి, ప్రాథమిక సౌకర్యాల కోసమే కాకుండా తమ గుర్తింపు, అస్తిత్వం కోసం కూడా పోరాడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. హక్కుల పోరాటంలో కాంగ్రెస్ వారికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. 'ఆర్ఎస్ఎస్ బీజేపీ ఆదివాసీలను వనవాసులుగా మార్చాలని చూస్తున్నాయి. మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన ఈ గిరిజన విద్యార్థుల పోరాటం కేవలం విద్య, ఉపాధి, హాస్టళ్లు, ఆహారం కోసం మాత్రమే కాదు, అది వారి అస్తిత్వం, ఆదివాసీ గుర్తింపు కోసం కూడా' అని రాహుల్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'మహారాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడి, తమ హక్కుల కోసం గళం విప్పి, విజయం సాధించిన ఈ ధైర్యవంతులైన విద్యార్థులను కలవడం ఆనందంగా ఉంది. విద్యార్థుల హక్కుల కోసం చేసే ప్రతి పోరాటంలో మేము, కాంగ్రెస్, నేను వారికి అండగా ఉంటామని వారికి వాగ్దానం చేశాం' అని తెలిపారు. ఒక రోజు ముందు, మహారాష్ట్రలోని నాసిక్‌లో తమ డిమాండ్ల కోసం నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులతో సహా గిరిజన విద్యార్థుల ప్రతినిధి బందాన్ని గాంధీ కలిశారు. ప్రభుత్వ గిరిజన హాస్టల్ నిబంధనలలో మార్పులకు వ్యతిరేకంగా పూణే, నాగ్‌పూర్, నాసిక్‌కు చెందిన విద్యార్థులు ఆగస్టు 13న ఆందోళన ప్రారంభించారు. వారి డిమాండ్లు ఆ తర్వాత హాస్టల్ సౌకర్యాలు, భద్రత, గిరిజన రిజర్వేషన్లు, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం (పెసా) కింద నియామకాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, గడ్చిరోలిలోని ఒక ఆశ్రమ పాఠశాలలో పాముకాటుతో మరణించిన ముగ్గురు గిరిజన బాలికల కుటుంబాలకు పరిహారం వంటి అంశాలను చేర్చడానికి విస్తరించాయి. గిరిజన హాస్టళ్లలో ఉంటూ, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ. 10 కోట్ల బీమా కవరేజీని కూడా నిరసనకారులు కోరారు. 12,500 గిరిజన పోస్టులతో పాటు ఇతర ఖాళీగా ఉన్న గిరిజన స్థానాల కోసం పెండింగ్‌లో ఉన్న నియామక ప్రక్రియను తక్షణమే అమలు చేయడం వారి ప్రధాన డిమాండ్లలో ఒకటి. రాష్ట్ర వ్యాప్తంగా విధుల నుంచి తొలగించబడిన పెసా ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, శాశ్వత నియామకం కల్పించాలని కూడా వారు డిమాండ్ చేశారు. పూణేలోని మంజరి గిరిజన హాస్టల్‌లో గిరిజన విద్యార్థులు చేపట్టిన 17 రోజుల నిరవధిక నిరాహార దీక్ష, గిరిజన అభివద్ధి శాఖ మంత్రి అశోక్ ఉయికే నిరసనకారులను కలిసి వారి డిమాండ్లపై లిఖితపూర్వక హామీలు ఇవ్వడంతో ఆగస్టు 30న ముగిసింది.


## సైబర్ ముఠాలపై సిబిఐ ఉక్కుపాదం

**20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు**

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ నేరాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ చక్ర×' లో భాగంగా 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో సీబీఐ ఏకకాలంలో విస్తత తనిఖీలు చేపట్టింది. బాధితుల నుంచి కొల్లగొట్టిన సొమ్మును స్వీకరించడం, దారి మళ్లించడం, పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు నిందితులను సీబీఐ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసు, ప్రభుత్వ అధికారులమని చెప్పి నకిలీ గుర్తింపు కార్డులు చూపి ప్రజలను డిజిటల్ అరెస్టులు చేస్తూ ఈ సైబర్ ముఠాలు అనేక అరాచకాలకు పాల్పడుతున్నాయి. బాధితుల్ని భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి రూ.కోట్లలో కొల్లగొడుతున్నాయి. ఈ ముఠాలపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ తాజా తనిఖీలు చేపట్టింది. కాగా, వివిధ రాష్ట్రాల నుంచి సీబీఐ స్వీకరించిన వడు కీలక డిజిటల్ అరెస్ట్ కేసుల్లో బాధితులను నెలల తరబడి డిజిటల్‌గా బంధించి, మొత్తం రూ. 42.36 కోట్లు దండుకున్నారు. బిట్స్ పిలానీలో బాధితుడిని వడు నెలల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి, రూ. 7.67 కోట్లు కాజేశారు. గుజరాత్‌లో పోలీసుల పేరిట నమ్మించి, ఒక వ్యక్తిని వడు నెలలు డిజిటల్‌గా బంధించి ఏకంగా రూ. 19.24 కోట్లు వసూలు చేశారు. కర్నాటకలో బాధితుడిని నెల రోజుల పాటు భయాందోళనకు గురిచేసి రూ. 15.45 కోట్లు దోచుకున్నారు. ఫైనాన్షియల్, సాంకేతిక సమాచారాన్ని, బ్యాంకు ఖాతాల డేటాను విశ్లేషించిన తర్వాత సీబీఐ 89 ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో బ్యాంకు రికార్డులు, డిజిటల్ డివైజ్‌లు, కీలక ఆధారాలను స్వాధీనం చేసుకుంది. ఈ నగదు ఎక్కడెక్కడికి మళ్లిందో తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ డిజిటల్ అరెస్ట్ వ్యవహారాలకు సంబంధించి హ్యాండ్లింగ్, మనీ లాండరింగ్‌లో పాల్గొన్న ముగ్గురిని సీబీఐ అరెస్ట్ చేసింది. హర్యానాకు చెందిన ఆకాష్ ఖాతాలోకి రూ. 1.95 కోట్లు రాగా, అదే రోజు ఆ డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించాడు. కోల్‌కతాకు చెందిన రాజా కర్మాకర్ కంపెనీ ఖాతాలోకి రూ. 1.5 కోట్ల మోసం సొమ్ము జమైంది. జ్యోతి రాణి ... తన ఖాతాలోకి వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని నగదు రూపంలో విత్‌డ్రా చేసి, మిగిలిన మొత్తాన్ని ఇతర ఖాతాలకు పంపిణీ చేసింది.

# 2027 ఫిబ్రవరి వరకూ ఎల్‌నినో

- వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం
- భారత్‌కు పొంచి ఉన్న ముప్పు: డబ్ల్యుఎంఒ హెచ్చరిక




**న్యూఢిల్లీ :** ప్రపంచ వ్యాప్తంగా చూస్తున్న వాతావరణ మార్పులు రానున్న రోజుల్లో మరింత దారుణంగా మారబోతున్నాయా? మన దేశంలో వర్షాలు తగ్గి, ఎండ తీవ్రత ఊహించని స్థాయిలో పెరగబోతోందా? అవుననే అంటోంది ప్రపంచ వాతావరణ సంస్థ. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్ నినో' పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చి, ఫిబ్రవరి 2027 వరకు కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూఎంఒ హెచ్చరించింది. దీనివల్ల వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం పడవచ్చునని పేర్కొంది. అలాగే వరదలు, కరవు, తీవ్రమైన వేడి వంటి ప్రమాదాలు కూడా తలెత్తవచ్చని ఆ సంస్థ వెల్లడించింది. ఈ దీర్ఘకాలిక ఎల్ నినో ప్రభావం భారత్ వాతావరణంపై, ముఖ్యంగా వర్షపాతం, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీయనుంది. గురువారం డబ్ల్యూఎంఒ సెక్రటరీ జనరల్ సెలెస్టే సౌలో ఎల్‌నినో పై కీలక విషయాలు వెల్లడించారు. 'స్పానిష్ భాషలో 'ఎల్ నినో' అంటే చిన్నపిల్లవాడు అని అర్థం. కానీ ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు, మానవ సమాజాలకు మిగిల్చేది మాత్రం కోలుకోలేని దెబ్బ. పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే ఈ ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కరువులు, వరదలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు కారణమవుతోంది. ఎల్ నినో తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత పెరుగుతాయని మేము అంచనా వేస్తున్నాం' అని ఆమె హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) సెప్టెంబర్ నెల అంచనాలో, ఎల్ నినో పరిస్థితులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని పేర్కొన్న కొద్ది రోజులకే డబ్ల్యూఎంఒ ఈ అంచనాలను వెలువరించడం గమనార్హం. సాధారణంగా ఎల్ నినో ఏర్పడిన సంవత్సరాల్లో భారతదేశంలో రుతుపవనాలు బలహీనపడటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెల గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా సాధారణం కంటే 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. అంతేకాకుండా 1901 నుంచి ఇప్పటివరకు నమోదు కానంత అత్యధిక ఉష్ణోగ్రతలు ఈ ఆగస్టులోనే నమోదయ్యాయి.ఇక సెప్టెంబర్ నెలలో కూడా సుదీర్ఘకాల సగటు వర్షపాతంలో 91 శాతం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. ఇది రైతాంగానికి, ముఖ్యంగా వర్షాధార పంటలకు తీవ్ర ఆందోళన కలిగించే అంశం. కేవలం వర్షాకాలం మాత్రమే కాదు చలికాలంపై కూడా ఎల్ నినో నీడలు అలుముకున్నాయి. ఇప్పటికే దేశంలో శీతాకాలపు రోజులు తగ్గిపోతున్నాయని ఢిల్లీకి చెందిన 'క్లైమేట్ ట్రెండ్స్' సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. ఉత్తర భారతదేశంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలలో ప్రతి దశాబ్దానికి ఉష్ణోగ్రత 0.69 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతోందని అంచనా. మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా వరుసగా 0.58 డిగ్రీలు, 0.66 డిగ్రీల సెల్సియస్ మేర వేడి పెరుగుతోంది.

### ఆహార భద్రతకు ముప్పు

ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల మన ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపుతోంది. శీతాకాలంలో పండించే ముఖ్యమైన రబీ పంట అయిన గోధుమలపై ఇది ప్రభావం చూపి పంట దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం ముగిసే సమయంలో వచ్చే ఈ వేడిగాలులు రైతులకు కోలుకోలేని దెబ్బగా మారుతున్నాయి. ఎల్ నినో సుదీర్ఘకాలం కొనసాగే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నందున, ఇటు ప్రభుత్వం అటు రైతాంగం ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి నిల్వల నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఉష్ణోగ్రత తట్టుకునే విత్తనాల వినియోగంపై దృష్టి సారించాల్సి ఉంది.

## సిక్కింలో 40 ప్రమాదకర గ్లేసియల్ లేక్స్..

**అత్యధిక రిస్క్‌లో 16 సరస్సులు**

**గ్యాంగ్‌టక్:** తూర్పు హిమాలయ రాష్ట్రమైన సిక్కింలో సుమారు 40 మంచు సరస్సులు ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు తెలిసింది. వీటిల్లో 16 మంచు సరస్సులు అత్యధిక రిస్క్‌లో ఉన్నట్లు ఓ డేటా ద్వారా తెలిసింది. ఆ సరస్సులు ఏ క్షణమైనా పేలే అవకాశాలు ఉండగా, దిగువ ప్రాంతాలకు సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆగస్టు 26వ తేదీన నేపాల్‌లో మంచు కొండ విరిగిపడడంతో.. భారీ జలవిలయం సంభవించిన విషయం తెలిసిందే. నేపాల్ వరదల్లో 1250 మందికిపైగా మృతిచెందగా, మరో 4 వేలకు పైగా గల్లంతయ్యారు. హిమాలయ ప్రాంతాల్లో కొత్త సరస్సులు ఏర్పడుతున్నాయని, ప్రస్తుతం ఉన్న వాటి వైశ్యాలం పెరుగుతోందని ఓ రిపోర్టు ద్వారా తెలిసింది. మంచుకొండలు కరిగిపోవడం వల్ల గ్లేసియల్ సరస్సులు ఏర్పడుతాయని, ఆ సరస్సులో ఉన్న నీరంతా సమీపంలో గుమ్మికూడుతుందని, అయితే ఇలాంటి సరస్సులు ఒక్కసారి పేలినప్పుడు.. భూకంపం లాంటి పరిస్థితి ఏర్పడుతుందని, దీని వల్ల ఆకస్మిక వరదలు సంభవించే అకాశాలు ఉన్నాయని రిపోర్టులోచెప్పారు. 2023 అక్టోబర్‌లో సిక్కింలో సంభవించిన గ్లేసియల్ బస్ట్ వల్ల.. సుమారు 60 మంది మృతిచెందారు. మంగన్, గ్యాంగ్‌టక్, పాక్యాంగ్, నామ్‌చి జిల్లాల్లో విస్తృత స్థాయిలో నష్టం జరిగింది. గ్లేసియల్ లేక్స్‌లో జరుగుతున్న మార్పులను రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా పరిశీలిస్తున్నట్లు ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ తంబే తెలిపారు. 40 ప్రమాదకర సరస్సుల్లో 16 సరస్సులు కేటగిరీ ఏ(హై రిస్క్) లో ఉన్నాయి. కేటగిరీ బీలో 2, కేటగిరీ సీలో 9, మిగితా 13 సరస్సులో మరో కేటగిరీలో ఉన్నాయి.

## లండన్ పర్యటనకు సిఎం విజయ్

**చెన్నై:** తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం విజయ్ తొలిసారిగా విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు బ్రిటన్‌లో జరిగే పారిశ్రామికవేత్తల సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. ఈ అధికారిక పర్యటనలో ఆయన తన భార్య సంగీత, కుమార్తె దివ్యలను కలవనున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు, నటి త్రిష కూడా అదే సమయంలో రప్‌లో షూటింగ్ నిమిత్తం ఉండటంతో వారిద్దరి కలయికపై కూడా చర్చ జరుగుతోంది.

## అఖిలేశ్‌తో సిజెపి నేత రాంకా మంతనాలు

**లక్నో:** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. అధికారం కోసం రాజకీయ పార్టీలు వ్యూహ రచనలో మునిగిపోయాయి. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కాక్రోక్ జనతా పార్టీ(సీజేపీ) జాతీయ సహ కన్వీనర్ ఆశుతోశ్ రాంకా లక్నోలో రహస్యంగా సమావేశం కావడం చర్చనీయాంశమైంది. ఇద్దరు 90 నిమిషాలు మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం రాజకీయంగా ఆసక్తిగా మారింది. తాము ప్రెజర్ గ్రూపుగా ఉంటామని, రాజకీయాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన సీజేపీ... ఇప్పుడు అఖిలేశ్‌తో భేటీ కావడం, అది కూడా పీ ఎన్నికల ముందు జరగడం కీలకంగా మారింది. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఎస్పీ ప్రధాన కార్యాలయం సమీపంలోని జనేశ్వర్ మిశ్రా ట్రస్ట్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఈ భేటీపై అటు ఎస్పీ, ఇటు సీజేపీ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల సీజేపీ ప్రభుత్వ పాఠశాలల్ని బాగు చేయాలని 'ఫిక్స్ ది స్కూల్' కార్యక్రమం చేపట్టింది. అయితే, పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు అనుమతి లేకుండా ప్రవేశించవద్దని పీ, రాజస్థాన్ ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయడంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. నిజానికి సీజేపీ కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే స్కూళ్లలోని సమస్యల్ని ఎత్తిచూపుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఇప్పుడు రాజస్థాన్, మహారాష్ట్ర తర్వాత పీని సీజేపీ లక్ష్యంగా చేసుకుందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పేపర్ లీక్, విద్యా వ్యవస్థ సమస్యల్ని లేవనెత్తాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజస్థాన్‌లో ఒక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల తనిఖీకి వెళ్లిన అశుతోశ్ రాంకా బందంపై గ్రామస్తులు దాడి చేశారు. ఈ దాడికి పాల్పడింది బీజేపీ గుండాలే అని సీజేపీ ఆరోపించింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ పాఠశాలల్లో పర్యటించేందుకు సీజేపీ సిద్ధమవుతుందా? దీనికి అఖిలేశ్ యాదవ్ నుంచి మద్దతు కోరిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీలో వచ్చే ఏడాది మొదట్లో ఎన్నికలు జరగబోతున్న సమయంలో ఆ రాష్ట్రంలో పెద్ద ఉద్యమానికి సీజేపీ సిద్ధమై, రాజకీయ రంగు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుందా అనే అనుమానాలు వెలువడుతున్నాయి. గతంలో నీట్ పేపర్ లీక్‌పై జంతర్ మంతర్ నిరసనల సమయంలో అశుతోశ్ రాంకా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని, సీఎం యోగిని సవాల్ చేస్తూ హెచ్చరించారు. రాష్ట్రంలో పేపర్ లీక్ ఆగకపోతే జంతర్ మంతర్ కన్నా పెద్ద ఉద్యమం చేపడతామని ప్రకటించారు.

## లైసెన్స్‌కు కొత్త విధానం: గడ్కరీ

**న్యూఢిల్లీ:** డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు గ్రేడెడ్ పాయింట్ల విధానం తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దిల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ 66వ వార్షిక సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతిపాదిత విధానంలో ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనకు డ్రైవింగ్ రికార్డులో ప్రతికూల పాయింట్లు నమోదవుతాయి. కేవలం శిక్షలకు పరిమితం కాకుండా బాధ్యతాయుతంగా వాహనం నడిపే వారికి ప్రోత్సాహకాలు అందించేలా ఉండొచ్చని గడ్కరీ తెలిపారు. మంచి డ్రైవింగ్ రికార్డు ఉన్నవారికి బీమా సంస్థల నుంచి ప్రోత్సాహకాలు లేదా ఇతర ప్రయోజనాలు లభించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. డ్రైవర్ ప్రవర్తన దేశంలో రోడ్డు భద్రతకు ప్రధాన సవాలుగా ఉందని గడ్కరీ పేర్కొన్నారు. తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 5,13,563 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. వీటిలో సుమారు 1.83 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అంటే సగటున ప్రతి గంటకు దాదాపు 59 ప్రమాదాలు, 21 మరణాలు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. భారత్ ఎన్‌క్యాప్ 2.0ను 2027 అక్టోబర్ నుంచి అమలు చేయాలని యోచిస్తున్నట్లు గడ్కరీ వెల్లడించారు.

**బైక్ ట్యాక్సీలకు మద్దతు :** ప్రైవేట్ ద్విచక్ర వాహనాలను బైక్ ట్యాక్సీలుగా నడిపేందుకు రాష్ట్రాలు అనుమతించాలని గడ్కరీ కోరారు. రవాణా రంగం రాష్ట్రాల పరిధిలో ఉండటంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సేవలకు అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దాదాపు 8 కోట్ల మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించే సామర్థ్యం ఈ రంగానికి ఉందని అన్నారు. హైవేలు, మైనింగ్ వంటి అధిక ప్రమాద రంగాల్లో పనిచేసే డ్రైవర్లు, కార్మికుల కోసం 'సురక్ష' పైలట్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు.

## సోనియా ఆత్మకథ ప్రచురణకర్త హార్పర్ కాలిన్స్

**నవంబర్ 10న విడుదల**

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'కు ప్రచురణకర్త ఖరారయ్యారు. దీన్ని హార్పర్ కాలిన్స్ ఇండియా ప్రచురించనుంది. 544 పేజీల ఈ ఆత్మకథ నవంబర్ 10న విడుదల కానుంది. వ్యక్తిగత జీవితం, కుటుంబం, రాజకీయాలు, గుర్తింపు, బాధ్యత, భారత్‌తో అనుబంధం తదితర అంశాలను సోనియా గాంధీ ఈ పుస్తకంలో వివరించినట్లు హార్పర్ కాలిన్స్ వెల్లడించింది. ఇటలీలోని బాల్యం నుంచి భారత్‌కు తన ప్రయాణం, 1965లో కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, గాంధీ కుటుంబంలో విషాదాలు, రాజకీయాల్లోకి రావాలన్న ఒత్తిడిని తొలుత ప్రతిఘటించిన సందర్భాలనూ పొందుపర్చారు. ఈ పుస్తకాన్ని తొలుత పెంగ్విన్ ఇండియా ప్రచురించాల్సి ఉండగా కొన్ని అంశాల్లో మార్పుల విషయమై విభేదాలు తలెత్తాయి. ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్, చైనా భారత భూభాగాన్ని ఆక్రమించిన అంశాలలో మార్పులకు సోనియా గాంధీ అంగీకరించలేదు. దీంతో ఈ పుస్తకానికి తాము ప్రచురణకర్త కాదంటూ ఆగస్టు 18న పెంగ్విన్ ఇండియా ప్రకటించింది. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో పుస్తకాన్ని యథాతథంగా ప్రచురిస్తూ, భారత్‌లో మాత్రం మార్పులతో విడుదల చేయడం వల్ల రెండు వేర్వేరు సంచికలు ఏర్పడే పరిస్థితిని సోనియా గాంధీ అంగీకరించలేదని సమాచారం. 'బిలాంగింగ్'లో సోనియా గాంధీ వ్యక్తిగత అనుభవాలతో పాటు స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్ర, రాజకీయ పరిణామాలు, గత ఆరు దశాబ్దాల్లో చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక మార్పులను తన దక్కోణంలో ఆవిష్కరించినట్లు హార్పర్ కాలిన్స్ ప్రకటన వెల్లడించింది. వ్యక్తిగత కథనాన్ని, రాజకీయ చరిత్రను మేళవించిన ఆత్మకథగా ఈ పుస్తకాన్ని అభివర్ణించింది.

## భూస్థిరకక్షలోకి భారత్ తొలి ఇమేజింగ్ ఉపగ్రహం..

- 'ఇస్రో' బృందానికి కాంగ్రెస్ ప్రశంసలు
- మోదీ ప్రభుత్వం దాని స్వరూపాన్ని 'పూర్తిగా మార్చే కుట్ర' చేస్తోందని ధ్వజం



**న్యూఢిల్లీ :** దేశపు మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహాన్ని భూకక్షలోకి విజయవంతంగా ప్రయోగించినందుకు శుక్రవారం కాంగ్రెస్ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రశంసించింది. అలాగే, భారత అంతరిక్ష సంస్థ స్వరూపాన్నే మార్చే'రాడికల్ రోల్ రీకాన్ఫిగరేషన్' చేపడుతోందని మోదీ ప్రభుత్వంపై ఆరోపణాస్త్రాలు సంధించింది. వివిధ వర్గాల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న అంతరిక్ష సంస్థకు ఈ ప్రయోగం నిస్సందేహంగా గొప్ప నైతిక బలాన్ని చేకూరుస్తుందని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శుక్రవారం మరోసారి చరిత్ర సృష్టించింది. జిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా 2,300 కిలోలకు పైగా బరువున్న పేలోడ్‌ను నిర్దేశిత కక్షలోకి ప్రవేశపెట్టడం ద్వారా దేశపు మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహాన్ని జియో ఆర్బిట్ (భూస్థిర కక్ష)లోకి విజయవంతంగా ప్రయోగించింది.ఈ ప్రయోగం అంతరిక్ష సంస్థకు 2026 సంవత్సరంలో తొలి విజయాన్ని అందించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన 'ఎక్స్' పోస్ట్‌లో జిఎస్ఎల్‌వి–ఎఫ్ 17 ఇఓఎస్–5 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా ఇస్రో బృందం మొత్తానికి అభినందనలు తెలిపారు.'జియో సింక్రోనస్' కక్ష నుంచి పనిచేసే మొట్టమొదటి ఇమేజింగ్ ఉపగ్రహం అయిన ఇది మనం ఏళ్లుగా అభివృద్ధి చేస్తున్న భూ పరిశీలనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది. భారత అంతరిక్ష కార్యక్రమాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తున్న మన శాస్త్రవేత్తలు, అంతరిక్ష ఇంజినీర్లు, పరిశోధకుల అంకితభావం, నైపుణ్యం పట్ల మేం ఎంతో గర్వపడుతున్నాం' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ శాస్త్రీయ దృక్పథం, అంతరిక్ష పరిశోధనల పట్ల దృఢమైన నిబద్ధతతో ఉంటూ వచ్చిందని ఖర్గే గుర్తుచేశారు.ఆధునిక భారతదేశ నిర్మాతలు దూరదృష్టితో మన అంతరిక్ష కార్యక్రమానికి పునాదులు వేశారని. ఆ వారసత్వాన్ని మన శాస్త్రవేత్తల తరాలు అద్భుతమైన విజయాలతో మరింత ముందుకు తీసుకెళ్లాయని మల్లికార్జున్ ఖర్గే అభినందించారు. కొంతకాలం నిశ్శబ్దంగా ఉన్న తర్వాత, 2,367 కిలోల బరువున్న అత్యాధునిక భూ చిత్రీకరణ ఉపగ్రహాన్ని కక్షలోకి ప్రవేశపెట్టేందుకు ఇస్రో ఈ రోజు ఉదయం శ్రీ హరికోట నుంచి తన జిఎస్ఎల్‌వి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమ్యునికేషన్స్ ఇన్‌చార్జి జైరామ్ రమేష్ పేర్కొన్నారు.

## ఇస్రో ప్రయోగం సక్సెస్‌పై ఎంఇఎ హర్షం


**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి నిర్వహించిన జీఎస్ఎల్‌వీ ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ భారతదేశపు తొలి జియోసింక్రోనస్ ఇమేజింగ్ శాటిలైట్ అయిన ఈఓఎస్05ను నిర్దేశిత కక్ష్యలోకి అత్యంత కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది. ఈ చరిత్రాత్మక విజయంపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారతదేశానికి గర్వకారణమని అభివర్ణించారు. 'ఇస్రో జీఎస్ఎల్‌వీఎఫ్17 ద్వారా ఈఓఎస్05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం భారత్‌కు ఎంతో గర్వకారణమైన క్షణం. ఇది మన దేశ అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాలను, ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యాన్ని స్పష్టం చేస్తోంది' అని రణధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో పేర్కొన్నారు.

# బిజెపి చేతిలో కీలు బొమ్మలా ఉండొద్దు

**ఢిల్లీ పోలీసులపై కాంగ్రెస్ మండిపాటు**

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో విద్యార్థి కార్యకర్త నిషు ఆజాద్ తండ్రిపై జరిగిన దాడికి సంబంధించి, 'హిందుత్వ ఇన్‌ఫ్లుయెన్సర్'గా చెప్పుకునే స్వతంత్ర భరద్వాజ్‌ను 24 గంటల్లోపు అరెస్టు చేయాలని కాంగ్రెస్ శుక్రవారం డిమాండ్ చేసింది. ఢిల్లీ పోలీసులు అధికార బిజెపికి చేతిలో కీలుబొమ్మలా వ్యవహరించకూడదని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా అన్నారు. శుక్రవారం ఆమె ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆజాద్ కేసుతో పాటు మరికొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటిలో జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలు, జంతర్ మంతర్ నిరసనలో పాల్గొన్న రుచికా సింగ్‌ను ఆన్‌లైన్‌లో లక్ష్యంగా చేసుకోవడం, అలాగే నోయిడాలో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌదరిని జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద అరెస్టు చేయడం వంటివి ఉన్నాయి. తరువాత, చౌదరిని నిర్బంధించే ఉత్తర్వులను అలహాబాద్ హైకోర్టు రద్దు చేసింది. న్యాయం కోసం పోరాడుతున్న ఈ యువతులందరికీ కాంగ్రెస్, ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ అండగా ఉంటారని లాంబా స్పష్టం చేశారు. ఆజాద్ కేసు గురించి ప్రస్తావిస్తూ, భరద్వాజ్ ఒక వీడియోలో హింసకు సంబంధించిన సంఘటనలను వివరించారని, దళితుల పట్ల అసభ్యకరమైన భాషను ఉపయోగించారని, అయినప్పటికీ అతనిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. 'స్వతంత్ర భరద్వాజ్‌ను 24 గంటల్లోపు అరెస్టు చేసి జైలుకు పంపాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని లాంబా అన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో ఆజాద్ ప్రజాస్వామ్యయుతంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారని, ఆ సమయంలోనే ఆమె తండ్రిపై దాడి జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో హత్యాయత్నం వంటి తగిన చట్టపరమైన సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

## స్తంభాన్ని ఢీకొట్టిన ఇండిగో విమానం



**శ్రీనగర్:** విమానాశ్రయంలో పార్కింగ్ చేస్తుండగా ఇండిగో విమానం ఓ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఇండిగోకు చెందిన 6ఈ 225 విమానం శుక్రవారం నవీ ముంబై నుంచి శ్రీనగర్ చేరుకుంది. ఉదయం 9 గంటలకు శ్రీనగర్ విమానాశ్రయంలో దిగింది. అయితే విమానాశ్రయంలోని 6వ నంబర్ బే వద్ద పార్కింగ్ చేస్తుండగా అక్కడ ఉన్న ఒక స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విమానం ముందు భాగం దెబ్బతింది. కాగా, ఈ ప్రమాదాన్ని ఇండిగో సంస్థ ధ్రువీకరించింది. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించినట్లు ఇండిగో సంస్థ తెలిపింది. ఆ అధికారులతో కలిసి దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొంది. అయితే ఈ సంఘటన తర్వాత శ్రీనగర్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24T 4873 | Mahender Masampelly | SONALIKA DI 740 | 2019 |
| 2 | TS11UC7308 | Puppala Nagaraju | AL DOST BS6 | 2020 |
| 3 | TS19C 2313 | Suresh kunusothu | JOHN DEERE 5310 HARVESTER (ENGINE) | 2018 |
| 4 | TS27T 4537 | Mohahhad Khasim | SONALIKA DI 740 | 2019 |
| 5 | TS27E 2633 | Bhaskar Gugulothu | ERTIGA VDI BS4 DIESEL 7 SEATER | 2017 |

**AUCTION DATE:05-09-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9000014364 , 98499 11793

# ఇద్దరు మృత్యుంజయులు

- 9 రోజుల తర్వాత సొరంగం నుంచి బయటకు...
- 1,295కు పెరిగిన మృతులు
- వందల మంది పిల్లలు, అధ్యాపకులు గల్లంతు



**ఖాట్మండు:** నేపాల్‌లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. సహాయక కార్యకలాపాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారు. పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ ఆపరేషన్ అద్భుత ఫలితాలనిచ్చింది. భారీ వరదల కారణంగా సొరంగంలో తొమ్మిది రోజుల పాటు చిక్కుకుపోయిన ఇద్దరిని సహాయక సిబ్బంది శుక్రవారం సురక్షితంగా బయటకు తెచ్చారు. దీంతో ఈ ఇద్దరిని మృత్యుంజయులని స్థానికులు అంటున్నారు. సజీవంగా బయటకు రాగలిగిన ఈ ఇద్దరు జల విద్యుత్ ప్రాజెక్టు కార్మికులు కబీర్ మహర్జన్ (45) సంజయ్ సాహ్(30) అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నేపాల్ మంత్రి బిరాజ్ భక్త శ్రేష్ఠ మాట్లాడుతూ ఈ ఆపరేషన్ గురించి మీడియాతో మాట్లాడారు. త్రిశూలి హైడ్రోపవర్ ప్రాజెక్టులోని సొరంగం నుంచి ఒక్కొక్కరు చొప్పున ఇద్దరిని కాపాడగలిగినట్లు తెలిపారు. హోం మంత్రి సుదన్ గురుంగ్ మాట్లాడుతూ కబీర్ మహర్జన్ ప్రాజెక్టులో మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండగా, సంజయ్ సాహ్ ఫోర్‌మెన్ అని తెలిపారు. భారీగా మట్టి, రాళ్లు పేరుకుపోయిన కారణంగా ఈ ఆపరేషన్ అత్యంత కష్టంగా మారిందని నేపాల్ ఆర్మీ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టరేట్ వెల్లడించింది. సైన్యం అధ్వర్యంలోని సంయుక్త బృందం ప్రత్యేక పరికరాలతో గాలింపు చేపట్టి, సొరంగం నుంచి శబ్దాలు వినిపించడటాన్ని గమనించి, చిక్కుకున్న వారితో మాట్లాడేందుకు ఏర్పాటు చేయగలిగారు. నేపాల్ ఆర్మీ, ఆర్మ్ పోలీస్ దళాలు కలిసి సహాయక చర్యల్లో వేగం పెంచారు. చివరకు ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ అద్భుత రెస్క్యూకు సంబంధించి ఫొటోలు, వీడియోలనూ విడుదల చేశారు.

**ఇంకా ఆచూకీ లేని 4,798 మంది**

జల ప్రళయం మతుల సంఖ్య 1,295కు చేరుకుంది. ఎనిమిది జిల్లాల నుంచి మృతదేహాలు లభ్యమయ్యాయని, మరో 4,798 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. 12 వేల మందిని కాపాడినట్లు చెప్పారు. జాడలేని వారి కోసం గాలింపులు కొనసాగుతున్నాయన్నారు. నేపాల్ భద్రతా బలగాల సంయుక్త కమాండ్ అధ్వర్యంలో గాలింపు చర్యలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. అయితే వీరిలో వందలాది మంది పిల్లలు ఉన్నారన్నారు. రసువా జిల్లాలో 280 మంది, నువాకోట్ జిల్లాలో 350 మంది పిల్లలు గల్లంతైనట్లు విద్యా శాఖ ప్రాథమిక సమాచారం. బిదూర్ మున్సిపాలిటీలోనే 250 మంది పిల్లలు గల్లంతయ్యారు.. అక్కడ మొత్తం 170 విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో 142 కమ్యూనిటీ పాఠశాలలు, 28 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. పరిస్థితి విషాదకరంగా ఉందని మున్సిపల్ విద్యా విభాగానికి చెందిన స్కూల్ ఇన్‌స్పెక్టర్ నవ్‌రాజ్ సాపో్కటా తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం వెతుకుతున్నారని, మరికొన్ని చోట్ల పిల్లలు తమ తల్లిదండ్రుల ఆచూకీ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. గల్లంతైన పిల్లల సంఖ్యను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని నువాకోట్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ అండ్ కోఆర్డినేషన్ యూనిట్ అధికారి సూర్య బహదూర్ ఖత్రీ తెలిపారు. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో కచ్చితమైన వివరాలు లేవన్నారు. కొంతమంది ఆచూకీ తెలిసినప్పటికీ చాలా మంది పిల్లల సమాచారం లేదన్నారు. అలాగే, రసువా, నువాకోట్ జిల్లాల్లో 22 మంది టీచర్లు, విద్యా సిబ్బంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. ధాదింగ్, గోర్ఖా ప్రాంతాల ఉపాధ్యాయులు తీర్థ యాత్ర కోసం రసువాకు వెళ్లిన సమయంలో వరదల్లో చిక్కుకున్నారని సమాచారం. రసువా జిల్లాలో 16 మంది టీచర్ల ఆచూకీ లేదని, వీరిలో 15 మంది కమ్యూనిటీ పాఠశాలలకు చెందిన వారు కాగా ఒకరు ప్రైవేట్ విద్యా సంస్థ అధ్యాపకుడని అన్నారు. నువాకోట్‌లో మరో ఆరుగురు ఉపాధ్యాయులు గల్లంతైనట్లు అధికారులు ధృవీకరించారు.

## ఇరాన్‌తో సైనిక ఘర్షణను 'యుద్ధం'గా పిలవలేం

**జెడి వాన్స్ వ్యాఖ్య**



**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య ఆరు నెలలుగా కొనసాగుతున్న సైనిక ఘర్షణను యుద్ధంగా పిలవడం సరికాదని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ అన్నారు. నవంబర్ 3న జరిగే కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల నాటికి ఈ పోరాటం ముగుస్తుందా? అనే ప్రశ్నకు ఆయన ఖచ్చితమైన గడువు చెప్పలేదు. ప్రస్తుతం దాడులు పెద్ద స్థాయిలో జరగడం లేదని, కాబట్టి దీనిని యుద్ధంగా తాను వ్యాఖ్యానించదలచలేదని వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాన్స్ అన్నారు. అయితే, అమెరికా మిత్రదేశమైన కువైట్‌పై ఇరాన్ తాజాగా దాడి చేయడంపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. చేసింది. హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్తున్న వాణిజ్య నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవడం కొనసాగిస్తున్నందున, అమెరికా ఈ వారం జరిపిన దాడులు బాధ్యతగా భావిస్తున్నామని వాన్స్ చెప్పారు. ఇలా ఉండగా, ఈ ఘర్షణ అమెరికాలో రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతోంది. ప్రారంభంలో కొన్ని వారాల్లో ముగుస్తుందని వైట్‌హౌస్ చెప్పినప్పటికీ, ఆరు నెలల తర్వాత కూడా ఎలాంటి ఫలితం రావడం లేదు. చమురు ధరలు, ద్రవ్యోల్బణం పెరగడం అమెరికా వినియోగదారులపై ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో నవంబర్ ఎన్నికల్లో కాంగ్రెస్‌లోని స్వల్ప మెజారిటీలను కాపాడుకోవాలని చూస్తున్న రిపబ్లికన్లకు ఇది సవాలుగా మారింది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 95 డాలర్లకు పైగా ఉంది. ఘర్షణ ప్రారంభానికి ముందు అది సుమారు 72 డాలర్లుగా ఉండేది. ప్రపంచ చమురు సరఫరాలో యుద్ధానికి ముందు సుమారు 20 శాతం హోర్ముజ్ జలసంధి మీదుగా జరిగేది. ఇప్పుడు ఇరాన్ ఈ ప్రాంతాన్ని దిగ్బంధనం చేసింది. ఫలితంగా చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే, అమెరికా నౌకా దళం సహాయంతో బుధవారం సుమారు 15 మిలియన్ బ్యారెళ్ల చమురు తరలించామని వాన్స్ చేసిన ప్రకటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇరాన్‌పై సైనిక చర్య, ఆర్థిక ఒత్తిడి అనే రెండు మార్గాలను అమెరికా ప్రభుత్వం అనుసరిస్తున్నది. అవసరమైతే సైనిక చర్య తీవ్రతను పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడం గమనార్హం.

## మరో నలుగురు లెబనీస్ ఖైదీలను విడుదల చేసిన ఇజ్రాయెల్



**టైర్ (లెబనాన్):** మరో నలుగురు లెబనీస్ ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. సుమారు దశాబ్దకాలం క్రితం చోటుచేసుకున్న లెబనాన్ అంతర్యుద్ధ సమయంలో కొంత మంది యూదులు గల్లంతయ్యారు. వారు మృతి చెంది ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. కనీసం వారి శరీర అవశేషాలను కనుగొనే ప్రయత్నం చేస్తామని లెబనాన్ అంగీకరించడంతో, ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇజ్రాయెల్ నలుగురు ఖైదీలను విడుదల చేసింది. వారిని అంతర్జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ బృందానికి శుక్రవారం అప్పగించింది. ఇజ్రాయెల్ ఇప్పటికే బంధించిన వారిలో హెజ్బొల్లా మిలిటెంట్లతోపాటు సామాన్య ప్రజలు కూడా ఉన్నారని లెబనాన్ ఆరోపిస్తున్నది. అయితే, ఇజ్రాయెల్ మాత్రం ఈ విషయంపై స్పందించలేదు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకే నలుగురు లెబనీస్ ఖైదీలను విడుదల చేసినట్టు ప్రకటించింది.

# క్యూబాపై అమెరికా కొత్త ఆంక్షలు



**హవానా:** క్యూబాలో ఇప్పటికే అనేక సంక్షోభాలు తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో, ఆ దేశ ఆర్థిక వ్యవస్థను మరింతగా దెబ్బతీసే ప్రయత్నంలో భాగంగా అమెరికా ప్రభుత్వం తాజాగా ఆదేశంపై కొత్త ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు మాజీ అధ్యక్షుడు రౌల్ కాస్ట్రో మనవడు ఫిడెల్ ఎర్నెస్టో కాస్ట్రోతో పాటు, క్యూబా ప్రభుత్వానికి చెందిన ఆయిల్ ఇండస్ట్రీ సప్లై ఇంపోర్ట్ కంపెనీ (అబాపెట్) పైన కూడా ప్రభావం చూపుతాయి. క్యూబాలో క్రమంగా క్షీణిస్తున్న విద్యుత్ గ్రిడ్‌ను కొనసాగించేందుకు అవసరమైన ప్రత్యేక పరికరాలు, విడిభాగాలను దిగుమతి చేసుకునే బాధ్యత ఈ సంస్థదేకావడంతో, అమెరికా ఆంక్షల వల్ల విద్యుత్ సరఫరా గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. క్యూబా విద్యుత్ వ్యవస్థకు అవసరమైన కీలక యంత్రాంగాన్ని పనిచేయకుండా చేయడం, తద్వారా ఆ దేశంలో ఇప్పటికే తీవ్రంగా ఉన్న ఇంధన సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయడమే అమెరికా లక్ష్యంగా కనిపిస్తున్నదని ఆబ్సిడియన్ రిస్క్ అడ్వైజర్స్ అనే కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ ప్రిన్సిపల్, ఆంక్షల వ్యవహారాల నిపుణుడు బ్రెట్ ఎరిక్సన్ వ్యాఖ్యానించారు. క్యూబాపై ఒత్తిడిని అమెరికా మరింత పెంచేందుకు ప్రయత్నిస్తోంది అని ఆయన అన్నారు. క్యూబా నుంచి పాలనా మార్పు తప్ప మరే ఇతర మార్పును అంగీకరించే ఉద్దేశం ట్రంప్ ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ఉద్దేశిస్తూ, ఆయన ఈ విషయంలో వెనక్కి తగ్గబోవడం లేదు అని ఎరిక్సన్ అన్నారు. ఆంక్షలను తప్పించుకునేందుకు క్యూబా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అంచనా వేశారు. కాగా, అమెరికా ఆంక్షల నేపథ్యంలో క్యూబా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే అవకాశాలు ఉన్నా యి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్యుత్ సరఫరా, నిర్వహణకు అవసరమైన విడిభాగాలను ఎలా సమకూర్చుకోవాలన్న విషయంలో క్యూబా కొత్త మార్గాలను అన్వేషిస్తున్నది. అయితే, అలా ప్రత్యామ్నాయ మార్గాల్లో పరికరాలను సమకూర్చుకోవడం మరింత ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారుతుందని, దాని ప్రభావంతో ద్రవ్యోల్బణం పెరిగి క్యూబా ఆర్థిక వ్యవస్థ మరింత దెబ్బతింటుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలావుంటే, క్యూబా అంతటా విద్యుత్ కోతలు గతంలో కంటే ఎక్కువగా సాధారణమయ్యాయి. జీర్ణావస్థకు చేరుకున్న విద్యుత్ గ్రిడ్ తరచూ విఫలమవుతుండటంతో, ఇంధన నిల్వలు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో రోజువారీ విద్యుత్ కోతలు 24 గంటలను కూడా దాటుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఈ ఏడాది జనవరి చివరిలో క్యూబాకు చమురు విక్రయించే లేదా సరఫరా చేసే ఏ దేశంపైనైనా సుంకాలు విధిస్తామని హెచ్చరించినప్పటి నుంచి ఈ పరిస్థితి మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితులను తట్టుకోలేక ప్రభుత్వంపై క్యూబా ప్రజలు తిరుగుబాటు చేస్తారని అమెరికా భావిస్తున్నదని, మొత్తం మీద సంక్షోభాన్ని సృష్టించే ప్రయత్నం తీవ్రతరం చేస్తున్నదని పరిశీలకులు అంటున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా, క్యూబా మధ్య జరిగిన చర్చలు ఆ తర్వాత నిలిచిపోయాయి. అదే సమయంలో ఇటీవలి నెలల్లో అమెరికా ఆంక్షలు మరింత పెరిగాయి. క్యూబా ప్రభుత్వానికి చెందిన చిన్నచిన్న సంస్థలను కూడా అమెరికా వరుసగా లక్ష్యంగా చేసుకుంటున్నది. వాటిని పతన చక్రంలోకి నెట్టేందుకు అమెరికా ప్రయత్నిస్తుంది. గతంలోనూ క్యూబాకు చెందిన ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, సహజవాయువు సంస్థలతో పాటు ఇతర సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఈ ఏడాది జూన్ మాసంలో ఆమోదించిన చారిత్రాత్మక ఆర్థిక సంస్కరణలకు సంబంధించిన మరిన్ని వివరాలను క్యూబా అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించిన కొన్ని గంటలకే అమెరికా విదేశాంగ శాఖ తాజా ఆంక్షలను ప్రకటించడం గమనార్హం.

## బర్తరఫ్ బాధాకరం

(మొదటి పేజీ తరువాయి)

ఖండించి ఉండాల్సిందని.. ఖండించకపోవడం వల్లే ఎఐసిసి తీవ్రంగా పరిగణించిందని పేర్కొన్నారు. ఇప్పటికీ కొండా సురేఖ పార్టీలో కొనసాగాలని కోరుకుంటున్నామని చెప్పారు. తనను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని హైకమాండ్‌ను సిఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేశాడన్న సురేఖ ఆరోపణలను మహేష్ గౌడ్ ఖండించారు. ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం సిఎంకు లేదని వివరణ ఇచ్చారు. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని.. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా వేటు తప్పదని హెచ్చరించారు. లీడర్లు తమ సమస్యలు, ఇబ్బందులపై మాట్లాడేందుకు పార్టీలోనే ఎన్నో వేదికలు ఉన్నాయని.. బహిరంగంగా మాట్లాడటం క్షమించరాని తప్పని అన్నారు.

## జైల్ భరో

(మొదటి పేజీ తరువాయి)



అమర్‌జిత్ కౌర్, గిరీశ్ శర్మ, కె.రామకృష్ణలు శుక్రవారం నాడు మీడియాకు వెల్లడించారు.

**దశాబ్దాల తరువాత ఢిల్లీలో అతి పెద్ద సభ**

దశాబ్దాల తర్వాత దేశ రాజధానిలో ఒక వామపక్ష పార్టీ నిర్వహించిన అతిపెద్ద సభకు సెప్టెంబర్ 1న జరిగిన 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీకి రాంలీలా మైదానం ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని రాజా అన్నారు. 'ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన పాదయాత్రలు, ప్రజా సంబంధ కార్యక్రమాలు, సెప్టెంబరు 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'బద్లావ్ జరూరీ హై' సభ విజయవంతం కావడం, 80వేల మందికిపైగా పాల్గొనడం వంటి అంశాలన్నింటిని సమీక్షించాం' అని తెలిపారు. మోదీ ప్రభుత్వ విధానాలతో తమ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న భావన ప్రజల్లో బలపడుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో 'బద్లావ్ జరూరీ హై' అనేది రాజకీయ నినాదంగా కాకుండా ప్రజల మార్పు ఆకాంక్షకు ప్రతీకగా మారిందని ఆయన స్పష్టంచేశారు. అడ్డంకులు, నిర్బంధాలను అధిగమించి ఢిల్లీలో వేలాది మందిని సమీకరించడం ద్వారా సిపిఐ ప్రజా ఉద్యమ సామర్థ్యాన్ని మరోసారి చాటి చెప్పిందని డి.రాజా వెల్లడించారు.

'బద్లావ్ జరూరీ హై' ప్రచారోద్యమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు పలు దశల కార్యాచరణను ఆయన ప్రకటించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబరు 2న దేశవ్యాప్తంగా మత సామరస్య దినం పాటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పెరుగుతున్న మత సామాజిక విభజనకు వ్యతిరేకంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ విముక్తి, విప్లవ ఉద్యమాల్లో కమ్యూనిస్టుల పాత్రతో పాటు భారత స్వాతంత్ర్యోద్యమం, ప్రజాస్వామ్య నిర్మాణంలో కమ్యూనిస్టుల కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. యువతకు కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, ప్రజాస్వామిక వారసత్వాన్ని పరిచయం చేయాలని సిపిఐ నిర్ణయించినట్లు డి.రాజా వెల్లడించారు. దేశవ్యాప్తంగా పది రోజుల పాటు జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకుగాను ఐదు లక్షల మంది అరెస్టులకు సిద్ధం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాల మద్దతును కోరారు. ప్రజా సమస్యలపైనే తమ ఉద్యమం జరుగుతున్నట్లు డి.రాజా తెలిపారు.

### మైనింగ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి

ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించవద్దంటూ 'మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాజా డిమాండ్ చేశారు. ఒడిశా, జార్ఖం డ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి ఖని జ సంపద ఉన్న రాష్ట్రాల హక్కులను ఈ చట్టం దె బ్బతీస్తోందని విమర్శించారు. ఖనిజ వనరుల పై రా ష్ట్రాల అధికారాలను కేంద్రీకరించడం సమాఖ్య వ్య వస్థకు విరుద్ధమని విమర్శించారు. దేశ సహజ వనరులు ప్రజల సంపదేనని, వా టిని కార్పొరేట్ ప్రయోజనాలకు అప్పగించరాదని ఆయన స్పష్టంచేశారు.

### జాతీయ విపత్తుగా అస్సోం వరదలు

అస్సోంలో వరదల బీభత్సం కారణంగా వెయ్యికి పైగా గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని రాజా పేర్కొన్నారు. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి, బాధితుల సహాయ, పునరావాసం, పునర్నిర్మాణానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం, మౌలిక వసతుల పునరుద్ధరణ, పునరావాస చర్యలు చేపట్టాలని కోరారు.

## రాజీపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ఆరా**

దౌలతాబాద్ మండలం గోకఫసల్వాడ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అంశాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ స్కేపింగ్ పనులకు వాడాలని సిఎం సూచించారు. అనంతరం కొండగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సిఎం బస చేశారు. శనివారం కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌ను ప్రారంభించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## తాగునీటికే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఉమ్మడి ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కష్టకాలంలో తాగు నీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని కెఆర్‌ఎంబి స్పష్టం చేసింది. కృష్ణా జలాల పంపిణీపై కొనసాగుతున్న ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు హైదరాబాద్‌లోని జలసౌధలో కెఆర్‌ఎంబి త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. కెఆర్‌ఎంబి సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు తమ ప్రతిపాదనలను బోర్డు ముందుంచారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలలోని ప్రస్తుత నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, నీటి విడుదల విధానంపై సుదీర్ఘంగా చర్చించినప్పటికీ రెండు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడి ఉండటంతో నిర్ణయం తీసుకోలేకపోయారు. త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ అంశాలన్నింటినీ సెప్టెంబర్ 4వ వారంలో నిర్వహించనున్న కెఆర్‌ఎంబి పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో విస్తృతంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నందున తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ ప్రతిపాదించగా, 66:34 నిష్పత్తినే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ పట్టుబట్టింది. ఈ ప్రతిపాదనను తెలంగాణ అధికారులు వ్యతిరేకించారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ తదితర మార్గాల ద్వారా ఆంధ్రప్రదేశ్ అధిక మొత్తంలో నీటిని తరలిస్తోందని తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. మరో వైపు నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయం వద్ద తెలంగాణ అవసరానికి మించి జలవిద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని దిగువకు విడుదల చేస్తోందని ఆంధ్రప్రదేశ్ అధికారులు అభ్యంతరం తెలిపారు. ఈ అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య వాడీవేడిగా చర్చ జరిగినప్పటికీ ఎలాంటి రాజీ కుదరలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ ప్రతిపాదించింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున పాత 66:34 నిష్పత్తిని కొనసాగించడం సమంజసం కాదని తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరాల మేరకు తెలంగాణకు మొత్తం 200 టిఎంసిల నీరు అవసరమని, అందుకు అనుగుణంగా కేటాయింపులు చేయాలని సమావేశంలో కోరినట్లు తెలిపారు. గత మూడేళ్లుగా 66:34 నిష్పత్తిని తెలంగాణ అంగీకరించడంలేదని, పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నీటి తరలింపు జరుగుతోందని ఆయన ఆరోపించారు. అయితే తెలంగాణ ప్రతిపాదన సహేతుకంగా లేదని ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి పేర్కొన్నారు. గతంలో అమల్లో ఉన్న 66:34 నిష్పత్తి ప్రకారమే నీటి విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలని సమావేశంలో కోరినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు రాష్ట్ర తాగునీటి అవసరాల కోసం 104 టిఎంసిల నీరు అవసరమని వివరించారు. తెలంగాణ కోరిన 200 టిఎంసిల కేటాయింపు ఆచరణ సాధ్యం కాదని, పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్న నీరు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన వాటా నుంచే వినియోగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## రాకెట్ ప్రయోగం సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల బరువు ఉన్న ఇఒఎస్–05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్య ంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6 సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307 సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అ ప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన పిఎస్‌ఎల్‌విసి – 62 రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కా రణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన పిఎస్‌ఎల్‌విసి–61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది.

ఈ ఆర్థిక సంవత్సంరలోనే తొలి మానవరహిత మిషన్ మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగం గా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఇఒఎస్–05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇఒఎస్–05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు.

### దేశానికి గర్వకారణం: ప్రధాని మోదీ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సాధించిన చరిత్ర విజయాత్మకాన్ని ప్రధాని మోదీ అభినందించారు. జిఎస్‌ఎల్‌విఎఫ్–17 మిషన్ విజయవంతం కావ డం అంతరిక్ష రంగంలో భారత సాంకేతిక సామర్థ్యానికి మరొక నిదర్శనమంటూ ప్రశంసలు కురిపించారు. జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్ ఇఒఎస్–05.. జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 ద్వారా జరిగిన ఈ విజయవంతమైన ప్రయోగం.. భారత అంతరిక్ష రంగం సాధించిన ప్రగతికి, ఆవిష్కరణలకు, విస్తృత సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న మన అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకువెళ్లడంతో పాటు.. ఈ రంగంలో మన సమర్థతను మరింత బలోపేతం చేస్తున్నారు'' అని మోదీ రాసుకొచ్చారు.

### ఇస్రో శాస్త్రవేత్తలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభినందనలు

జిఎస్‌ఎల్‌విఎఫ్ – 17 రాకెట్ ద్వారా ఇఒఎస్–05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మ రో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దా ర్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు స రికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చా రు.

## చేజారిన పదవి

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్ జగన్‌తో విభేదించి టిఆర్‌ఎస్‌లో చేరి 2014 ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి పోటీచేసి గెలుపొందారు. 2018లో టిఆర్‌ఎస్ టికెట్ నిరాకరించడంతో మళ్ళీ కాంగ్రెస్ టికెట్ పై పరకాల నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2023 సంవత్సరములో వరంగల్ తూర్పు నుంచి పోటీచేసి గెలుపొంది రేవంత్ రెడ్డి కేబినెట్ లో మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. అయితే అంతా సవ్యంగా ఉందనుకున్న తరుణంలో కొండా సురేఖ కూతురు సుస్మిత ఎపిసోడ్ సురేఖను మంత్రి పదవి పోయేదాకా తెచ్చింది.

**ముంచిన కొండా కుటుంబ దూకుడు తత్వం**

మొదట్లో కలిసొచ్చిన దూకుడు తనం కొండా దంపతులకు ఇప్పుడు చేదు అనుభవాన్ని మిగిలించింది. తొలినుంచి ఓరుగల్లు రాజకీయాల్లో కొండా ఫ్యామిలీ ఫైర్ బ్రాండ్ గా పేరు సంపాదించింది. తమను నమ్ముకున్న కేడర్ కోసం ఎక్కడికైనా వెళ్లే తత్వం ఉండడంతో కేడర్ కూడా కొండా దంపతుల వెంట నిలుస్తున్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో శాయంపేట పోలీస్ స్టేషన్ లో అప్పటి పోలీస్ అధికారి గొర్రె మధుతో వాగ్వాదం, కార్యకర్తల కోసం ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగడం వంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్ గా మంత్రి సురేఖ కూతురు సుస్మిత చేసిన సంచలన వ్యాఖ్యలే పదవి పోవడానికి కారణమైంది. కొండాను అనునయించని కేడర్ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ కు గురైన కొండా సురేఖను కేడర్ అనునయించ లేదు. ఆమె సొంత నియోజకవర్గమైన వరంగల్ తూర్పులో, గతంలో ప్రాతి నిధ్యం వహించిన పరకాలలో కేడర్ స్తబ్దుగా ఉన్నారు. హనుమకొండ రాంన గర్ లోని కొండా దంపతుల ఇంటి వద్ద కూడా నిర్మానుష్య వాతావరణం నెల కొంది. వరంగల్ తూర్పులో క్యాంపు ఆఫీసు వద్ద కూడా నిశబ్దం ఆవరించింది. ఇప్పటికే వరంగల్ తూర్పులో కాంగ్రెస్ కేడర్ గ్రూపులుగా విడిపోయి ఉన్నం దున కొండా బర్తరఫ్ తో అంతటా నిర్మానుష్యం నెలకొంది.

**కొండా సురేఖకు అచ్చిరాని మంత్రి పదవి**

సీనియర్ మహిళా ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖకు మంత్రి పదవి అచ్చి రావడం లేదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. రెండు సార్లు మంత్రి పదవి చేపట్టిన ఆమె.. రెండుసార్లూ పూర్తికాలం కొనసాగకుండానే పదవికి దూరమయ్యారు. తొలిసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో చేరిన ఆమె ఏడాదికే మంత్రి పద విని కోల్పోగా.. 13 ఏండ్ల తర్వాత మరోసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండున్నరేండ్లకే పదవి నుంచి వైదొలగాల్సిన పరి స్థితి ఏర్పడింది. 2023లో తిరిగి వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి.. సీఎం రేవంత్రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. మంత్రి హోదాలో ఉన్న సమయంలో కొండా సురేఖ పలు వివాదాలకు కేంద్రబిందువుగా మారారు. తాజాగా ఆమె కుటుంబానికి సంబంధించిన రాజకీయ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీశాయి. మారిన రాజకీయ పరి ణామాల నేపథ్యంలో సురేఖ మంత్రి పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఇలా రాజకీయంగా సుదీర్ఘ ప్రస్థానం ఉన్న సురేఖకు రెండుసార్లు మంత్రి పదవి దక్కినా.. రెండుసార్లూ అనూహ్య పరిణామాలే పదవిని దూరం చేశాయి. దీంతో మంత్రి పదవి సురేఖకు నిజంగానే అచ్చిరావడం లేదా? లేక ప్రతిసారీ పరిస్థి తులే ప్రతికూలంగా మారుతున్నాయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

## ఈస్ట్ జోన్‌తో ఫైనల్..

# తిలక్‌వర్మ బృందంలో సిరాజ్, పడిక్కల్





దేశవాళీ సీజన్ 2025–26 తొలి ట్రోఫీ అయిన దులీప్ ట్రోఫీ ఫైనల్లో భారత స్టార్లు ఆడనున్నారు. శ్రీలంక పర్యటన ముగియడంతో పేసర్ సిరాజ్, యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ ఈ టోర్నీలో బరిలోకి దిగనున్నారు. లంకపై మెరిసిన వీరిద్దరూ సౌత్ జోన్ జట్టు తరఫున చెలరేగనున్నారు. సెప్టెంబర్ 6 ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఈస్ట్ జోన్‌తో ఫైనల్ జరగనుంది. దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ముందే సౌత్ జోన్ జట్టు మరింత పటిష్టంగా మారనుంది. సెమీస్‌లో నార్త్ జోన్‌పై సూపర్ విక్టరీ కొట్టిన సౌత్ బలాన్ని పెంచుతూ.. శ్రీలంకపై సెంచరీలతో చెలరేగిన దేవదత్ పడిక్కల్, ప్రధాన పేసర్ సిరాజ్‌లు జట్టుతో కలువనున్నారు. శ్రీలంకపై మూడు ఇన్నింగ్స్‌లో పడిక్కల్ రెండు సెంచరీలతో 328 రన్స్ సాధించగా.. సిరాజ్ మాత్రం నాలుగే వికెట్లతో నిరాశపరిచిన విషయం తెలిసిందే. ఇప్పటికే కేఎల్ రాహుల్ కూడా స్క్వాడ్‌లో చేరడంతో.. తిలక్ వర్మ కెప్టెన్సీలోని ఆ టీమ్ ఆత్మవిశ్వాసం రెట్టింపు కానుంది. ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ సెమీఫైనల్లో సెంట్రల్ జోన్‌ను చిత్తు చేసి ఫైనల్లో అడుగుపెట్టింది. మరో సెమీస్‌లో నార్త్ జోన్‌పై 7 వికెట్ల విజయంతో టైటిల్ పోరుకు సిద్ధమైంది సౌత్. సెప్టెంబర్ 6 ఆదివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇరు జట్లు అంతిమపోరులో అమీతుమీ తేల్చుకోనున్నాయి.

**సౌత్ జోన్ స్క్వాడ్(అప్డేటెడ్) :** కెఎల్ రాహుల్, దేవ్దత్ పడిక్కల్, కరుణ్ నాయర్, తిలక్ వర్మ(కెప్టెన్), రికీ భూ(వైస్ కెప్టెన్), నారాయణ్ జగదీశన్, కొడమెల హిమతేజ, షేక్ రషీద్, రవిచంద్రన్ స్మరణ్, అభినవ్ తెజ్రన, సిరాజ్, సీవీ మిలింద్, అమన్ ఖాన్, శ్రేయాస్ గోపాల్, కావూరి సాయి తేజ, తనయ్ త్యాగరాజన్, త్రిపురణ విజయ్.

# చైనా మాస్టర్స్ సెమీస్‌లో సాత్విక్ జోడీ

### క్వార్టర్స్‌లోనే కంగుతిన్న శ్రీకాంత్




చైనా మాస్టర్స్ 2026లో భారత డబుల్స్ ద్వయం అదరగొట్టింది. పురుషుల క్వార్టర్ ఫైనల్లో అద్భుతంగా ఆడిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన మూడు సెట్ల పోరులో అస్ట్రుప్ రస్ముసెన్(డెన్మార్క్) జంటను చిత్తు చేసింది సాత్విక్ జోడీ. అయితే.. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. అదిరే ఆటతో క్వార్టర్ ఫైనల్ చేరిన అతడు లీ చీక్ యూ(హాంకాంగ్) చేతిలో వరస సెట్లలో వెనకబడి.. ఓటమి పాలయ్యాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో భారత డబుల్స్ ద్వయం సెమీస్‌లో అడుగుపెట్టింది. శుక్రవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్లో తొలి సెట్‌ను 21–13తో గెలిచిన సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జంట.. ఆపైనా మరింత చెలరేగింది. అస్ట్రుప్ రాస్ముస్సెన్ జంట 16–21తో రెండో సెట్ గెలిచి మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక సెట్లో పంజా విసిరిన భారత ద్వయం 21–18తో మట్టికరిపించింది. డెబ్బై నిమిషాల పోరులో ప్రత్యర్థిని గొప్పగా నిలువరించిన సాత్విక్ జోడీ సెమీస్ బెర్తు దక్కించుకుంది.

**పట్టు సడలించి..** ఇదే ఈవెంట్లో పతకంపై ఆశలు రేపిన కిడాంబి శ్రీకాంత్ మాత్రం క్వార్టర్స్‌లో కంగుతిన్నాడు. శుక్రవారం మ్యాచ్ ఆరంభంలో లీ చెక్ యూపై చకచకా రెండు పాయింట్లు సాధించిన అతడు.. ఆపై ఆదే జోరు చూపలేకపోయాడు. అనూహ్యంగా పుంజుకున్న హాంకాంగ్ ప్లేయర్ అద్భుతంగా భారత షట్లర్‌ను నిలువరించాడు. తొలి సెట్‌ను 21–16తో గెలుచుకున్న లీకి.. రెండో సెట్లో శ్రీకాంత్ షాకిస్తూ వరసగా నాలుగు పాయింట్లు సాధించాడు. కానీ, కాసేపటికే ఆధిక్యాన్ని తగ్గించినా.. భారత ఆటగాడు 15–14తో సెట్ సొంతం చేసుకుంటాడనిపించింది. కానీ, పట్టువదలని లీ.. 21–16తో సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. దాంతో, శ్రీకాంత్ వరసగా అతడి చేతిలో నాలుగో ఓటమి చవిచూశాడు. చివరగా 2018 ఇండియా ఓపెన్‌లో లీపై విజయం సాధించాడీ మాజీ వరల్డ్ నంబర్ 1. హాంకాంగ్ షట్లర్ చేతిలో భారత సీనియర్‌కు ఇది వరసగా నాలుగో పరాజయం. మ్యాచ్ పోయినా కాసింత గర్వపడాల్సిన విషయం ఏంటంటే.. గత మూడేళ్లలో ఒక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్‌లో శ్రీకాంత్ క్వార్టర్స్ ఆడడం ఇదే మొదటిసారి.

## సైన్స్

## గమ్యం లేని తీరాలకు అంతులేని ప్రయాణం



అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' 1977 సెప్టెంబర్ 5న ప్రయోగించిన 'వాయేజర్ I' అంతరిక్ష నౌకను మొదట బృహస్పతి (జూపిటర్), శని (శాటర్న్) గ్రహాలను అధ్యయనం చేయడానికే రూపొందించారు. అయితే దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత అది మానవులు నిర్మించిన వస్తువుల్లో భూమికి అత్యంత దూరంలో ఉన్న అంతరిక్ష నౌకగా నిలిచింది. అంతేకాదు, 'అంతర్‌నక్షత్ర అంతరిక్షం'లోకి ప్రవేశించిన తొలి మానవ నిర్మిత యంత్ర ప్రయాణంగా చరిత్ర సృష్టించింది. 2012 ఆగస్టు 25న హీలియోపాజ్ అనే సరిహద్దును వాయేజర్ I దాటింది. ఈ సరిహద్దు వరకు సూర్యుని అయస్కాంత క్షేత్రం, సౌర గాలుల ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత ప్రారంభమయ్యేది నక్షత్రాల మధ్య విస్తరించిన అంతరిక్షం. ప్రస్తుతం వాయేజర్ I అదే ప్రాంతంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. దానితో పాటు భూమి నాగరికతకు ప్రతీకగా రూపొందించిన ప్రసిద్ధ గోల్డెన్ రికార్డు కూడా తనతో తీసుకెళుతున్నది. ఇందులో భూమిపై జీవజాతులు, సంగీతం, శుభాకాంక్షలు, ప్రకృతి ధ్వనులు వంటి సమాచారం భద్రపరిచారు. వాయేజర్ Iకు సౌర ఫలకాలు లేవు. విద్యుత్ ఉత్పత్తి కోసం అది మూడు రేడియోఐసోటోప్ థర్మోఎలక్ట్రిక్ జనరేటర్లను (ఆర్‌టిజిలను) ఉపయోగిస్తోంది. వీటిలో ఉన్న ప్లూటోనియం 238 సహజ రేడియోధార్మిక క్షయంతో ఉత్పత్తయ్యే ఉష్ణాన్ని విద్యుత్తుగా మారుస్తాయి. అయితే ఈ ప్రక్రియతో లభించే విద్యుత్ ప్రతి సంవత్సరం సుమారు 4 వాట్లు తగ్గిపోతోంది. అందువల్ల శక్తిని ఆదా చేయడానికి నాసా శాస్త్రవేత్తలు ఒక్కో శాస్త్రీయ పరికరాన్ని క్రమంగా నిలిపివేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నాసా లోఎనర్జీ ఛార్జ్ పార్టికల్స్ పరికరాన్ని కూడా నిలిపివేసింది.

## జీవసాంకేతిక రంగంలో వృద్ధి



జీవసాంకేతిక విభాగం (డిబిటి) తాజాగా విడుదల చేసిన 2025 సంవత్సరాంత సమీక్ష ప్రకారం, భారతదేశ జీవసాంకేతిక రంగం గత దశాబ్దంలో అసాధారణ వృద్ధిని సాధించింది. 2014లో కేవలం 10 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువ కలిగిన ఈ రంగం, 2024 నాటికి 165.7 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2030 నాటికి 300 బిలియన్ డాలర్ల లక్ష్యంతో భారత్ వేగంగా ముందుకు సాగుతోంది. ఈ వృద్ధి భారతదేశాన్ని ప్రపంచంలో 12వ అతిపెద్ద బయోటెక్ హబ్‌గా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో 3వ స్థానంలో, ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టంగా నిలిపింది. అలాగే ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ తయారీ దేశంగా భారత్‌కు గుర్తింపు లభించింది. ఈ విజయానికి పునాదిగా ప్రభుత్వ విధానాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశోధన–వాణిజ్యీకరణ మధ్య బలమైన అనుసంధానం ఉన్నాయి. 2025లో దేశంలో తొలి జాతీయ బయోఫౌండ్రీ నెట్‌వర్క్ ప్రారంభించబడింది. దీని ద్వారా దేశీయ బయోమాన్యుఫాక్చరింగ్ సామర్థ్యాలు గణనీయంగాపెరిగాయి. బయోఇ3 విధానం అమలులోకి రావడం ద్వారా బయో ఆధారిత రసాయనాలు, ప్రెసిషన్ బయోథెరప్యూటిక్స్, వాతావరణానికి తట్టుకునే వ్యవసాయంవంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దారితీసింది. యువత ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు డిజైన్ ఫర్ బయోE3 కార్యక్రమం ప్రారంభించబడింది. జీవసురక్షను కాపాడుతూ ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడానికి 2025లో స్టాక్ట్ జన్యుపరంగా మార్పు చేసిన పంటలపై మార్గదర్శకాలు నోటిఫై చేయబడ్డాయి. ఒకే పంటలో రెండు లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలను కలిపే ఈ విధానం వ్యవసాయ ఉత్పాదకతను పెంచే కీలక అడుగుగా నిలిచింది. జీనోమ్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా 10,000 పూర్తి మానవ జీనోమ్ నమూనాలతో జాతీయ జన్యు డేటాబేస్ రూపొందించబడింది. వన్ డే వన్ జీనోమ్ కార్యక్రమం దేశంలోని సూక్ష్మ జీవ వైవిధ్యాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ, వేరు చేసిన బ్యాక్టీరియా జీనోమ్‌లను ప్రతిరోజూ విడుదల చేసే ప్రయత్నంగా నిలిచింది. బయోమెడికల్ పరిశోధనలో మానవవనరుల అభివృద్ధికి బయోమెడికల్ రీసెర్చ్ కెరీర్ ప్రోగ్రాం(బిఆర్‌సిపి) మూడవదశను ప్రారంభించారు. దీని ద్వారా అత్యాధునిక పరిశోధనలకు అవసరమైన శాస్త్రవేత్తలను తయారు చేయడం, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం లక్ష్యంగాపెట్టుకున్నారు. 2025లో డిబిటి సాధించిన విజయాలు అనేకరంగాల్లో స్పష్టంగా కనిపించాయి. ఇది దేశాన్ని స్థిరమైన బయో–ఆర్థిక వ్యవస్థలో ప్రపంచ నాయకుడిగా నిలబెట్టే దిశగా బలమైన పునాది వేసింది.

## పాలపుంతలో కొత్త 'డైసన్ స్ఫియర్'!



ఖగోళ శాస్త్రవేత్తలు పాలపుంత (మిల్కీవే) గెలాక్సీలో ఒక నక్షత్రాన్ని చుట్టుముట్టి, దాని నుంచి వచ్చే శక్తిని సేకరించడానికి ఏర్పడే భారీ అంతరిక్ష నిర్మాణం (డైసన్ స్ఫియర్)గా అనుమానిస్తున్న ఏడు నక్షత్రాలను గుర్తించారు. అయితే ఇవి నిజంగా గ్రహాంతరవాసులు నిర్మించిన కృత్రిమ నిర్మాణాలేనని ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఇవి కేవలం మరింత పరిశోధనకు అర్హమైన అభ్యర్థులు మాత్రమే. శాస్త్రవేత్తలు గైయా, 2 ఎంఎఎస్ఎస్ (మాస్), డబ్ల్యుఐఎస్ఇ (వైజ్) అనే ఆకాశ సర్వేల ద్వారా సేకరించిన సమాచారాన్ని ఉపయోగించి దాదాపు 50 లక్షల నక్షత్రాలను విశ్లేషించారు. సాధారణంగా కనిపించే కాంతిలో సహజంగానే కనిపిస్తూ, మధ్యపరారుణ (మిడ్ ఇన్‌ఫ్రారెడ్) తరంగదైర్ఘ్యాల్లో అసాధారణంగా ఎక్కువ శక్తిని విడుదల చేస్తున్న నక్షత్రాలను వారు ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పరిశోధనలో గుర్తించిన ఏడు నక్షత్రాలూ ఎండ్వార్ఫ్(ఎం డార్ఫ్ లేదా రెడ్ డార్ఫ్) రకానికి చెందినవి. వీటి నుంచి వస్తున్న పరారుణ వికిరణం ప్రస్తుతం తెలిసిన కొన్ని సహజ ఖగోళ ప్రక్రియలతో సులభంగా వివరించలేని విధంగా ఉంది. అందువల్ల వీటిని మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. డైసన్ స్ఫియర్ అనే భావనను 1960లో భౌతిక శాస్త్రవేత్త ఫ్రీమన్ డైసన్ ప్రతిపాదించాడు. అత్యంత అభివృద్ధి చెందిన ఒక నాగరికత తన నక్షత్రం విడుదల చేసే అపార శక్తిని వినియోగించుకోవడానికి, ఆనక్షత్రం చుట్టూ అనేక ఉపగ్రహాలు లేదా శక్తి సేకరణ నిర్మాణాలను ఏర్పాటు చేయవచ్చని ఆయన సూచించాడు. ప్రజాదరణ పొందిన చిత్రాల్లో చూపినట్లుగా అదిపూర్తిగా నక్షత్రాన్ని కప్పేసే ఘన గోళం కావాల్సిన అవసరం లేదు.అనేక చిన్ననిర్మాణాలసముదాయం కూడా పాక్షిక డైసన్ స్ఫియర్‌గా పరిగణించవచ్చు.

# హక్కుల కోసం యువత ఉద్యమించాలి

### 8న ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల బహిరంగసభ విజయవంతానికి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** హక్కులు, సమస్యల పరిష్కారానికి యువత ఉద్యమించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మహాసభల చీఫ్ ప్యాట్రన్ పల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 8న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కెఎం గ్రాండ్ ఫంక్షన్‌హాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు యానాల దామోదర్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేపర్ లీకులు, విద్యావైద్య రంగాల ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్ట వేదికగా జరిగే ఈ మహాసభల్లో యువత సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభల గౌరవ అధ్యక్షుడు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధానాలను ఎండగట్టాలని యువతను కోరారు. యువత సంఘటితమైతే సమాజం మారుతుంది అనే స్ఫూర్తితో సెప్టెంబర్ 8న యాదగిరిగుట్టలో నిర్వహించే భారీ యువజన ప్రదర్శన, బహిరంగ సభకు యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు తీర్వారీ వెంకటేశ్వర్లు, చేపూరి కొండల్, జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమీద్ది శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు




### ఎఐటియుసి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్రం

**ప్రజాపక్షం/జగిత్యాల :** కార్మిక చట్టాల రక్షణకు ఉద్యమాలు చేయాలని ఎఐటియుసి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్రం పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలో సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న ఎఐటియుసి రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ముక్రం మాట్లాడుతూ ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు పోరాటాలకు, విప్లవాలకు, ఉద్యమాలకు ఊపిరిగా ఉన్న కరీంనగర్ గడ్డ మీద జరుగనున్నాయన్నారు. మహాసభకు కార్మిక వర్గం కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎండి.రజాక్, టి.రాజు, బీడీ కార్మికులు భోగ నర్సయ్య, శేఖర్, రాజాం, మహేష్, లత, జయ, జల, నిరోషా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రద్దు చేసిన కార్మిక చట్టాలు పునరుద్ధరించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** రద్దు చేసిన కార్మిక కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని ఎఐటియుసి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 6,7,8 తేదీలలో కరీంనగర్‌లో జరుగుతున్న ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఎఐటియుసి నల్లగొండ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ దోపిడీకి రెడ్‌కార్పెట్ పరుస్తోందని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం సవరణల పేరుతో కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, అవి కార్మిక సంక్షేమానికి మరణ శాసనాలుగా మారాయన్నారు. కనీస వేతనాన్ని రూ. 26,000కు పెంచి అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కెఎస్.రెడ్డి, ఎండి జానీ, దొనకొండ వెంకన్న, గుండె రవి, జి.నరేందర్, వెంకన్న, నాగార్జున, శంకర్ పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం

### ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు పనాస ప్రసాద్




**ప్రజాపక్షం/వరంగల్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తుందని ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు పనాస ప్రసాద్ అన్నారు. వరంగల్ పట్టణం శివనగర్ తమ్మెర భవన్‌లో సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐటియూసి వరంగల్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం కందిక చెన్నకేశవులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలకు వరంగల్ జిల్లా నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ యజమానుల ఆస్తులను పెంచేందుకు కుట్రలు చేస్తూ, కార్మికులు 100 సంవత్సరాలకు పైగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తూ, వారిని బానిస యుగంలోకి తీసుకెళ్లే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కుట్రలపై కార్మికులు అప్రమత్తమై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో అన్నిరంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు, కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై చర్చించి తీర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుంపెల్లి మునీశ్వర్, గుండె భద్రి, ఎండి యాకోబ్, గోవర్ధన్, తాళ్లపల్లి జాన్ పాల్, ఉప్పుల రవి, బోట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


# సింగరేణి భవిష్యత్తును కాపాడుతాం

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/కాసిపేట :** సింగరేణి సంస్థను, కార్మికుల హక్కులను కాపాడటంలో రాజీపడే ప్రసక్తే లేదని, సింగరేణి భవిష్యత్తును కాపాడుకుంటామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట రెండో గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ బోర్డుల విషయంలో సిబి విచారణ జరుగుతున్నందునే వైద్యులు అన్‌ఫిట్ ఇవ్వడానికి జంకుతున్నారని, దీనిపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చి పెర్క్స్‌పై ఆదాయపు పన్ను చెల్లింపు, సహజ మరణానికి రూ.20 లక్షల సాయం, మైనింగ్ సిబ్బందికి పదోన్నతులు, సొంత ఇంటి పథకం సహా 24 అంశాలపై చారిత్రక ఒప్పందం సాధించామని తెలిపారు. గతంలో ఏమీ చేయని నాయకులు తమ ఒప్పందాలను విమర్శించడం విడ్డూరమని, ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సంస్థ పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరో 9 కొత్త గనులను తీసుకొచ్చే బాధ్యత తమదేనని చెప్పారు. కార్యక్రమంలో మిట్టపల్లి వెంకటస్వామి, అక్బర్ అలీ, దాగం మల్లేష్, తిరుపతి, బియ్యాల వెంకటస్వామి, చిప్ప నరసయ్య, మీనుగు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, మంతెన రమేష్, గొల్ల శ్రీనివాస్, కొండపల్లి నరసయ్య, బొద్దుల వెంకటేష్, బొమ్మకంటి సాగర్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె హెచ్చరికతో యాజమాన్యం మెట్టు దిగింది



**చుంచుపల్లి :** ఎఐటియుసి సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, నిరంతర పోరాటం ఫలించాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. కార్మికుల పలు కీలక డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం అంగీకారం తెలిపి అగ్రిమెంట్లు చేసిందని వెల్లడించారు. శుక్రవారం పీవీకే5 గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జూన్ 8న ఎఐటియుసిసమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం ఆర్ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగాయని, ఈ చర్చల ద్వారా అనేక డిమాండ్లపై సానుకూల నిర్ణయాలు సాధించామని తెలిపారు. సాధించిన అగ్రిమెంట్ల అమలును ఎఐటియుసి పర్యవేక్షిస్తుందని, మిగిలిన సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలను ప్రచారానికే పరిమితం చేయకుండా పోరాటాల ద్వారా పరిష్కారాలు సాధించడమే ఏఐటీయూసీ విధానమని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, పిట్ కార్యదర్శులు భుక్యా రమేష్, మధుకృష్ణ, కమల్, సహాయ పిట్ కార్యదర్శి సందీప్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ సాయి పవన్, సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్, సుమన్, ఎస్.రమేష్, నరేందర్, సురేందర్‌రెడ్డి, సంజీవ్, ప్రశాంత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది కొరతతో
# ట్రై కార్పొరేషన్‌లలో ఫైళ్లకు బ్రేక్

**స్తంభించిన భవన నిర్మాణ అనుమతుల మంజూరు ప్రక్రియ**
**ల్యాండ్ అక్విజిషన్ యూనిట్‌లకు మంజూరు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు**
**నాలుగు నెలలుగా ఆర్థిక శాఖలోనే పెండింగ్‌లో ఫైళ్లు**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాటు చేసిన మూడు కొత్త మున్సిపల్ కార్పొరేషన్‌లకు అవసరమైన అధికారులు, సిబ్బందిని సమకూర్చడంలో తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది కొరత కారణంగా ట్రై కార్పొరేషన్‌ల పరిధిలో కీలకమైన ఫైళ్ల పరిష్కారంలో తీవ్ర జాప్యం నెలకొంది. ముఖ్యంగా కార్పొరేషన్‌లకు ప్రధాన ఆదాయ వనరైన భవన నిర్మాణ అనుమతుల మంజూరు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. దీంతో దరఖాస్తుదారులు రోజుల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు నెలకొంది. ఒకవైపు సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ (ఎస్‌ఐఆర్)లో అధికారులు, సిబ్బంది పూర్తిగా నిమగ్నమవ్వగా, మరోవైపు ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరత కారణంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల పనితీరు మరింత దిగజారిపోయింది. భవన నిర్మాణ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తుల్లో ముందుగా భూమి యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డులను కార్పొరేషన్ రెవెన్యూ విభాగం పరిశీలిస్తుంది. ప్రత్యేక కలెక్టర్, తహసీల్దార్, ఉప తహసీల్దార్ స్థాయి అధికారులు పరిశీలించి నిర్ధారించిన అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను పూర్తి చేస్తారు.

**ప్రభుత్వం పట్టించుకొని ప్రతిపాదనలు..**

అయితే రెవెన్యూ విభాగంలోనే సిబ్బంది లేకపోవడంతో మొత్తం ప్రక్రియ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) తమ పరిధిలో భూసేకరణ (ల్యాండ్ అక్విజిషన్) ప్రక్రియలు వేగవంతం చేయడంతో పాటు రెవెన్యూ సంబంధిత వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ల్యాండ్ అక్విజిషన్ యూనిట్‌ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 1, 2026న పురపాలక శాఖ నుంచి వచ్చిన మెమోకు స్పందిస్తూ సిఎంసి, ఎంఎంసి కమిషనర్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపించారు. సిఎంసి, ఎంఎంసి ప్రతిపాదనలో మొత్తం 21 రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. వీటిలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (1), డిప్యూటీ కలెక్టర్ (1), స్పెషల్ తహసీల్దార్లు (3), స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్లు (6), డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (3), సర్వేయర్లు (6) పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులను రెవెన్యూ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై భర్తీ చేయాలని ప్రతిపాదించారు. అయితే సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లు పంపిన సిబ్బంది ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరి నాలుగు నెలలు గడిచినా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ప్రస్తుతం ఈ ఫైల్ ఆర్థిక శాఖ పరిశీలనలోనే మగ్గుతున్నట్లు సమాచారం. దీంతో కీలకమైన పరిపాలనా వ్యవహారాలు, భూసేకరణ, నిర్మాణ అనుమతుల మంజూరు ప్రక్రియలలో జాప్యం నెలకొంటుంది.

**ఉన్నవారిపైనే అదనపు భారం..**

సిఎంసి, ఎంఎంసి శివారు ప్రాంతాలు కావడంతో అత్యధిక శాతం భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన దరఖాస్తులు వస్తాయి. సిబ్బంది కొరత కారణంగా సిఎంసి, ఎంఎంసిలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వారిపైనే అదనపు భారం పడుతుంది. సిఎంసిలో కేవలం ఒక తహసీల్దారు మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగిలిన వారు మొత్తం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లతోనే నెట్టుకొస్తున్నారు. ఎంఎంసిలో మాత్రం మొత్తం ముగ్గురు మాత్రమే భూసేకరణ రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. స్పెషల్ డిప్యూటి కలెక్టర్, అదనపు తహసీల్దార్, ఒక కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉన్నారు. తక్కువ మంది సిబ్బందిపైనే భారీ ఎత్తున పనిభారం పెరిగిపోయింది. దీంతో ఫైళ్లు పేరుకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో పాటు దరఖాస్తుదారుల నుంచి వచ్చే ఒత్తిళ్లతో ప్రస్తుతం ఉన్న సిబ్బంది, అధికారులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. తీవ్రమైన ఒత్తిళ్లకు తోడు అదనపు పనిభారంతో ఉన్న సిబ్బంది సైతం సెలవులు పెట్టి పోయే పరిస్థితులు ట్రై కార్పొరేషన్‌లలో నెలకొన్నాయి.

**స్వయంగా సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖపైనే నిర్లక్ష్యం..**

స్వయంగా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖ పరిధిలోని కార్పొరేషన్‌ల పరిస్థితే ఈ విధంగా ఉంటే, ఇక ఇతర శాఖల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు స్వయంగా స్పందించి ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప, ఈ పోస్టులకు అనుమతులు వచ్చి కార్పొరేషన్‌లలో ఫైళ్ల కదలిక వస్తుందనే నమ్మకం లేదని సిఎంసి, ఎంఎంసి అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత ఇలాగే కొనసాగితే భవన నిర్మాణ అనుమతుల రూపంలో కార్పొరేషన్‌లకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడే ప్రమాదం ఉందని, దీనిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ట్రై కార్పొరేషన్‌లలో పరిపాలన గాడిన పడాలంటే ముందుగా సిబ్బంది కొరతను తీర్చడం అత్యవసరమని స్పష్టం చేస్తున్నారు.



## వెయ్యి రోజులుగా కెసిఆర్ మొద్దు నిద్ర!

### కుంభకర్ణుడి కటౌట్‌తో కాంగ్రెస్ వినూత్న నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలకు దూరంగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వెయ్యి రోజులుగా మొద్దు నిద్రలో ఉన్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కేసీఆర్ ఇకనైనా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోతా రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గాంధీభవన్ నుంచి గన్‌పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి కెసిఆర్ తీరును నిరసించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఫొటోతో కూడిన కుంభకర్ణుడి భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మాజీ కార్పొరేటర్లు రమణ గౌడ్, సంతోష్ గుప్తా, సంగీత యాదవ్, సీనియర్ నాయకులు పండిట్ తివారీ, కనయ్య లాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరిదర్, రాహుల్‌తో పాటు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## 6న బిఆర్‌ఎస్‌ఎల్‌పి సమావేశం

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కెసిఆర్ అధ్యక్షతన భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ నెల 7వ తేదీ నుంచి తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రతిపక్ష బిఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలు, విధివిధానాలపై దిశానిర్దేశం చేసేందుకు బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు(కెసిఆర్) ఈ నెల 6న శాసనసభాపక్ష (బిఆర్ఎస్ఎల్‌పి) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో మధ్యాహ్నం 1 గంటకు భోజనం అనంతరం 2 గంటలకు ఈ కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కెసిఆర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న ‘22ఎ నిషేధిత జాబితా’ వివాదాన్ని అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోపే పరిష్కరించాలని బిఆర్‌ఎస్ ఇప్పటికే ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించింది. లేనిపక్షంలో సభను అడ్డుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో, ఈ అంశంతో పాటు ఇతర ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఎలా నిలదీయాలనే దానిపై పార్టీ గులాబీ బాస్ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు.



క్రీడల్లో ప్రతిభ కనబరిచే

## విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం

### లాక్రోస్ విజేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన సౌత్ ఈస్ట్ కోస్ట్ లాక్రోస్ ఛాంపియన్‌షిప్2026లో భారత మహిళా జట్టు కాంస్య పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించిన బిసి గురుకుల విద్యార్థినులు పి.గోపిక, సంగీతలను ఆయన ఘనంగా సత్కరించారు. శాలువాతో సన్మానించి అభినందించిన మంత్రి, ఇద్దరికీ చెరో రూ.25 వేల నగదు బహుమతితో పాటు ప్రయాణ ఖర్చుల కోసం రూ.1.76 లక్షలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి దేశానికి, తెలంగాణకు, బిసి గురుకులాలకు పేరు తీసుకురావడం గర్వకారణమన్నారు. గోపిక, సంగీత ఐదో తరగతిలోనే బిసి గురుకుల పాఠశాలలో చేరారని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. లాక్రోస్‌లో వారి ప్రతిభను గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించామని, గతంలో కర్నూలు, చెన్నైలో జరిగిన సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాలు సాధించారని వివరించారు. తాజాగా మలేషియా పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించారని తెలిపారు. విద్యార్థినులకు శిక్షణ అందించిన లాక్రోస్ కోచ్‌లు పరమేశ్, ఆకాష్, ప్రిన్సిపాల్ శ్రీలతలను మంత్రి అభినందించారు.

## మహిళలను కించపరిస్తే సహించేది లేదు

### బిఆర్‌ఎస్ నేతలకు మంత్రి సీతక్క హెచ్చరిక



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మహిళలను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క బిఆర్‌ఎస్ నాయకులను హెచ్చరించారు. మహిళలు ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా జీవించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబులు కావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని ఎంఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరసింహ అధ్యక్షతన నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తన శాఖ ద్వారా ఇప్పటికే సుమారు రూ.300 కోట్ల నిధులు మంజూరు చేశామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయిస్తామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు కుట్టుమిషన్లు, పాఠశాల యూనిఫాం కుట్టే కాంట్రాక్టులు కల్పించడంతో పాటు ప్రతి నియోజకవర్గంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, గోదాములు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత మూడేళ్లలో మహిళా సంఘాలకు సుమారు రూ. 61 వేల కోట్ల రుణాలు, ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. మహిళలు తమకు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. ‘‘మహిళ సంతోషంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుంది.. కుటుంబం సంతోషంగా ఉంటే సమాజం సంతోషంగా ఉంటుంది’’ అని అన్నారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదుగుతుండటాన్ని ఓర్వలేక బిఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీతక్క విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణంపై విమర్శలు చేస్తున్న వారు ఉచిత సన్నబియ్యం, ఉచిత విద్యుత్‌ను ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన మహిళా సంఘాలను కాంగ్రెస్ ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. ‘అమ్మకు అక్షరమాల’ కార్యక్రమం ద్వారా సుమారు ఆరు లక్షల మంది మహిళలను అక్షరాశ్యులను చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి 15 వేల పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేశామని, రిటైర్మెంట్ సమయంలో అంగన్‌వాడీ టీచర్‌కు రూ. 2 లక్షలు, ఆయాకు రూ.లక్ష అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని మాటిచ్చారు.ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ మంత్రి సీతక్కను ఆదర్శంగా తీసుకుని తాను పొలిటికల్ సైన్స్ చదువుతున్నానన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సీతక్క నిరూపించారని కొనియాడారు.

## రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యం

### అన్ని ఏరియాల జిఎంలకు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ ఉత్పత్తి, రవాణాను మరింత పెంచాలని సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశించారు. రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు స్పష్టం చేశారు. సింగరేణి భవన్ నుంచి శుక్రవారం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలతో ఆయన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు అందించడం ప్రభుత్వ బొగ్గు సంస్థల బాధ్యతగా పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రతను దృష్టిలో పెట్టుకుని సింగరేణి శక్తివంచన లేకుండా ఉత్పత్తి, రవాణా పెంచాలని సూచించారు.ఆగస్టు 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలలు పూర్తయ్యాయని, ఈ కాలంలో సింగరేణి 253 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేయగా, అందులో 90 శాతానికి పైగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేసినట్లు అధికారులు సిఎండికి వివరించారు. ఏరియాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన ఆదేశించారు.నైనీ బొగ్గు గని నుంచి సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి తొలి రైల్వే రేకుతో బొగ్గు సరఫరా చేసినట్లు సిఎండి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి కూడా ఇటీవల మరో రేకు సరఫరా చేశామని చెప్పారు. ఇకపై రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నైనీ బ్లాక్ నుంచి రాష్ట్ర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తామని వెల్లడించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాతో పాటు ఓవర్ బర్డెన్ తొలగింపుపైనా సిఎండి సమీక్షించారు. ఆగస్టు నెలాఖరుకు ఆఫ్‌లోడింగ్ ద్వారా 1,315 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబి తొలగించినప్పటికీ ఇది నిర్దేశిత లక్ష్యంలో 95 శాతమేనని తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు ఉన్నందున రోజువారీ లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. రైల్వే అధికారులతో సమన్వయం చేసుకుంటూ బొగ్గు రవాణాలోనూ 100 శాతానికి పైగా లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. రక్షణ ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడానికి అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావుతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

## అలీసాగర్ ఆయకట్టుకు
## సాగునీటి విడుదలకు అనుమతి

**సుదర్శన్‌రెడ్డి,భూపతిరెడ్డి చొరవతో సాగునీటి విడుదల, అధికారులకు ఆదేశం జిల్లా రైతులు హర్షం వ్యక్తం**

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీరందించేందుకు నీటిపారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చొరవతో నిజాంసాగర్ నుంచి గుత్ప, అలీసాగర్ లిఫ్ట్‌లకు నీటిని విడుదల చేసేందుకు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో ప్రధానంగా వరి పంట సాగవుతుండగా, పంటలు కీలకమైన పొట్టదశలో ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గుత్ప, అలీసాగర్ ఎతిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సీజన్ లోసాగునీరందించేందుకు నీటి పారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నీటిని విడుదల చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశించటం జిల్లాలో ప్రధానంగా వరి పంట సాగవుతుండగా పంటలు కీలకమైన పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథఖాల పరిధిలోని ఆయకట్టుకు నిజాంసాగర్ నుంచే నీ టిని విడుదల చేసి రైతులకు సకాలం లో సాగునీరందించాలని మంత్రిని కో రారు. అలీసాగర్, గుత్ప లిఫ్ట్‌లకు ప్ర తి 10 రోజులకోకసారి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాల ని, ప్రస్తుతం పంటలకు అత్యంత కీలకమైన దశ కావటంతో తక్ష ణమే నీటి విడుదల చేయాలని మంత్రిని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెం ట నే స్పందించి నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఈమేరకు అలీసాగర్ పరిధిలోని 48 వేల ఎకరాలకు, గుత్పలోని 35 వేల ఎకరాలకు కలిపి 83 వేల పైచిలుకు ఎకరాలకు ప్రయోజనం చేకూరేలా నీటిని విడుదల చేయనున్నారు. రోజుకు 1500 క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఎ మ్మెల్యే తెలిపారు. గుత్ప, అలీసాగర్ ఆయకట్టు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్పం దించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, మ ంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భూపతిరెడ్డి జిల్లా రైతు లు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి విడుదలకు అనుమతితో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## శిరీష కుటుంబానికి కూనంనేని పరామర్శ

### రూ. కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** భద్రాద్రి జిల్లా చౌటిగూడెంలో శిరీష కుటుంబాన్ని శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పరామర్శించి, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. శిరీష పని చేసిన ఆస్పత్రిలో సరైన భద్రతా వసతులు లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని డిజిపితో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐ తరపున శిరీష దశ దిన కర్మలకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర నాయకులు నరాటి ప్రసాద్, నాయకులు యండి యూసుఫ్, నరాటి రమేష్, పువ్వాల లలితారావు, అనుముల సాయి, వీరూనాయక్, రంజిత్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## జుక్కల్ సమీపంలో..
## ఆర్‌టిసి బస్సు ప్రమాదం

- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జుక్కల్ ఎక్స్ రోడ్డు దాటి బిచ్కుంద సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ డిపోకు చెందిన బస్సు నెం. టిఎస్34జడ్0030 సర్వీస్ నెం. బిసికె3, హైదరాబాద్ నుంచి బిచ్కుంద వెళుతుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో బిచ్కుంద రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఎండి, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి ప్ర మాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నా రు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ ఆంజనేయులు బస్సు కింద చిక్కుకుని మృతి చెందటం తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి పేర్కొన్నారు. మృతుడి కు టుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బస్సులో మొత్తం 13 మంది ప్రయాణీకులున్నారని, వారందరూ సురక్షితంగా బయట పడ్డప్పటికీ కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. గాయపడిన ప్రయాణీకులను అంబులెన్స్‌ల ద్వారా సమీపంలోని ఆస్పత్రికి త రలించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం, మెరుగైన వైద్య సేవలందించాలని అధికారులను మంత్రి ఆదేశించా రు. అవసరమైన అన్ని వైద్య సహాయ చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు. అలాగే ఆర్‌ఎం నేతృత్వంలో అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని బాధితులకు అవసరమైన అన్ని విధాలుగా అండగా నిలవాలని మంత్రి ప్రభాకర్ ఆదేశించారు. ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై పూర్తి వివరాలను తెలుసుకుని, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు.

## రైతుల భూములకు 22-ఎ ఉచ్చు

### రైతు సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తాం
### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/కౌటాల :** భూములు 22ఏ నిషేధి త జాబితాలో ఉండటం వల్ల సిర్పూర్ నియోజకవర్గంలోని వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను ప్రభు త్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు డిమా ండ్ చేశారు. జగిత్యాల జిల్లా కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రైతులు, భూ నిర్వాసితుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు నిషేధిత జాబితాలో చేరడంతో క్రయవిక్రయాలు జరగక, బ్యా ంకుల నుంచి రుణాలు అందక ఇబ్బందులు ప డుతున్నామని రైతులు వాపోయారు. అనంతర ం హరీష్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 42,672 ఎకరాలు, ఒక్క కౌటాల మండలంలోనే 6,350 ఎకరాల భూములు 22ఎ జాబితాలో చిక్కుకున్నాయని తెలిపారు. పట్టాలు ఉ న్నా హక్కులు వినియోగించుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చి రైతులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ఈ సమస్యపై శాసనసభలో ప్రస్తావించి రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ మా జీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎ మ్మెల్యే కోవలక్ష్మి , మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్న య్య, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నడిపెల్లి దివాకర్, ఎర్రొల శ్రీను, స్థానిక సర్పంచ్ నక్క శంకర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## గర్భసంచి ఆపరేషన్ కోసం వెళ్లిన మహిళ కిడ్నీ మాయం?

**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు పట్టణంలోని అర్పిత నర్సింగ్ హోం ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భసంచి ఆపరేషన్ చేయించుకున్న యాదగిరిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి కమలమ్మకు కిడ్నీ తొలగించారంటూ ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. గర్భసంచికి సంబంధించిన ఆపరేషన్ కోసం ఆసుపత్రికి తీసుకెళ్లగా, అనంతరం వైద్య నివేదికల్లో కిడ్నీ కనిపించ లేదని వారు పేర్కొన్నారు.దీంతో ఆగ్రహానికి గురైన బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గర్భసంచి ఆపరేషన్ చేయాల్సిన మహిళకు కిడ్నీకి సంబంధించిన సమస్య ఎలా తలెత్తిందో అధికారులు స్పష్టంగా తేల్చాలని కోరారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులను పోలీసులు విరమింపజేసే ప్రయత్నం చేయగా, తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. అనంతరం అర్పిత నర్సింగ్ హోం వైద్యుడు డాక్టర్ ప్రభాకరన్ను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కమలమ్మకు ఆపరేషన్‌కు ముందు, అనంతరం నిర్వహించిన స్కానింగ్ నివేదికలు, వైద్య పరీక్షలు, పాత వైద్య రికార్డులు, ఆపరేషన్ వివరాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కుటుంబ సభ్యులు కోరారు. ఆరోపణల్లో వాస్తవం తేలితే సంబంధిత వైద్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై అధికారుల విచారణతోనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## మచ్చ లేని నాయకుడు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : మచ్చ లేని నాయకుడు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అని భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తీ అన్నారు. యాదాద్రి వెయ్యి రోజులలో ఒక్కసారి కూడా ప్రజా సమస్యల గురుంచి మాట్లాడని గనుడు కేసీఆర్ అని హెద్దేవ చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలకు రూ.206 కోట్లు విడుదల చేయించిన ఘనత కుంభం అనిల్ కుమార్ రెడ్డికే దక్కిందాన్నారు. భువనగిరిలో అనేక అభివృద్ధి కార్యక్రమలు జరుగుతుంటే ఓర్వలేకనే ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని ఇప్పటి వరకు రూ.1500 వందల కోట్లతో భువనగిరి నియోజకవర్గన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి చేసిన సవాల్‌ని కాంగ్రెస్ పార్టీ స్వీకరిస్తున్నామని చర్చకు ఎప్పుడొస్తారో శేఖర్ రెడ్డి చెప్పాలని అవైస్ చిస్తీ డిమాండ్ చేశారు.

## కార్మిక, వ్యతిరేక విధానాలపై ఎఐటియుసి పోరాటం

### ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయంతం చేయాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఈనెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఏఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ రాజారామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఐటియుసి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సెప్టెంబర్ 6న జరుగు కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. 7, 8 తేదీల్లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలపై స్పష్టమైన వైఖరితో అజెండాతో ముందుకు వెళ్తున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అని అలాంటి సంఘం మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ దేశంలో, రాష్ట్రంలో పరిపాలిస్తున్న పాలకుల యొక్క పనితీరును మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను దిశానిర్దేశం చేసే విధంగా ఈ మహాసభలు జరుగుతాయన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ సర్కార్ కార్మిక చట్టాల సవరణ పేరుతో నల్ల చట్టాలను ముందుకు తీసుకువచ్చిందన్నారు. ఆ చట్టాలను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదనే విధంగా తీర్మానాలు చేపడుతామన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానానికి, స్కీమ్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనియెడల మరో పోరాటానికి సిద్ధం కావల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బొంకూరు శ్యాంసుందర్, నియోజక వర్గ గౌరవ అధ్యక్షులు కోట రామస్వామి, నరసయ్య, నజీర్, వెంకన్న, ఆంధ్రయ, హైమద్ ఖదీర్, శ్రీనివాస్, సత్యం, బిక్షపతి, యాకూబ్, సైదులు, మహేష్, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రికి నూతన భవనం మంజూరి చేస్తున్నట్లు నకిరేకల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి అసెంబ్లీ సమావేశల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వాసుపత్రి ఎదుట కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎం.డి.జహంగీర్ మాట్లాడుతూ రామన్నపేట మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ప్రస్తుతం ఆసుపత్రిలో సరిపడా పడకలు,వైద్య సిబ్బంది, అవసరమైన మౌలిక వసతులు లేకపోవడంతో, శిథిలావస్థకు చేరిన భవనంతో పేద ప్రజలు దూర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు.

# రేవంత్ సభకు రాజగోపాల్‌రెడ్డి వస్తారా?

### నల్లగొండ సభకు దూరం.. నేడు సొంత గడ్డపై సిఎం సభ

### రేవంత్‌తో వేదిక పంచుకుంటారా.. దూరంగానే ఉంటారా?



**ప్రజాపక్షం/నల్లగొండ:** నకిరేకల్ వేదికగా శనివారం జరగనున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభకు భారీగా జన సమీకరణ చేపట్టడంతో పాటు నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే సభ కంటే కూడా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారా..లేదా.. అన్నదే ప్రస్తుతం ప్రధాన రాజకీయ చర్చగా మారింది. రాజగోపాల్‌రెడ్డి సొంత ఊరు నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల కావడం,అది నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయన హాజరుపై ఉత్కంఠ నెలకొంది.

**నల్లగొండ సభకు దూరంగా..**

ఈ ఉత్కంఠకు మరో కారణం ఉంది.గత జూన్ 28న నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న భారీ సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరుకాలేదు. కనగల్‌లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) రోడ్ల పైలాన్ ఆవిష్కరణతో పాటు నల్లగొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సభకు హాజరైనప్పటికీ రాజగోపాల్‌రెడ్డి మాత్రం దూరంగా ఉన్నారు.

అనంతరం ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి తనకు నచ్చకపోవడంతోనే నల్లగొండ సభకు వెళ్లలేదని రాజగోపాల్‌రెడ్డి చెప్పినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అదే సమయంలో ముఖ్యమంత్రితో తాను టచ్‌లోనే ఉన్నానని ఆయన పేర్కొన్నట్లు సమాచారం.

**నేడు సొంత గడ్డపై.. ఏం జరుగుతుంది?**

ప్రస్తుతం నకిరేకల్‌లో సీఎం సభ జరగనున్న నేపథ్యంలో గత పరిణామాలతో పోల్చితే ఈ సభకు మరింత రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీ అంతర్గత వ్యవహారాలు,పాత కాంగ్రెస్‌కొత్త కాంగ్రెస్ వ్యాఖ్యలు,ప్రభుత్వ పనితీరుపై రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే చర్చకు దారితీశాయి.ఈ నేపథ్యంలో బ్రాహ్మణవెల్లెంలకు సమీప ప్రాంతం,తన రాజకీయ ప్రస్థానంతో అనుబంధం ఉన్న నకిరేకల్ గడ్డపై జరిగే సీఎం సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరవుతారా అన్నది ఆసక్తికరంగా మారింది.

**వేదిక పంచుకుంటే.. సంకేతం మారుతుందా**

రాజగోపాల్‌రెడ్డి సభకు హాజరై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వేదిక పంచుకుంటే..ఇటీవల ఇద్దరి మధ్య నెలకొన్న రాజకీయ దూరంపై భిన్నమైన సంకేతాలు వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు నల్లగొండ సభ తరహాలో నకిరేకల్ సభకు కూడా ఆయన దూరంగా ఉంటే.. పార్టీలో అంతర్గత విభేదాలపై చర్చ మరోసారి ఊపందుకునే అవకాశం ఉంది.ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు,ఎమ్మెల్యేలు,ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఈ సభలో రాజగోపాల్‌రెడ్డి కనిపిస్తారా లేదా అన్నదే ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.జూన్‌లో నల్లగొండ సభకు దూరమైన రాజగోపాల్‌రెడ్డి..సెప్టెంబర్ 5న నకిరేకల్ వేదికపై రేవంత్‌రెడ్డితో కలిసి కనిపిస్తారాలేక తన దూరాన్ని కొనసాగిస్తారా ఈ ప్రశ్నకు నేటి సభే సమాధానం చెప్పనుంది.



## 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వాలి

**ప్రజాపక్షం/కోదాడ:** వ్యవసాయానికి విధిస్తున్న విద్యుత్ కోతలను తక్షణమే రద్దు చేసి రైతులకు 24 గంటల విద్యుత్ కోతలను నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు సబ్ స్టేషన్ గేట్లు మూసివేసి రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎడిఈ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ 24 గంటల ఉచిత్ విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లు రామకృష్ణ, పోటు నరేష్, సామినేని సుబ్బారావు, శేషయ్య, వెంకటేశ్వర్లు, పూర్ణచందర్‌రావు, వెంకటరామయ్య, బొల్లు నరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

# సిఎం సభకు సర్వం సిద్ధం

### ఏర్పాట్లను పరిశీలన..ఎంపి చామల,ప్రభుత్వ విప్ వేముల



**ప్రజాపక్షం/నకిరేకల్:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం నకిరేకల్ పట్టణానికి రానున్న నేపథ్యంలో మినీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రజా వికాస సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం పరిశీలించారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో నెంబర్ చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న,పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,మాజీ జెడ్పిటిసి అలుగుబెల్లి రవీందర్ రెడ్డి కిరణ్, వీరార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

**కట్టంగూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

కట్టంగూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డును భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం కలసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం,పేద కుటుంబాల అభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వారు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్య తీసుకుంటుంది అన్నారు.కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా సన్నబియ్యం పొందవచ్చునని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలోబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంబయ్య,తహశీల్దార్ పుష్పలత,జ్యోతి, మాదయాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

### సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట** : జిల్లాలో నమోదవుతున్న కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల తీరుతెన్నులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, కోర్టు కేసుల పరిస్థితి, అట్రాసిటి కేసులు, సెంటర్ కంప్లైంట్ సెల్ ఫిర్యాదులు, 30 రోజుల్లో చార్జిషీట్ దాఖలు, ఫోక్సో కేసులు దర్యాప్తు తదితర అంశాలపై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తులో జాప్యం లేకుండా కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత సమయంలో దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ కేసులకు సంబంధించిన వివరాలను నిరంతరం సమీక్షిస్తూ, కేసుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతోపాటు సాక్ష్యాధారాల సేకరణ, కేసు డాక్యుమెంటేషన్, కోర్టు విచారణకు అవసరమైన సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఫోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, దర్యాప్తుకు అత్యంత ప్రాధాన్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి, నిర్ణీత సమయంలో చార్జిషీట్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పోలీస్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం పెంచాలి

### ఉద్యోగ భద్రత కల్పించాలి..టార్గెట్లు,అదనపు పనులు నిలిపివేయాలి బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం తక్షణమే అమలు చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.అనంతరం అదనపు కలెక్టర్‌కు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సిలివేరు ప్రభాకర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గర్భిణుల నమోదు,ప్రసవాల పర్యవేక్షణకు సంబంధించిన ఏఎన్‌సీ టార్గెట్లను ఎత్తివేయాలని,ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లో విధులు నిర్వహించే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఆశా కార్యకర్తలపై అదనపు పనిభారం మోపకుండా చూడాలని, ఆన్‌లైన్ పైప్‌లైన్, ఎన్‌సీడీ, అభా తదితర పనులను వారితో చేయించడం నిలిపివేయాలని కోరారు. ఆశా కార్యకర్తలకు వర్తించే అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలోఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





## అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా

### ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా అని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ బిఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలుపై నల్లగొండ క్లాక్ టవర్ లేదా మిర్యాలగూడ రాజీవ్ చౌక్ కేంద్రంగా బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్న సమయంలో రైతు ధర్నా పేరిట అబద్ధాలు ప్రచారం చేయడం తగదన్నారు. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడడంలో దిట్ట అని, ఆయన వ్యాఖ్యలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రాహుల్ డిక్లరేషన్‌ను ఆచరణలో చూపిస్తూ రూ.21 వేల కోట్లు ఒకే విడతలో రైతు రుణమాఫీ కింద విడుదల చేసిందని వివరించారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గిన పరిస్థితుల్లో పంటలను కాపాడేందుకు ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని గుర్తు చేశారు. ప్రజా ధనాన్ని దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్న కేటీఆర్, కేసీఆర్ రూ.17 వేల కోట్ల అవినీతి సొమ్మును బీఆర్ఎస్ ఖాతాలో డిపాజిట్ చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతతో పనిచేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ దశాబ్ద పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కనీసం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేని నాయకులు నేడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామ పరిధిలోని రిక్కల సత్తిరెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన సిపిఐ నాయకులు,ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి శంకర్ కుమారుడి వివాహానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



## నీళ్ల పేరుతో బిఆర్ఎస్ నికృష్ట రాజకీయాలు

### రైతు ధర్నా చెయ్యాల్సిన అవసరం ఏముంది ? జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నీళ్ల పేరుతో నికృష్ట రాజకీయాలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని తన పదేళ్ల కాలంలో రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర కలిగిన బి ఆర్ఎస్ రైతుల గురించి ధర్నా చేయడం చాలా విడ్డూరంగా ఉందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్‌యాదవ్ కేటీఆర్‌పై మండిపడ్డారు. శుక్రవారం స్థానిక మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మిర్యాలగూడ రైతులకు వరి పంట పండించడం కేసీఆర్, జగదీశ్‌రెడ్డి నేర్పించినట్లు కేటీఆర్ బడాయి కబుర్లు చెపుతున్నాడని నాగార్జునసాగర్ కట్టింది కాంగ్రెస్ పార్టీ అని, మిర్యాలగూడ రైతులకు దశాబ్దాలు గా నీళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని కేటీఆర్ గుర్తుంచుకోవాలని అన్నారు. నీళ్ల గురించి బీఆర్ఎస్ చెబితే నేర్చుకోవాల్సిన ఖర్మ కాంగ్రెస్ పార్టీకి లేదని, కేటీఆర్ మాటలు తాతకు దగ్గులు నేర్పినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు పడలేదు ఏడాది అంతా ఇదే పరిస్థితి ఉంటుందని ప్రస్తుత పరిస్థితుల్లో సాగు నీరు కంటే తాగు నీరు ముఖ్యం అందుకే ఆరు తడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం చెబుతోందని, ఈ పరిస్థితి రైతులు కూడా అర్థం చేసుకున్నారని కానీ కేటీఆర్‌కు అర్థం కావడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయంలో పార్టీలో ఉన్న వారికే పథకాలని నేడు ఆ పరిస్థితి మారి అందరికీ అందుతున్నాయని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమాలు ఉధృతం

### బుల్లెట్ ట్రైన్ కారిడార్ అఖిలపక్షాల పోరాట కన్వీనర్ ప్రొఫెసర్ జానకి రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దశాబ్దాలుగా సూర్యాపేటకు రవాణా సౌకర్యం కల్పించడం పాలకుల నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూ వచ్చిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మార్చే కుట్రపై అఖిలపక్షాల ఆధ్వర్యంలో తిరుగుబాటు కొనసాగిస్తామని జాతీయ రహదారి వెంట బుల్లెట్ ట్రైన్ కొనసాగించడమే లక్ష్యంగా ఉద్యమాలు చేస్తామని బుల్లెట్ ట్రైన్ కారిడార్ అఖిలపక్షాల పోరాట కన్వీనర్ ప్రొఫెసర్ జానకి రెడ్డి అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సద్దల చెరువులో జరిగిన సామూహిక జలదీక్షలో ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సూర్యాపేటకు వచ్చే బుల్లెట్ ట్రైన్ దారి మళ్లించుటకు చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే కేంద్రం ప్రకటించిన విధంగా మొదటి అలైన్మెంట్ బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి 65కు సమాంతరంగా కొనసాగేలా ప్రకటించాలని ఆలస్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్ర రాజధానితోపాటు దేశ రాజధానిలో పెద్దఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు పెద్దిరెడ్డి రాజా, డాక్టర్ రామ్మూర్తి, జుట్టుకొండ సత్యనారాయణ, ధర్మార్జున్, డేవిడ్ కుమార్, మట్టిపెల్లి సైదులు, చల్లమల్ల నరసింహ, భూపతి రాములు, బూర మల్సూర్ గౌడ్, యాదగిరి రావు, పోలెబోయిన కిరణ్, పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో పేదలకు లబ్ధి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పట్టణంలో శివాజీ నగర్ నుండి క్లాక్ టవర్ వరకు వికాస యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రకుల పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని,దళిత బహుజనుల ఆత్మీయ బంధువుగా మారారని కొనియాడారు. ఫాంహౌస్‌లో పడుకున్న కేసీఆర్, కేటీఆర్‌లు ప్రజా పాలనను విమర్శించడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దోచుకున్న బీఆర్ఎస్‌కు నిరసన తెలిపే నైతిక హక్కు లేదని, 2029లో మళ్లీ రేవంత్ రెడ్డే సీఎం అవుతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు బోడ స్వామి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగని మాధవి,దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న వెంకటేశ్వర్లు, కొండమల్లేపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.



గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై నిర్మిస్తున్న చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

రీల్



# బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో 'కృష్ణంభజే'

జయశ్రీ మీడియా సమర్పణలో తెరకెక్కుతున్న భక్తిరస చిత్రం 'కృష్ణంభజే' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కలాల్ శ్రీనివాస్ నిర్మాణంలో నాగరాజ్ కొట్టే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మాజీ మార్కండేయ పాత్రను పోషిస్తున్నారు. కృష్ణాష్టమి కానుకగా బ్రహ్మాజీ 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో లాంచ్ చేశారు. పోస్టర్‌లో బ్రహ్మాజీ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బ్రహ్మాజీ మార్కండేయుడి గెటప్‌లో సంప్రదాయ ఆధ్యాత్మిక రూపంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాషాయ వస్త్రధారణ, రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి, చేతిలో ఆయుధంతో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతిబింబంగా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. పౌరాణిక, భక్తిరస అంశాలను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగరాజ్ కొట్టే రచనతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథకు అనుగుణంగా ప్రత్యేకమైన పాత్రలు, ఆసక్తికరమైన సన్నివేశాలతో సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ప్రదీప్, వంగమయి పటేల్ నటిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన సంభాషణలను రచ్చ రవి అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. త్వరలోనే టీజర్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: శ్రీరాం గుప్త, సినిమాటోగ్రఫీ: . రాము సి.ఎం సూర్య మీసాల, సంగీతం: మంథెన త్రినాథ్ సత్య సామేష్, ఎడిటర్: జి. రాకేష్ గౌడ్, కొరియోగ్రఫీ: ఎ.ఆర్. బాబు బాలకృష్ణ, ఫైట్స్: రవి తేజ.

# 18న 'హ్యాపీ జర్నీ' విడుదల



గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై నిర్మిస్తున్న చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'హ్యాపీ జర్నీ' ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్లో విమానాశ్రయం బ్యాక్‌డ్రాప్‌లో చిత్రంలోని ప్రధాన తారాగణం అంతా సందడిగా, సరదాగా కనిపిస్తున్నారు. ట్రావెల్ బ్యాగులు, బ్యాక్‌గ్రౌండ్‌లో విమానం, పేపర్ ప్లేన్ మోటిఫ్ సినిమాకు సంబంధించిన ట్రావెల్ థీమ్‌ను హైలైట్ చేస్తున్నాయి. ఈ పాత్రలు సాగించే ప్రయాణం వారి జీవితాలపై చెరగని ప్రభావాన్ని చూపించబోతోందనే విషయాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా హార్ట్ వార్మింగ్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. విడుదల తేదీ ఖరారు కావడంతోమేకర్స్ ప్రమోషన్స్‌ను మరింత ముమ్మరం చేసి, సినిమాపై బజ్‌ను మరింత పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్ నిర్వర్తిస్తున్నారు.

# కమల్ కొత్త లుక్ వైరల్



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ కొత్త సినిమా ప్రకటించింది. ఈ చిత్రానికి ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ఆర్‌కెఎఫ్ఐ (రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్), టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై నిర్మించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమా వరల్డ్ వైడ్ ఆసక్తిని పెంచుతోంది. పవర్‌ఫుల్‌గా కనిపించే లుక్‌కు చేతిలో పట్టుకున్న ఆయుధం మరింత ఇంటెన్స్‌నెస్ తీసుకొచ్చింది. ఎంతో కూల్‌గా కనిపిస్తూనే, భారీ ఆయుధంతో నడుస్తున్న కమల్ హాసన్ లుక్..ఈ లుక్ టెస్ట్‌కు సంబంధించిన కొన్ని గ్లింప్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి 'సేతుపతి', 'చిత్తా' వంటి సినిమాలతో ఎస్.యు. ఆయన కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం ఈ కొత్త ప్రాజెక్ట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తవడంతో సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

# 'అతిగా ఆలోచించకురా' సాంగ్ రిలీజ్



డిజె టిల్లు' చిత్రంతో సెన్సేషనల్ డెబ్యూ చేసిన దర్శకుడు విమల్ కృష్ణ, రాగ్ మయూర్ కథానాయకుడిగా నటిస్తున్న మరో యునిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'అనుమాన పక్షి'తో అలరించబోతున్నారు. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హీరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే టీజర్, విభిన్నమైన ప్రమోషనల్ కంటెంట్ ఆసక్తిని పెంచింది.తాజాగా 'అతిగా ఆలోచించకురా' అనే ఫన్ సాంగ్ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సినిమా హీరో క్యారెక్టర్ను ఫన్గా ప్రజెంట్ చేస్తోంది. క్యారెక్టర్ స్వభావాన్ని, అతని ఆలోచనా విధానాన్ని సరదాగా చూపిస్తూ పాట సాగుతుంది. పాట విడుదలైన వెంటనే మంచి ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. ఈ పాటకు శ్రీచరణ్ పాకాల ఆకట్టుకునే ట్యూన్ సమకూర్చారు. సాన్వి, రవి ప్రకాష్ చోడిమళ్ల కలిసి ఆలపించారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించారు.'డిజె టిల్లు'తో తనదైన క్యారెక్టరైజేషన్, హ్యూమర్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు విమల్ కృష్ణ 'అనుమాన పక్షి'తో మరో వైవిధ్యమైన కాన్సెప్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో మెరిన్ ఫిలిప్ కథానాయికగా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, రాశి, అనన్య, చరిత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.సినిమాటోగ్రాఫర్ సునీల్ కుమార్ నామా, శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ అందిస్తున్నారు. జెకె మూర్తి ఆర్ట్ డైరెక్టర్‌గా, అభినవ్ కునపరెడ్డి ఎడిటర్‌గా పని చేస్తున్నారు.'అనుమాన పక్షి' సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుంది.



# 'లీసా' షూటింగ్ పూర్తి

ఓంసాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లీసా'. విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభావంతురాలైన నటి అనన్య నాగళ్ల ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. జవహర్ పవార్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని విధంగా రెండు భిన్నమైన జోనర్‌లను సరికొత్త పద్ధతిలో మేళవించి 'లీసా' కథను రూపొందించారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సతీష్ రెడ్డి మాసం ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు స్క్రీన్‌ప్లే సమకూర్చి, సహ నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. 'ఎస్సార్ కళ్యాణమండపం' దర్శకుడు శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తున్నారు కథ నచ్చడంతో 'మెలోడీ బ్రహ్మ' మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందించడానికి సుముఖంగా ఉన్నారు, ఇది సినిమాకు ప్రధాన బలంగా నిలవనుంది. కూర్గ్, విరాజ్పేట, పెంచలకోన పరిసర ప్రాంతాల్లోని అద్భుతమైన లొకేషన్లలో అత్యున్నత నిర్మాణ విలువల (రిచ్ ప్రొడక్షన్ వేల్యూస్) తో భారీ స్థాయిలో ఈ సినిమాను చిత్రీకరించారు. అనన్య నాగళ్ల, అల్లాల రవిరెడ్డి గారు, సుమన్, మూసా అలీ ఖాన్, రత్నాకర్ రెడ్డి, జబర్దస్త్ సత్యశ్రీ, గడ్డం నవీన్, ఆకెళ్ల, సుజాత, సుజి, మానస, శ్యామ్, వెన్ని, జాను వర్మ, హనుశ్రీ తదితరులు నటించారు.



# నిర్మాతలకు ఏటా రూ.50 లక్షల ఇన్సూరెన్స్

## ప్రోగ్రెసివ్ ప్యానెల్ మేనిఫెస్టో విడుదల
## 6వ తేదీన నిర్మాతల మండలి ఎన్నికలు

తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఎన్నికలు ఈ నెల 6వ తేదీన ఫిలిం ఛాంబర్ ప్రాంగణంలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రోగ్రెసివ్ ప్యానల్ మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో ఇప్పటికే ప్రెసిడెంట్‌గా సి.కళ్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికవగా, మిగితా పోస్టులకు పోటీ నెలకొంది. ఈ సందర్భంగా శుక్రవారం మేనిఫెస్టో విడుదల అనంతరం మీడియాతో మాట్లాడారు. మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాలన్నీ పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నామని నిర్మాతలు దామోదర్ ప్రసాద్, నటుడు అశోక్ కుమార్ వెల్లడించారు. నిర్మాతలకు వైద్య భద్రత, అత్యవసర సహాయం కింద వెంటనే ఐదు లక్షల రూపాయల క్యాష్ లెస్ మెడికల్ ఇన్సూరెన్స్ అందుబాటులోకి తెస్తామని, ఏటా యాభై లక్షల వైద్య సహాయనిధి ఏర్పాటు చేస్తామని చెప్పారు. 306 మంది సభ్యులను ఒకేసారి మినిమం ఫీజు తీసుకుని అందరికి లైఫ్ మెంబర్ షిప్ ఇస్తామని పేర్కొన్నారు. కొత్త నిర్మాతలకు ప్రోత్సహం, సింగిల్ విండో ద్వారా నిర్మాతలకు హెల్ప్ డెస్క్, కంటెంట్ ఫెసిలిటేషన్ వంటి సదుపాయాలను నిర్మాతలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. మహిళా సభ్యుల భద్రత కోసం కౌన్సిల్ నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ఆన్ లైన్ టికెటింగ్, అధికంగా వసులు చేస్తున్న కన్వీయన్స్ ఫీజులు, మల్టి ప్లెక్స్ థియేటర్లలో సామాన్యుడికి భారంగా మారిన ఆహార పానీయాల ధరలపై ప్రభుత్వ శాఖలతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.మన ప్యానల్ నుంచి పోటీ చేస్తున్న కొందరు నిర్మాతలను చీడ పురుగులు అని వ్యాఖ్యానించడం సరైంది కాదని, ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. కనీసం సభ్యుల లిస్టు కూడా ఇవ్వలేదని, ఇలాంటి పరిస్థితుల్లోనే తాను కోర్టుకు వెల్లాసి వచ్చిందని నటుడు అశోక్ చెప్పారు. ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో ఆర్‌కె , ముత్యాల రామాంజనేయులు, మైత్రి రవి, రవీంద్ర గోపాల మాట్లాడారు.

# పత్రికా స్వేచ్ఛపై పాశవిక దాడి

## మహిళా జర్నలిస్టులకు సిపిఐ సంఘీభావం
## దాడిపై స్వతంత్రసమగ్ర దర్యాప్తుకు డిమాండ్



**న్యూఢిల్లీ:** మోదీ పాలనలో పత్రికా స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులు హరిచిపోతున్నట్లు ష సిపిఐ విమర్శించింది. ప్రజాస్వామ్య విలువలను నీరుగారుస్తుండటాన్ని తప్పుపట్టింది. న్యూఢిల్లీలోని సాకేత్ పోలీస్ స్టేషన్‌లో మహిళా జర్నలిస్టులు షాహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌పై దాడిని తీవ్రంగా ఖండించింది. ఇది ఇద్దరు జర్నలిస్టులపై జరిగిన దాడి మాత్రమే కాదని...పత్రికా స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా సీపీఐ విమర్శించింది. ఇద్దరు జర్నలిస్టులకు మద్దతు ప్రకటించింది. షాహీన్ ఖాన్ ముస్లిమని పోలీసులకు తెలిసిన తర్వాత ఈ దాడి తీవ్రత మరింత పెరిగిందన్న ఆరోపణలు ఆందోళనకరమని పేర్కొంది. మహిళా జర్నలిస్టులపై భౌతిక దాడి, వారి మతపరమైన గుర్తింపును లక్ష్యంగా చేసుకుని అవమానించడం, పోలీస్ స్టేషన్‌లోనే దురాగతాలకు పాల్పడటం హేయమంటూ దుయ్యబట్టింది. ఈ దాడిపై స్వతంత్ర, నిష్పాక్షిక, కాలపరిమితితో కూడిన సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేసింది. బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి, వారిని చట్టపరంగా శిక్షించాలని కోరింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్వర్యంలో ఢిల్లీ పోలీసుల వ్యవహారశైలి చట్టపరమైన పరిమితులు, పోలీసు నిబంధనలు, రాజ్యాంగపరమైన జవాబుదారీతనాన్ని పట్టించుకోని స్థాయికి దిగజారిందని సిపిఐ విమర్శించింది. విద్యార్థుల ఉద్యమంపై జులై 20న జరిగిన పోలీసు చర్యలు, పెల్లెట్ గన్స్ వినియోగం, మతతత్వవాద సంస్థల కార్యకర్తలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోవడం వంటి పరిణామాలను గుర్తుచేసింది. విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ... రాజకీయ అనుబంధమున్న వ్యక్తుల విషయంలో ఉదాసీనత వైఖరి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సిపిఐ పేర్కొంది. ఢిల్లీ పోలీసుల తీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిని చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేసింది. ఇదే క్రమంలో సిపిఐ కార్యదర్శులు అనీరాజా, రామకృష్ణ పాండాతో పాటు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధూ, ఏఐవైఎఫ్ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగ రాజ్ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో షాహీన్ ఖాన్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

# నిరసనలో ఖైదీలా?

## అమిత్‌షా సమాధానమేమిటి: డి.రాజా

**న్యూఢిల్లీ:** ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా జరిగిన విద్యార్థుల నిరసనను నేరపూరితంగా చిత్రీకరించేందుకు దిల్లీ పోలీసుల ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) వ్యవస్థను దుర్వినియోగం చేశారా అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఎక్స్ మాధ్యమంగా ప్రశ్నించారు. ముఖ గుర్తింపు డేటాపై ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశీలన ఈ వ్యవహారంపై అనుమానాలకు తావిచ్చినట్లు పేర్కొన్నారు. 'హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలలో నిందితులుగా ఉన్న వారిని నిరసనల్లో గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అలా గుర్తించిన కనీసం 25 మంది జైల్లో ఉన్నట్లు జైలు, పోలీసు, కోర్టు రికార్డులు వెల్లడిస్తున్నాయి. జైలులో ఉన్న వ్యక్తులు జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలో ఎలా కనిపించారు? ఇది ఎలా సాధ్యం? వారిని అక్కడికి ఎవరు తీసుకొచ్చారు? అధికారిక అనుమతితోనే వాళ్లను బయటకు తెచ్చారా? పోలీసులే తరలించారా? ఈ వ్యక్తుల పేర్లు నిరసనలో ఉన్నవారిగా ఎలా నమోదయ్యాయి?' అని డి.రాజా వరుస ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలు దిల్లీ పోలీసుల విశ్వసనీయతను నిలదీస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఇది సాధారణ సాంకేతిక తప్పిదమా లేక విద్యార్థుల ఉద్యమంపై నేర ముద్రకు వ్యూహాత్మక కథనమా అని సూటిగా ప్రశ్నించారు. హింస, హత్య లేదా లైంగిక దాడి వంటి నేరాల్లో నిందితులుగా ఉన్న వారని చెప్పడం వెనుక ఆ నేరాల నిందను విద్యార్థులపైకి నెట్టే ప్రయత్నం జరిగిందా అంటూ డి.రాజా ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెపాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని తన పోస్టులో పేర్కొన్నారు. ముఖ గుర్తింపు సాంకేతికత ఒక వ్యక్తిని నేరస్తుడిగా 'గుర్తించింది' అని చెబితే సరిపోదని... దానిని ధవీకరించడానికి ఆధారాలు కావాలని సూచించారు. సంబంధిత ఫుటేజీ ఎప్పటిది? ఏ సందర్భంలో తీసినది? గుర్తించిన వ్యక్తుల కదలికలను జైలు రికార్డులతో ఎందుకు సరిపోల్చలేదు? ఖైదీలు నిరసన స్థలంలో ఉన్నట్లు పోలీసు డేటా ఎలా చూపించింది? వంటి ప్రశ్నలకు పారదర్శకమైన సమాధానాలు, వివరణను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇవ్వాలని డి.రాజా డిమాండ్ చేశారు. దిల్లీ పోలీసులపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని, విద్యార్థి ఉద్యమాన్ని నేరపూరితంగా చూపించేందుకు అధికారిక వ్యవస్థలను దుర్వినియోగించడం నిజమైతే... ప్రజాస్వామ్యబద్ధ నిరసన హక్కుపై అత్యంత తీవ్రమైన దాడి చేయడమే అవుతుందని డి.రాజా వ్యాఖ్యానించారు. నిజాన్ని ఎంతో కాలం కప్పిపుచ్చలేరని, ఏదో ఒక రోజు నిజం తప్పకుండా బయటకు వస్తుందని ఆయన స్పష్టంచేశారు.

# చర్యలేవి?

(మొదటి పేజీ తరువాయి)

ఇది హత్యాయత్నమని, సంబంధిత సెక్షన్‌ను చేర్చాలని మేము పోలీసులపై ఒత్తిడి తెస్తూనే ఉన్నాము. వారు దళిత కుటుంబానికి చెందినవారు అయినందున ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశాము. ఈ వ్యవహారంలో కులపరమైన కోణం కూడా ఉంది. కానీ పోలీసులు అటువంటి చర్యలేవీ తీసుకోలేదు. మేము ఒత్తిడి తెచ్చినప్పుడు కోర్టును ఆశ్రయించి ఉత్తర్వు తెచ్చుకోమని వారు మాకు చెప్పారు' అని ఆయన అన్నారు. భరద్వాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవడంలో ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారని సిజెపి ఆరోపించింది. సంజయ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. నిరసనకారులు ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్వతంత్ర భరద్వాజ్‌ను 72 గంటల్లోగా అరెస్టు చేస్తామని ఢిల్లీ పోలీసులు హామీ ఇచ్చినట్లు 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. అయితే సంజయ్ తల పగిలిందన్న వాదనలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు. ఘర్షణ సమయంలో ఆయనకు స్వల్ప గాయం మాత్రమే అయిందని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వారు పేర్కొన్నారు. కాగా జంతర్ మంతర్ నిరసనలో తమ మద్దతుదారుడికి గాయాలయిన ఘటనకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేయాలని కోరుతూ సిజెపి కార్యకర్తలు గుమిగూడటంతో పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్ బయట పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్, సిజెపి నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాకు మద్దతు తెలిపేందుకు పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. సిజెపి నాయకురాలు నిషు ఆజాద్, ఆమె తండ్రి సంజయ్‌కు న్యాయం చేయాలని కోరుతూ ఆయన వారితో గళం కలిపారు. అశుతోష్ రాంకా విలేకరులతో మాట్లాడుతూ 'జంతర్ మంతర్ వద్ద మేము చేపట్టిన నిరసనలో మా మద్దతుదారులలో ఒకరైన నిషు ఆజాద్ తండ్రి సంజయ్ జీపై దాడి జరిగింది. దీనివల్ల ఆయన తలకు గాయాలయ్యాయి. నిందితులను అరెస్టు చేసి, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సౌరవ్, మా బందం అనేక సార్లు డిమాండ్ చేసినప్పటికీ, ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. తామే సంజయ్ జీపై దాడి చేశామని, ఆయన్ని చంపడానికి ప్రయత్నించామని ఆ ఘటనలో పాల్గొన్న వ్యక్తులు బహిరంగంగానే అంగీకరిస్తున్నారు. అయినప్పటికీ కపిల్ మిశ్రా, బిజెపి కార్యకర్తల ప్రభావంతో ఢిల్లీ పోలీసులు వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇది దేశానికి, మన ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటైన రోజు. మొదటి నుంచీ మా బందం మొత్తం సంజయ్ జీకి అండగా నిలిచింది. ఘటనలో తమ ప్రమేయం ఉందని స్వయంగా చెప్పుకున్న వారిని ఢిల్లీ పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, తగిన సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని తెలిపారు. జంతర్ మంతర్ నిరసనలో దాడికి గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యకర్త తండ్రి సంజయ్ మాట్లాడుతూ 'మేము అన్యాయంపై పోరాడుతున్నప్పుడు, ప్రభుత్వంపై గళం విప్పుతున్నప్పుడు 'జై భీమ్' అని నినదిస్తాము. కొందరికి 'జై భీమ్' అనే నినాదం పట్ల సమస్య ఉంది. వారు అభ్యంతరం వ్యక్తం చేస్తారని మాకు తెలుసు. అందుకే అక్కడ 'జై భీమ్' నినాదాలు కూడా చేశాము. నిరసన సమయంలో నాపై దాడి జరిగింది. నేను ఫిర్యాదు చేశాను. కానీ గూండాలను, నేరస్థులను కాపాడి, బాధితుడిని బలహీనపరచడమే పోలీసుల పనిగా కనిపిస్తోంది' అని అన్నారు. శుక్రవారం నాటి సిజెపి నిరసనలో స్వతంత్ర ఎంపీ పప్పుయాదవ్ పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అక్షయ్ లక్రా మాట్లాడుతూ ఈ కేసులో సెక్షన్ 307 (హత్యాయత్నం) చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో మేము ఈ రోజు పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాము. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఇప్పటికే కేసు నమోదు చేశామని పోలీసులు ధ్రువీకరించారు. దీనితో పాటు స్వతంత్ర భరద్వాజ్‌పై సెక్షన్ 307ను కూడా నమోదు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని తెలిపారు.

# పోలవరం ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

రాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన మంత్రి.. తెలంగాణలో సంభవించే ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల నాటికి తెలంగాణ ఎంపీలు, గోదావరి పరివాహక ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి పోలవరం ప్రభావంపై వివరించి, ప్రాజెక్టును పునఃపరిశీలించాలని కోరుతామని తెలిపారు.

**ముక్కోటి నాటికి ఉత్తర ద్వార పనులు పూర్తి చేయాలి**

భద్రాచలం శ్రీ సీతారామయచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ముక్కోటి నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులు పూర్తి చేయాలని శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణలతో కలిసి ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటికి ఐటీడీఏ పీఓ రాహుల్, ఆలయ ఈవో దామోదర్, తహశీల్దార్ రవి కుమార్, ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే ముక్కోటి ఉత్సవాల నాటికి ఉత్తర ద్వార అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, వచ్చే ఏడాది శ్రీరామనవమి ఉత్సవాల నాటికి మిగిలిన ఆలయ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే 2027లో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభం నాటికి గోదావరి ఘాట్లు, పరివాహక ప్రాంత అభివృద్ధి పనులు సిద్ధం చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.276 కోట్ల నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. నిర్మాణాల్లో నాణ్యతా లోపాలకు తావులేకుండా, దశాబ్దాలపాటు పటిష్టంగా ఉండేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కల్పించాల్సిందే


(మొదటి పేజీ తరువాయి)

తొగుట, రాంపూర్ ప్రాంతాలకు చెందిన రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ఈ తీర్పు ఇచ్చారు. జీవో 214లో పునరావాస వ్యయాన్ని భూ పరిహారం నుంచి వేరు చేసినందున రెండూ వేర్వేరు ప్రయోజనాలని పేర్కొంది. 2017 చట్ట సవరణకు 2014 జూన్ 2 నుంచి పూర్వప్రభావం ఉన్నందున అర్హులైన రైతులకు పునరావాస హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ప్రతి పిటిషనర్ అర్హతను అధికారులు విడిగా పరిశీలించి, వాదనలు విన్న అనంతరం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఇప్పటికే పొందిన ఇళ్లు, ఇతర ప్రయోజనాలను లెక్కలోకి తీసుకుని మిగిలిన ప్రయోజనాల్లో సర్దుబాటు చేయాలని, ఒకే ప్రయోజనం రెండు సార్లు ఇవ్వొద్దని పేర్కొంది. దరఖాస్తు తిరస్కరిస్తే కారణాలతో ఉత్తర్వులు ఇవ్వాలని, ఉత్తర్వుల ప్రతులు అందిన ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేసి అర్హులకు ప్రయోజనాలు కల్పించాలని ఆదేశించింది. జీవో 123, 214ల చట్టబద్ధతపై ఈ తీర్పులో అభిప్రాయం చెప్పడం లేదని, ఆ అంశం డివిజన్ బెంచ్ పరిధిలో ఉందని తెలిపింది.

# కాంగ్రెస్ మహా ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మహా ధర్నాలో కాంగ్రెస్ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ధర్నా ఏర్పాట్లపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి రెండు జిల్లాల డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జులు, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారు. మహా ధర్నాను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, ఏర్పాట్లపై సమావేశంలో చర్చించనున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com